POSTAL REG. NO.KNR/010/2014-2016

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2002 /12105

23.2.2024 శుక్రవారం | సంపుటి : 10 సంచిక : 224 | పేజీలు : 12 వెల : రూ. 4/- | Follow :

తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

గద్దెలపై కొలువుదీరిన సమ్మక్కసారలమ్మ

వన దేవతల రాకతో గద్దెలవైపు కిక్కిరిసిన జనం

- నిర్విఘ్నంగా పూర్తయిన అమ్మవార్ల రాక
- భక్త జనసంద్రంగా మారిన మేడారం
- నేడు మేడారం జాతరకు సిఎం రేవంత్
- భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు

మేడారం, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :
మేడారం మహా జనసంద్రమైంది. తల్లుల కోసం నలుదిశల నుంచి పరుగు పరుగున తరలివచ్చిన బిడ్డలతో మహారణ్యం జనారణ్యమైంది. ఎటుచూసినా జనమే జనం. అమ్మగద్దెలను దర్శించుకోవాలని వస్తున్న జనం అంతా చీమల దండులా కనిపిస్తోంది. జంపన్నవాగులో జనం స్నానాలను ఆచరించి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. మేడారం జాతరలో » మిగితా 2లో

ఇండియా కూటమిలో సర్దుబాట్లు కొలిక్కి

- ఢిల్లీలో నాలుగింట ఆప్.. మూడింట కాంగ్రెస్ పోటీ
- ఇరు పార్టీల మధ్య కుదిరిన ఎన్నికల సయోధ్య

2

ఉద్దేశపూర్వకంగా కరెంటు కట్ చేశారో.. సస్పెండౌతారు జాగ్రత్త!!

విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సీఎం ఆగ్రహం

- ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే కుట్రలను సహించేది లేదని హెచ్చరిక
- కావాలనే కరెంట్ కట్ చేస్తున్నారని మాకు సమాచారం ఉంది: సీఎం రేవంత్ రెడ్డి
- కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు
- విద్యుత్ శాఖ సమీక్షలో మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :
రాష్ట్రంలో ఎక్కడైనా అకారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇప్పుడున్న అవసరాలకు సరిపడేంత విద్యుత్తును ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ప్రభుత్వం తరఫున ఎక్కడా విద్యుత్తు కోతలను విధించటం లేదని సీఎం స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా పెరిగిందని చెప్పారు. ఇటీవల పలు చోట్ల విద్యుత్తు సరఫరా నిలిపేసిన సంఘటనలపై ముఖ్యమంత్రి విద్యుత్తు శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు.
ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు, విద్యుత్తుపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అటువంటి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. గతంతో పోల్చితే విద్యుత్ సరఫరా పెంచినప్పటికీ, కోతలు పెడుతున్నారంటూ జరుగుతున్న » మిగితా 2లో

మరో రెండు గ్యారంటీల అమలుకు సర్కారు సిద్ధం

- గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ల పథకానికి 27 లేదా 29న ముహూర్తం
- స్కీం అమలుకు అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

వేసవిలో నీటి ఎద్దడి ఉండొద్దు

- తాగునీటి సరఫరాకు తొలి ప్రాధాన్యత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

గంగుల ఇక కటకటాల్లోకే?

కీలక ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ముఖ్య అనుచరులంతా ఇప్పటికే జైలుపాలు

- బయటపడుతున్న కేసులన్నింటిలో ఆయనపై ఆరోపణలు
- నిందితుల విచారణలోనూ స్టేట్‌మెంట్‌లు రికార్డు
- మాజీ మంత్రి అరెస్టుకు త్వరలోనే రంగం సిద్ధం!

నకిలీ ధ్రువపత్రాల కేసులో మరొకరు అరెస్ట్

కొత్తపల్లికి చెందిన 15 గుంటల స్థలానికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన కేసులో మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రధాన అనుచరుడు నందెల్లి మహిపాల్ సహా ఇటీవలే 9మందిపై కేసు నమైదన విషయం విదితమే. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎర్రం కనకారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారికి రిమాండ్ విధించారు. తాజాగా అదే కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న గంగాధర మండలం గట్టుబూత్కూరుకు చెందిన మాజీ సర్పంచ్ గంగాధర కనకయ్యను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించి జైలుకు పంపారు.

కరీంనగర్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :
అధికారం మాటున జరిగిన భూ బాగోతాలు కరీంనగర్ జిల్లాతో పాటు తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఓ పోలీసు అధికారి పట్టుదల బాధితులకు ఉపశమనం కలిగించగా.. అక్రమార్కులు, అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరిని బయటకు లాగి చెరసాల్లోకి నెట్టిన పోలీసులు.. మాజీ మంత్రి అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. అరెస్టయిన నిందితులంతా'ఆయన ఆదేశాల మేరకే చేశాం' అని వాంగ్మూలం ఇస్తున్నట్టు చర్చ దరిమిలా అన్ని వ్యవహారాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ నేతకిక ఉచ్చుబిగియడం ఖాయంగా కనిపిస్తోంది. ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ఆ మాజీ మంత్రి ఎవరో ప్రజలందరికీ తెలిసిపోయింది.
మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కనుసన్నల్లో జరిగిన కొన్ని వ్యవహారాలపై కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి బృందం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఎక్కడెక్కడ భూకబ్జాలు, బెదిరింపులు, నిర్మాణాలు » మిగితా 2లో

బైజూస్ రవీంద్రన్‌పై లుకౌట్ నోటీసుల పొడిగింపు

- బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌పై గతేడాది లుకౌట్ నోటీసులు జారీ చేసిన ఈడీ
- ఈ నెల మొదట్లో నోటీసుల పునరుద్ధరణ
- సంస్థ ఫెమా ఉల్లంఘనలకు పాల్పడినట్టు ఆరోపణలు

2

ఎన్నికలకు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు

- కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- జైలు వార్డర్లకు మొదలైన శిక్షణ

లోక్‌సభ ఎన్నికల కంటే ముందే తెలంగాణలో కొలువుల జాతర ప్రారంభం కానుంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే అన్ని నోటిఫికేషన్‌లు విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఖర్గేకు జడ్‌ప్లస్

- భద్రతగా సీఆర్‌పీఎఫ్ కమాండోలు
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :
కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భద్రత విషయంలో కేంద్ర హోం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మల్లికార్జున ఖర్గే భద్రతకు ముప్పు ఉందన్న కేంద్ర నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఖర్గేకు జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కాంగ్రెస్ అధ్యక్షుడికి జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించనున్నారు. మనదేశంలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీజీ) » మిగితా 2లో

నిజం నిష్ఠూర్కం

టార్గెట్ @ సత్యపాల్

ఆయన నివాసాలపై సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :
జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఇంటిపై సీబీఐ అధికారులు గురువారం దాడులు జరిపారు. 2019లో కిష్టావర్‌లో కిరు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సివిల్ పనులకు సంబంధించి రూ.2200 కోట్ల ఒప్పందంలో అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈ దాడులు చోటుచేసుకున్నాయి. జమ్ముకశ్మీర్ సహా 30 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. వందమందికిపైగా » మిగితా 2లో

ప్రతి డిమాండ్‌నూ నెరవేరుస్తాం

అన్నదాతల ఆందోళన నేపథ్యంలో ప్రధాని మోడీ స్పందన

చెరకు మద్దతు ధరలను పెంచామని వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :
రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో ఆయన తొలిసారిగా స్పందించారు. కేంద్రం చెరకు పంటకు గిట్టుబాటు ధరను పెంచిన నేపథ్యంలో గురువారం ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు. 'దేశవ్యాప్తంగా ఉన్న అన్నదాతలకు సంబంధించి ప్రతి డిమాండ్‌ను నెరవేర్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ నేపథ్యంలోనే చరిత్రాత్మక నిర్ణయం వెలువడింది. చెరకు కొనుగోలు ధర పెంపునకు ఆమోదం లభించింది. దీంతో కోట్లాది మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని మోదీ పోస్టు చేశారు. బుధవారం రాత్రి ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ చెరకు గిట్టుబాటు ధరను పెంచింది. గతంతో పోలిస్తే క్వింటాల్‌కు రూ.25 పెంచింది.దీంతో మద్దతు ధర రూ.340కు చేరింది. 2023-24తో పోలిస్తే ఇది 8శాతం అధికం. ఈ సవరించిన ధర 2024 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం సహా పలు డిమాండ్లతో 'దిల్లీ చలో' ఆందోళనను తలపెట్టిన అన్నదాతలు ఈ నెల 13 నుంచి పంజాబ్- హరియాణా రాష్ట్రాల సరిహద్దుల్లోని శంభు, ఖనౌరీల వద్ద వేల సంఖ్యలో గుమిగూడి ఉన్న సంగతి తెలిసిందే. వారు దిల్లీ దిశగా తమ నిరసనను ఉధృతం చేసేందుకు యత్నించారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా కేంద్రం, రైతుల సంఘాల మధ్య చర్చలు జరిగినప్పటికీ పురోగతి » మిగితా 2లో

ప్రజాపాలనలో ఇదేనా బాధ్యతా..?

- రెవెన్యూ శాఖలో మంత్రి పొంగులేటి ఆకస్మిక తనిఖీ
- సమయపాలన పాటించనివారిపై ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి22 (జనంసాక్షి) :
రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర సచివాలయంలో గురువారం రెవెన్యూ విభాగంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. రెవెన్యూశాఖ విభాగంలో ఉదయం 11.40 వరకు పూర్తిస్థాయిలో ఉద్యోగులు తమ తమ విధులకు హాజరు కాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.. కొంతమంది ఉద్యోగులు ముందస్తు సమాచారం లేకుండా ఆఫీసుకు రాకపోవడం, మరి కొంతమంది సమయానికి రాకపోవడం బాధ్యతరాహిత్యం అన్నారు. హాజరు పట్టికలు పరిశీలించారు... రెవెన్యూ విభాగంలోని ఐదు సెక్షన్లో ఏ సెక్షన్ లో కూడా పూర్తిస్థాయిలో ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబు దారిగా ఉండాల్సిన అధికారులు విధుల్లో అలక్ష్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయని మంత్రి ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజా పాలనలో రెవెన్యూశాఖ కీలకపాత్ర వహిస్తుండగా ఇతర విభాగాలకు ఆదర్శంగా ఉండాల్సిన సచివాలయ అధికారులు, సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.. అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి నిజాయితీ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రిగారు వ్యాఖ్యానించారు.

గుజరాత్ బ్రాండ్

అముల్ పాలను విశ్వవ్యాప్తం చేయండి

అతిపెద్ద కంపెనీగా మార్చాలని ప్రధాని మోడీ సూచన

2



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 ఫిబ్రవరి 2024

...అముల్ పాలను విశ్వవ్యాప్తం చేయండి

అహ్మదాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) అమూల్ బ్రాండ్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తుల కంపెనీగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలో పాడి పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతోందని చెప్పారు. గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్- జీసీఎంఎంఎఫ్ స్వర్ణోత్సవాల అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో పశువుల పెంపకందారులు, రైతులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా పాడి పరిశ్రమ వృద్ధి రేటు రెండు శాతం ఉండగా దేశంలో ఆరు శాతమని చెప్పారు. ప్రస్తుతం 8వ స్థానంలో ఉన్న గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అందుకు కేంద్రప్రభుత్వం అండగా ఉంటుందని, ఇది మోదీ గ్యారెంటీ అని ప్రధాని చెప్పారు. దేశంలో పాడి పరిశ్రమ మొత్తం టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు అని వరి, గోధుమ, చెరకు ఉత్పత్తులు మొత్తం కలిపినా అంతకాదని ప్రధాని మోదీ వెల్లడించారు. తమ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 60 వేలకుపైగా అమృత్ సరోవర్లను నిర్మించిందని తెలిపారు. దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మోదీ చెప్పారు. ఈ దేశంలోని చిన్న సన్నకారు రైతులకు కూడా ఆధునిక సాంకేతికతను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ

కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. భక్తులు వేయికళ్లతో ఎదురు చూస్తున్న తరుణం ఆసన్నమైంది. మేడారంలో సమ్మక్క ఆగమన పూజలు ప్రారంభమయ్యాయి. చిలుకలగుట్ట నుంచి సమక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు. కుంకుమభరణి రూపంలో ఉన్న సమ్మక్కను కోయ పూజారులు గద్దెపై ప్రతిష్టించడంతో ప్రధాన ఘట్టం ఆవిష్కృతం అయ్యింది. కాగా.. ఇప్పటికే సారమ్మను ఆదివాసీ పూజారులు కొమ్మ బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో తీసుకువచ్చి
మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెలపై కొలువుదీరారు. చివరగా సమక్క రాకతో జాతరలో కీలక ఘట్టం మొదలయ్యింది. సమక్క గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడారం భక్తజనసంద్రంగా మారింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది. గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో పరుచుకున్నాయి. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు ఇప్పటికే చేరుకోగా.. సారలమ్మ రాకతో మేడారం దేవనగరిగా మారిపోయింది. కన్నెపల్లి కల్పవల్లి పాదస్పర్శతో మహాజాతర తొలిఘట్టం ప్రారంభమైంది. రెండేండ్ల ఎదురుచూపుల తర్వాత సమ్మక్క,సారలమ్మ బుధవారం గద్దెలకు చేరుకోవడంతో మేడారం భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. కన్నెపల్లి- మేడారం దారంతా భక్తజనం ప్రణమిల్లింది. జంపన్నవాగు జన సందోహంతో పరవళ్లు తొక్కింది. తల్లి సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి స్వాగతించేందుకు మేడారం ఒళ్లంత కండ్లు చేసుకొని పులకించింది. మేడారం మహా జాతరలో తొలి ఘట్టం బుధవారం నిర్విఘ్నంగా పరిపూర్ణమైంది. కన్నెపల్లి నుంచి తరలివచ్చిన సారలమ్మ బుధవారం అర్ధరాత్రి గద్దెను అలంకరించింది. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారలమ్మకు స్వాగతం పలికారు. సారలమ్మను కనులారా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే కన్నెపల్లికి భక్తజనం పోటెత్తింది. సారలమ్మను తోడ్కొని వచ్చే ప్రధాన వడ్డె (పూజారి) కాక సారయ్య సహా ఆయనను అనుసరించే ఇతర వడ్డెలు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, మహారాష్ట్రలోని సిరోంచ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ, కోయ గిరిజనుల పూజా విన్యాసాలతో కన్నెపల్లి మార్మోగింది. పూజల తరువాత కన్నెపల్లి నుంచి 16 మంది ఆడబిడ్డలు సంప్రదాయం ప్రకారం డోలి విన్యాసాలతో తరలివచ్చి తల్లీబిడ్డలైన సమ్మక్క-సారలమ్మ కొలువుదీరే గద్దెలపై ముగ్గులు పెట్టి కంకవనానికి కంకణాలు కట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచే కన్నెపల్లి సారలమ్మ గుడి వద్ద డోలి విన్యాసాలు, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి పరిషత్, సారలమ్మ యువజన సంఘం బృందాల సారథ్యంలో కళా ప్రదర్శనలు కొనసాగాయి. అదే సమయంలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య సహా ఇతర పూజారులు సారలమ్మ గుడిలో వారి ఆచార సంప్రదాయాలను ఆచరించారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కన్నెపల్లి సారలమ్మ గుడి నుంచి మేడారంలోని గద్దెల వరకు తోడ్కోని బయల్దేరారు. కన్నెపల్లిలో ఇల్లిల్లూ తమ ఇంటి ఆడబిడ్డకు నీళ్లారగించి, చీరెసారె పెట్టి, కొబ్బరికాయలు కొడుతూ మంగళహారతులు పట్టారు. అక్కడినుంచి జంపన్న వాగుకు చేరుకోగా.. జంపన్న తన అక్క సారలమ్మ కాళ్లుకడిగి మేడారానికి సాగనంపారు. జంపన్నవాగు నుంచి బయల్దేరిన సారలమ్మ మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకోగా.. అక్కడ పగిడిద్దరాజు, గోవిందరాజుల వడ్డెలు ఘనస్వాగతం పలికారు. అక్కడ ముగ్గురు దేవతల ప్రతినిధులు వారి వారి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. సమ్మక్క కూడా చేరుకోవడంతో ఇక ప్రధాన ఘట్టంలో చివరి అంకం కూడా ముగిసింది. సమ్మక్క గద్దెకు చేరిందన్న వార్తతతో జాతర ప్రాంగణం నుంచి భక్తులు తండోపతండాలుగా పరుగులు తీశారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం అత్యంత నియమ నిష్ఠలతో పూజారులు అమ్మవార్లను గద్దెలపైకి చేర్చారు. కన్నెపల్లి నుంచి మేడారానికి దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా దారికి ఇరువైపులా జనం పోటెత్తారు. శివాలూగె శివసత్తుల పూనకాలతో జాతర మార్మోగింది. ఎదురుకోళ్లు సమర్పిస్తూ, ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ జనం సమ్మక్క,సారలమ్మకు నీరాజనం పలికారు. ఆదివాసీ సంప్రదాయ విన్యాసాలతో డోలి మోతలు, కొమ్ము బూరల నాదాలతో దద్దరిల్లాయి. మేడారం జాతరలో అత్యంత ఉద్విగ్నతకు లోనయ్యే ఘట్టం సమ్మక్క ఆగమనం. గురువారం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి రావడంతో భక్తుల మొక్కులు అందుకుంటున్నది. సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్టయ్య సమ్మక్క తల్లిని గద్దెలపై ప్రతిష్టించారు.

బైజూస్ రవీంద్రన్‌పై లుకౌట్ నోటీసుల పొడిగింపు

బైజూస్ వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ పై ఈడీ తన లుకౌట్ నోటీసులను పొడిగించింది. రవీంద్రన్ పై ఈడీ ఫెమా చట్టం కింద దర్యాప్తు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఏడాది కిందట రవీంద్రన్ పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. అయితే, ఈ నెల మొదట్లో వాటిని పునరుద్ధరించారు. ఈ లుకౌట్ నోటీసుల ప్రకారం... రవీంద్రన్ దేశం విడిచి వెళ్లాలంటే ఈడీకి సమాచారం అందించాల్సి ఉంటుంది. ఈడీ వద్ద ఉన్న సమాచారం మేరకు ప్రస్తుతం రవీంద్రన్ దేశం వెలుపల ఉన్నట్టు తెలుస్తోంది. రవీంద్రన్ ఆధ్వర్యంలోని థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ విదేశీ మారకద్రవ్య చట్టాన్ని అతిక్రమించినట్టు ఈడీ గుర్తించింది. రూ.9,362 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం కలగడానికి కారణమైనట్టు ఆరోపించింది.

మరో రెండు గ్యారంటీల అమలుకు సర్కారు సిద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన గృహ జ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ఈనెల 27 లేదా 29న ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విధివిధానాలపై కేబినెట్ సబ్ కమిటీతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సబ్సిడీ ఎలా అందించాలనే అంశంపై చర్చించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మరో రెండు హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. కేబినేట్ సబ్ కమిటీతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్, రూ. 500కే సిలిండర్ పై విధివిధనాలపై సమీక్ష నిర్వహించారు. ఈ పథకాలను ఫిబ్రవరి 27 లేదా29న ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ భేటీలో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు. వారంరోజుల్లో ఆరు గ్యారెంటీలలో మరో రెండిటిని అమలు చేస్తామని కొండగల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ఫథకాల విధివిధినాలపై గురువారం రోజున కేబినేట్ సబ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు . కాగా ఇప్పటికే కాంగ్రెస్ మహిళలకు బస్సులో ఫ్రీ జర్నీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ లిమిట్ రూ.10 లక్షల పెంచి పథకాలను అమలు చేస్తోంది. గ్యాస్ ఏజెన్సీలతో చర్చలు జరపాలని సీఎం సూచించారు. గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

'ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో అర్హులందరికీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలి. లబ్దిదారుడు రూ.500 చెల్లిస్తే సిలిండర్ ఇచ్చేవిధంగా అనువైన విధానాన్ని అనుసరించాలి. సబ్సిడీని ఖాతాకు బదిలీ చేయాలా? ఏజెన్సీలకు చెల్లించాలా? అనుమానాలు, అపోహలకు తావు లేకుండా గృహజ్యోతి పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని నిర్ణయించారు. మార్చి మొదటి వారం నుంచి విద్యుత్తు బిల్లు జారీ చేసేటప్పుడు అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులు జారీ చేయాలి. తెల్ల రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్లలోపు గృహ విద్యుత్తు వినియోగించే వారందరికీ ఈ పథకం వర్తింపజేయాలి. ప్రజాపాలన దరఖాస్తుల్లో రేషన్ కార్డు నంబరు, విద్యుత్ కనెక్షన్ నంబరు తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోయినవారు ఉంటే.. సవరించుకునే అవకాశమివ్వాలి. అలాగే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారుంటే ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం నిరంతర పక్రియగా కొనసాగించాలని సీఎం ఆదేశించారు.

ఇండియా కూటమిలో కొలిక్కి వస్తున్న సర్దుబాట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : సార్వత్రిక ఎన్నికలు రానున్న వేళ కాంగ్రెస్-ఆప్ మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. దిల్లీలోని ఏడు ఎంపీ స్థానాల్లో నాలుగు చోట్ల ఆప్, మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పోటీ చేసేందుకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. దీనిపై త్వరలో ప్రకటన వెలువడనుంది. తమ రెండు పార్టీల మధ్య చర్చలు తుదిదశకు చేరుకున్నాయని కొద్దిరోజుల క్రితం దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ వెల్లడించారు. 'రెండుమూడు రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దాం. ఇప్పటికే చాలా ఆలస్యమైంది' అని వ్యాఖ్యానించారు. మొదట పొత్తులో భాగంగా కాంగ్రెస్‌కు ఆప్ ఒక్క సీటే ఆఫర్ చేసింది. 'దాని ప్రదర్శన చూస్తే.. దిల్లీలో ఒక్క సీటే ఎక్కువ. పొత్తు ధర్మాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ ఒక్కటీ ప్రతిపాదించాం' అని ఆప్ ఎంపీ సందీప్ పాథక్ గతంలో వ్యాఖ్యలు చేశారు. దాంతో రెండింటి మధ్య పొత్తు కుదరకపోవచ్చనే వార్తలు వినిపించాయి. కాగా..2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆ ఏడు ఎంపీ సీట్లను భాజపానే సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే.. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో విపక్ష ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. యూపీలో 80 స్థానాలకు గానూ 17 చోట్ల కాంగ్రెస్ పోటీ చేయనుంది. మిగిలిన 63 చోట్ల సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ), ఇతర మిత్రపక్షాలు బరిలో దిగుతాయి. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో రాయ్‌బరేలీ, అమేథీ, వారణాసి, ఝాన్సీ, మథుర, గాజియాబాద్ వంటివి ఉన్నాయి. ప్రతిష్టంభనను తొలగించడానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ చొరవ తీసుకున్నారు. ఎస్‌పీ అధ్యక్షుడు అఖిలేశ్‌తో ఆమె ఫోన్లో మాట్లాడడంతో పొత్తుకు మార్గం సుగమమైంది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రధాన రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. కలిసి బరిలోకి దిగి బీజేపీని గద్దె దింపాలని వ్యూహరచన చేస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీతో కాంగ్రెస్ పార్టీ సీట్ల లెక్క తేలింది. ఆ వెంటనే ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే స్థానాలపై క్లారిటీ వచ్చింది. ఢిల్లీ, గుజరాత్, అసోం, హర్యానాలో కాంగ్రెస్- ఆప్ కలిసి పోటీ చేస్తోన్న సంగతి తెలిసిందే. సీట్ల గురించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ పలుమార్లు చర్చించి ఫైనల్ చేశారని విశ్వసనీయ సమాచారం. గుజరాత్‌లో ఆప్ రెండు చోట్ల, హర్యానా, అసోంలో ఒక్కో చోట ఆప్ అభ్యర్థులు పోటీలో ఉంటారు. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ 63 చోట్ల తమ అభ్యర్థులను బరిలోకి దింపనుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 17 చోట్ల బరిలో ఉంటారు. మధ్యప్రదేశ్‌లో మొత్తం 29 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ 28 లోక్ సభ స్థానాల్లో పోటీ చేయనుంది. ఎస్పీ ఒక చోట మాత్రమే బరిలోకి దిగనుంది.

మేడారం జాతరను జాతీయహోదాగా గుర్తించలేం

ములుగు,ఫిబ్రవరి22 (జనంసాక్షి) : మేడారం జాతరను జాతీయ హోదా పండుగగా గుర్తించలేమంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి జాతీయహోదా అంటూ ఏదీ లేదన్నారు. మేడారం జాతరపై కేంద్రానికి ఎలాంటి వివక్ష లేదన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఈ జాతరను జాతీయ పండుగగా నిర్వహించాలని రాష్ట్ర నేతలు అడుగుతున్నారని, కానీ.. జాతీయ పండుగ అనే విధానం ఎక్కడా లేదని స్పష్టం చేశారు. మేడారానికి జాతీయ గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఫిబ్రవరి 22వ తేదీ గురువారం రోజున మేడారంలో సారలమ్మను దర్శించుకొని నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ములుగులో గిరిజన వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తామని, ఈ ఏడాదే ప్రవేశాలకు అనుమతిస్తామని వెల్లడించారు. ఇందులో ఎక్కువ సీట్లుస్థానిక గిరిజన బిడ్డలకే ఇస్తామన్నారు. రూ. 900 కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తున్నామని.. వర్సిటీ భవనాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేత సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... బీజేపీకి గిరిజనులపై ప్రేమలేదన్నారు. బీజేపీ కపట ప్రేమ బయటపడిందని మండిపడ్డారు. మేడారంపై బీజేపీ వైఖరి దుర్మార్గమన్నారు. కిషన్ రెడ్డి మూర్ఖంగా మాట్లాడారని... బీజేపీది ధ్వంద వైఖరి అంటూ విరుచుకుపడ్డారు. మహబూబాబాద్ ఎంపీ కవిత మాట్లాడుతూ.. మేడారానికి జాతీయ హోదా ఇవ్వాలని పార్లమెంటులో కొట్లాడినమని తెలిపారు. జాతీయ హోదా ఇస్తే ప్రపంచ గుర్తింపు వస్తుందన్నారు. అమ్మవార్లకు గౌరవం దక్కాలంటే జాతీయ హోదా ఇవ్వాల్సిందే అని పట్టుబడ్డారు. కాంగ్రెస్ నేత అశోక్ మాట్లాడుతూ... మేడారం జాతరపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని మండిపడ్డారు. జాతీయ హెదా అనేది ఇక్కడి ప్రజల చిరకాల డిమాండ్ అన్నారు. ఆదివాసీల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొర్రెల కుంభకోణంలో నలుగురు అరెస్ట్

హైదరాబాద్,ఫిబ్రవరి22 (జనంసాక్షి) :
గొర్రెల పంపిణీ స్కామ్‌లో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వీరిలో కామారెడ్డి వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ రవి, మేడ్చల్ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆదిత్య, రంగారెడ్డి జిల్లా భూగర్భ జల అధికారి రఘుపతిరెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేశ్ ఉన్నారు. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన కుంభకోణానికి సంబంధించిన కేసును ఏసీబీ విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. దర్యాప్తులో ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై.. నకిలీ బినామీ ఖాతాలతో దాదాపు రూ.2.10 కోట్ల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని అధికారులు తేల్చారు.

ఎన్నికలకు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీకి సిఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. కొత్త నోటిఫికేషన్‌లకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం యత్నిస్తోంది. వారం రోజుల్లో 11 వేల పోస్ట్‌లతో మెగా డీఎస్సీ (ఆ÷ూఅ) నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. మరోవైపు సింగరేణి లోని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనుంది. 474 పోస్టుల భర్తీకి సింగరేణి అధికారులు కసరత్తు మమ్మరం చేశారు. నిన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సింగరేణి అధికారులు సమావేశం అయ్యారు. ఇప్పటికే 563 పోస్టులకు గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇకపోతే జైళ్ల శాఖలో కొత్తగా 136 మంది వార్డర్లు ఎంపికయ్యారు. గురువారం నుంచి చంచల్‌గూడ జైల్లో నూతన వార్డర్లకి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో 136 మంది వార్డర్లుగా ఎంపికయ్యారు. జైళ్ళ శాఖ ప్రధాన కార్యాలయానికి 85 మంది రిపోర్టు చేయగా.. వీరిలో ఏడుగురు మహిళా వార్డర్లు ఉన్నారు. వార్డర్లుగా ఎంపికైన వారికి ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందించిన విషయం తెలిసిందే. చంచల్‌గూడ జైలు ఆవరణలో వార్డర్లకి జైళ్ళ శాఖ డీజీ సౌమ్యామిశ్రా శిక్షణా కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.నూతన వార్డర్లందరికీ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా శుభాభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అనేది చిన్న విషయం కాదని తెలిపారు. సమాజంలో మీ సర్వీస్ ఇవ్వడానికి ముందుకు రావడం గర్వకారణమన్నారు. దేశంలో తెలంగాణ జైళ్ళ శాఖకు ఎంతో పేరు ఉందన్నారు. ఆ పేరును మరింత పెంపొందించడానికి అందరూ కూడా భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో అందరిని వజ్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. జైళ్ళకు వచ్చే ఖైదీలను కేవలం నేరస్తులుగానే కాకుండా మంచి పౌరులుగా తీర్చిదిద్ది సమాజంలోకి పంపిస్తామన్నారు. ఖైదీలతో ఎక్కువగా గడిపేది వార్డర్లు మాత్రమే అని.. అందుకే వాళ్ళని మెంటల్గా, ఫిజికల్గా ఫిట్గా ఉండేందుకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌ల వార్డర్ల శిక్షణ చేసి పంపించామన్నారు. ఇప్పుడు మూడో బ్యాచ్ శిక్షణకు వచ్చిందన్నారు. ఈ శిక్షణ వార్డర్లకు అందరికీ పూర్తిస్థాయిలో ఉపకరిస్తుందని భావిస్తున్నామని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు.

తక్కువ ధరకు అమ్ముకోకండి

హైదరాబాద్,ఫిబ్రవరి22 (జనంసాక్షి)
తెలంగాణలో సన్ ఫ్లవర్ రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచన చేశారు. రైతులు ఎవరూ తొందర పడొద్దని క్వింటా రూ.6,760 కంటే తక్కువ ధరకు విక్రయించొద్దని సూచించారు. అలాగే, శుక్రవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని.. పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అటు, ఈ అంశంపై మంత్రి తుమ్మలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మంత్రికి ట్విట్టర్ వేదికగా వేదికగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సన్ ఫ్లవర్ రైతులు మద్దతు ధర లేక నష్టపోతున్నారని అన్నారు. 'ఈ ఏడాది మద్దతు ధర రూ.6,760 ఉండగా మార్కెట్ లో మాత్రం రూ.4 వేల నుంచి రూ.5 వేలకే రైతులు అమ్ముకుంటున్నారు. ప్రతి క్వింటాలుకు దాదాపు రూ.2 వేలు నష్టపోతున్నారు. గతంలో మా ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో మద్దతు ధరకు రైతుల నుంచి సన్ ఫ్లవర్ కొని రైతులను ఆదుకున్నాం. మీరు వెంటనే అధికారులను ఆదేశించి రాష్ట్ర వ్యాప్తంగా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మద్దతు ధరకు సన్ ఫ్లవర్ కొని రైతుల ప్రయోజనాలు కాపాడాలని కోరుతున్నానని అన్నారు.

కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు

మద్యం కుంభకోణం కేసులో ఏడోసారి సమన్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(జనంసాక్షి) ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు ఈడీ మరోసారి నోటీసులు ఇచ్చింది. మద్య కుంభకోణం కేసులో ఏడోసారి సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 26న విచారణకు రావాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. ఇప్పటికే అరవింద్ కేజ్రీవాల్ కు 6సార్లు ఈడీ నోటీసులు ఇచ్చింది. అయినా సరే ఢిల్లీ సీఎం విచారణకు వెళ్లలేదు. ఇటీవల ఆరోసారీ ఈడీ నోటీసులు ఇచ్చిన సమయంలో ఢిల్లీ సీఎం స్పందించలేదు. ఈడీ విచారణకు హాజరుకాలేదు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు న్యాయస్థానం పరిధిలో ఉన్నందున ఈడీ నోటీసులు ఇవ్వడం చట్టవిరుద్ధమని ఆప్ నేతలు అంటున్నారు. మాజీ గవర్నర్ సత్యపాల్ ఇంటిపై సీబీఐ దాడులు.. మనీలాండరింగ్ కేసులో విచారణకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ హాజరుకాకపోవడం ఈడీ కోర్టుకు వెళ్లింది. ఈడీ ఫిర్యాదుతో ఇటీవల న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ సమయంలో కోర్టు విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఢిల్లీ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష ఉందని ఆ రోజు న్యాయస్థానానికి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అందువల్ల వ్యక్తిగతంగా హాజరుకావడానికి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత విచారణకు తప్పకుండా వస్తానని తెలిపారు. కేజ్రీవాల్ వినతి న్యాయస్థానం అంగీకరించింది. మార్చి 16కు తదుపరి విచారణ వాయిదా పడింది. ఏడోసారి ఈడీ ఇచ్చిన నోటీసులపై కేజ్రీవాల్ స్పందిస్తారా? విచారణకు హాజరవుతారా? లేక గతంలో మాదిరిగానే దుమ్మా కొడతారా? అనేది ఆసక్తిగా మారింది.

వేసవిలో నీటి ఎద్దడి ఉండొద్దు

హైదరాబాద్: వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాభావంతో జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరుకున్న నేపథ్యంలో తాగు నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సాగు నీరు,పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. తొలుత రాష్ట్రంలో జలాశయాల్లో నీటి నిల్వలు, తాగు నీటికి అవసరమైన నీటి పరిమాణంపై అధికారులు గణాంకాలు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ నగరాలు/పట్టణాలు, పల్లెలు,తండాలు, గూడేలు, ఎస్సీ కాలనీలు అనే తేడా లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి తాగు నీరు అందేలా సాగు నీరు, పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా శాఖల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆ

బీజేపీతో దేశ సమైక్యతకే ప్రమాదం

- సీపీఐ(ఎం) పాలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : బీజేపీ అధికారంలో ఉంటే దేశ సమైక్యతకే ప్రమాదకరమని సీపీఐ(ఎం) పాలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఫెడరలిజం లేకుండా దేశం ఐక్యంగా ఉండబోదన్నారు. దేశాన్ని సమైక్యంగా ఉంచాలంటే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గద్దెదించాలని ఆయన పిలుపునిచ్చారు. రెండురోజులపాటు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశం హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రారంభమైంది. ఆ పార్టీ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపానికి నాయకులు పూలు వేసి నివాళులర్పించారు. చెరుపల్లి సీతారాములు, జి నాగయ్య, పి సుదర్శన్, టి.జ్యోతి, ఎండీ అబ్బాస్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జ్యోతి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం సభలో రాఘవులు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ప్రధాన కర్తవ్యమని చెప్పారు. 370 ఎంపీలు స్థానాలు సొంతంగా, మిత్రపక్షాలతో కలిసి 400 స్థానాలు గెలుస్తామంటున్నదని వివరించారు. జమ్మూకాశ్మీర్‌ను విచ్ఛిన్నం చేసి ప్రత్యేక అధికారాలున్న 370 అధికరణాన్ని కేంద్రం రద్దు చేసిందన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో 370 సీట్లు లక్ష్యంగా నిర్దేశించుకుందని అన్నారు. రాష్ట్రాలు, భాషలు, మతాలు, సంస్కృతులు, ఆహారపు అలవాట్లు ఇవేవీ ఉండబోవని చెప్పారు. వార్డు నుంచి పార్లమెంటు వరకు ఒకే సారి ఎన్నికలు జరిగితే మోడీ చూసి ఓటేయాల్సి ఉంటుందన్నారు. స్థానిక రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోబోరని అన్నారు. ఇది నిరంకుశ, నియంతృత్వ, అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉండబోదని చెప్పారు. సమాఖ్య వ్యవస్థ ఉంటేనే రాష్ట్రాలకు హక్కులుంటాయని వివరించారు. అప్పుడే దేశం సమైక్యంగా ఉంటుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికలు అమలైతే అధ్యక్ష తరహా పాలనకు అది ఏకవ్యక్తి పాలనకు దారితీస్తుందని అన్నారు.

ఎన్నికల బాండ్లు ప్రజాస్వామ్యానికి హానికరం

కార్పొరేట్ శక్తులు ప్రజాస్వామ్యాన్ని నిర్ణయించే పరిస్థితి వచ్చిందని రాఘవులు చెప్పారు. ఎన్నికల బాండ్లు ప్రజాస్వామ్యానికి హానికరమని విమర్శించారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఆ బాండ్ల వల్ల బీజేపీ లాభపడిందని చెప్పారు. ఇది ఎన్నికలను డబ్బుమయం చేస్తుందన్నారు. నల్లడబ్బును, హవాలా డబ్బును తెల్లడబ్బుగా మారుస్తుందని అన్నారు. ఎన్నికలను విదేశీ సంస్థలు నిర్ణయించే పరిస్థితి వస్తుందన్నారు. ఇంకోవైపు డబ్బులిచ్చిన సంస్థలు, అధికార పార్టీకి మధ్య కిడ్ ప్రోకో (నీకది నాకిది) జరుగుతుందని చెప్పారు. ఎన్నికల బాండ్ల ద్వారా రూ. 16,518 కోట్లు రాజకీయ పార్టీలు తీసుకున్నాయని వివరించారు. ఇందులో బీజేపీ రూ.6,565 కోట్లు తీసుకుందని వివరించారు. ఎన్నికల బాండ్లు తీసుకోని జాతీయ పార్టీ సీపీఐ(ఎం) అని అన్నారు. పన్ను బకాయిలు చెల్లించకుండా రాష్ట్రాలను మున్సిపాల్టీల స్థాయికి కేంద్రం దిగజార్చిందని విమర్శించారు. గవర్నర్లు పహిల్వాన్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఢిల్లీలో ఇదే పరిస్థితి ఉందన్నారు. మతంతో రాజకీయాలు సంబంధం ఉన్న దేశాలేవీ అభివృద్ధిలో ముందుకుపోలేదని చెప్పారు. రామమందిరం ప్రారంభోత్సవం ప్రభుత్వ కార్యక్రమంగా మోడీ చేశారని అన్నారు. సర్వమత సమభావం ప్రకారం బీజేపీ ఇతర మతాల కార్యక్రమాలనూ ఇలాగే చేస్తుందా? అని ప్రశ్నించారు. మద్దతు ధరలకు చట్టం చేయాలని రైతులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. వడ్లు, గోధుమలకే ఇస్తామని కేంద్రం చెప్తున్నదని వివరించారు. 23 పంటలకు ఇవ్వాలని రైతులంటున్నారని అన్నారు. ఆందోళన చేసే రైతులపై టియర్ గ్యాస్‌ను, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని చెప్పారు. పంటలకు ఎంఎస్పీ ప్రకటిస్తే విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం సాధ్యం కాదన్నారు. అందుకే ప్రజలు, రైతుల జీవన పరిస్థితులు మెరుగుపడాలన్నా బీజేపీ ఓడిపోవాలని అన్నారు. అందుకే విశాల శక్తులను కూడగట్టేందుకు ఇండియా కూటమి ఏర్పడిందని చెప్పారు. విపక్ష పార్టీల మధ్య వైరుధ్యాలున్నా బీజేపీ ఓటమికి సహకరించుకోవాలన్నారు. ఈ నిర్ణయం అధికార పార్టీకి వణుకు పుట్టిస్తున్నదని అన్నారు. అందుకే బీహార్లో నితీశ్‌కు ఎర వేసిందనీ, ఏపీలో టీడీపీ – జనసేన, తెలంగాణలో బీఆర్ఎస్ను దగ్గరవుతున్నదని చెప్పారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు గెలుస్తామని కిషన్‌రెడ్డి అంటున్నారని రాఘవులు చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్కు ఓట్లేస్తే మూసీనదిలో వేసినట్టేనని ఆయన అంటున్నారనీ, కిషన్‌రెడ్డే మూసీలో పడిపోతావు జాగ్రత్త అని అన్నారు. రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ ఖాళీ చేసిందంటూ కాంగ్రెస్ విమర్శిస్తున్నదని చెప్పారు. తెలంగాణకు కేంద్రం చేసిన అన్యాయంపై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వ తరహాలో బీజేపీకి వ్యతిరేకంగా రేవంత్రెడ్డి పోరాడాలని కోరారు. బీజేపీని ఒంటరిని చేయడానికి బీఆర్ఎస్ ముందుకొస్తుందా? ఆ పార్టీకి దాసోహమవుతుందా? భవిష్యత్తులో తెలుస్తుందన్నారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు వచ్చిన సీబీఐ సమాన్లు వచ్చాయనీ, అవి సమాన్లా లేక గాలమా కొద్దిరోజుల్లో స్పష్టమవుతుందని చెప్పారు. రాజకీయాలు ఎలా ఉన్న ప్రజాసమస్యలను వదిలిపెట్టద్దని సూచించారు.

2 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం : తమ్మినేని

రాష్ట్రంలో రెండు ఎంపీ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అయితే పొత్తు ఉంటుందా? లేదా? అన్నది కాంగ్రెస్ తేల్చాలని చెప్పారు. ఆ పార్టీతో కలిసి వెళ్లేందుకు అవకాశాలున్నాయని వివరించారు. బీఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధమని చెప్పారు. అభివృద్ధిని చూడకుండా అహంకారం, అప్రజాస్వామిక విధానాలను చూసి ప్రజలు ఓట్లేశారని వివరించారు. కాంగ్రెస్ విజయాన్ని స్వాగతించామని చెప్పారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని అన్నారు. బీఆర్ఎస్ అవినీతిని కక్కించాల్సిందేనని అన్నారు. ఖజానా ఖాళీ అయినా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తామంటూ సీఎం రేవంత్రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని వివరించారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రామమందిరం ప్రారంభోత్సవ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాలన్నారు. అక్షింతలు ఓట్లుగా మారతాయా?, బీజేపీకి ఓట్లేస్తారా? అని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, డిజి నరసింహారావు, జాన్వెస్లీ, పాలడుగు భాస్కర్, టి.సాగర్, మల్లు లక్ష్మి, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఎన్‌హెచ్‌ఏ బృందం పర్యటన

- అరోగ్య శ్రీ సేవలను వివరించిన నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : తెలంగాణ అరోగ్య శ్రీ సీఈఓ ఎన్ఆర్.విశాలచితో కలిసి గురువారం కేంద్ర ప్రభుత్వ బృందం నిమ్స్ లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పర్యటన బృందంలో ఎంఎస్.దీప్తి గౌర్ ముఖర్జీ ఐఏఎస్, చీఫ్ ఎక్స్ క్యూటివ్ ఆఫీసర్, నేషనల్ హెల్త్ అథారిటీ డాక్టర్ బసంత్ గార్గ్, అడిషనల్ సిఈఓ, ఎన్‌హెచ్‌ఏ నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ నగరి బీరప్ప వారిని దయాలసిస్ సెంటర్‌కు తీసుకెళ్ళి అక్కడ రోగులకు అరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవలకు వివరిం చారు. తరువాత బోర్డు రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో వివిధ విభాగాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందుతున్న సేవల గురించి క్లుప్తంగా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సుపెరిండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ లిజ రాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సుపెరిండెంట్ డాక్టర్ కృష్ణా రెడ్డి, డాక్టర్ లక్ష్మీ భాస్కర్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ స్వర్ణలత, వివిధ శాఖాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాసిపేట రహదారి

కాసిపేట, ఫిబ్రవరి 22, (జనంసాక్షి) : నిత్యం ఈ రహదారి మీదుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు ఈ రహదారి గుండగా రావాలంటే ప్రయాణికులు జంకుతున్నారు కాసిపేట మండలంలోని సొమగుడెం నుంచి కాసిపేట వరకు రహదారి అధ్వానంగా మారింది. వాహనదారులకు గుంతలు స్వాగతం పలుకుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమతులైన చేపట్టాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

మేడారం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా కోయదొరలు

మేడారం ఫిబ్రవరి22(జనం సాక్షి) : మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కోయ దొరలు దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు మేడారానికి తరలి వస్తున్నారు. జాతర సందర్భంగా మేడారం పరిసరాలు జన సందోహంతో నిండిపోయాయి. కోట్లాది మంది భక్తులు కొంగు బంగారంగా కొలిచే సమ్మక్క సారలమ్మ జాతరలో కోయ దొరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. దట్టమైన అడవులలో దొరికే అనేక రకాల వనమూలికల మొక్కలు, వేర్లు, చెట్ల కొమ్మలను తీసుకు వచ్చి జాతరకు వచ్చే భక్తులకు విక్రయిస్తున్నారు. తాము ఆదివాసిలమని అడవులలో జీవిస్తూ సమ్మక్క సారలమ్మల ఉపవాస దీక్ష చేపట్టి నిష్ఠతో పూజలు నిర్వహించి అన్ని రోగాలకు సంబంధించిన మూలికలను తమ పూర్వీకుల నుండి తెలుసుకొని నేటికీ అదే కొనసాగిస్తూ ఎంతో మంది ప్రజలకు నయం చేసినట్లు చెబుతున్నారు.భక్తుల నమ్మకానికి అనుగుణంగా వారి వారి రోగాలు నయం అవుతాయని కోయ దొరలు జ్యోతిష్యంతో వారి జాతకం నిజమవుతుందనీ కొందరు భక్తులు తెలిపారు.

ఇంటిపన్ను వసూలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి22 (జనంసాక్షి) : ఇంటిపన్ను వసూలును ఈ నెల 29లోపు వందశాతం పూర్తి చేయాలనీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణ పరిధుల్లోని మున్సిపల్ పన్ను వసూలుపై ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వందశాతం ఇంటి పన్ను వసూలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, అలాగే ఇంటిపన్నును వసూలు చేయాలనీ సూచించారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ నెల 29 వరకు పన్ను చెల్లించని యజమానులకు నోటీసులు జారీచేసి సీజ్ చేయాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీల వారీగా పన్ను వసూలుపై చర్చించారు. ఈ సమావేశంలో నిర్మల్,బైంసా, ఖానాపూర్ కమిషనర్లు సివిఎన్ రాజు, వెంకటేశ్వర్ రావు, మనోహర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు మూడు కోట్ల రుణాలు మంజూరు

భీమిని, ఫిబ్రవరి 22, (జనంసాక్షి) : భీమిని మండలంలో సుమారు 250 మహిళా సంఘాలకు ఒకేరోజు మూడు కోట్ల రుణాలను ఇందిరా క్రాంతి పథకం ద్వారా మంజూరు చేసినట్లు ఏపీఎం. పంజాల ప్రకాష్ గౌడ్ తెలిపారు. మండలంలో మొత్తం స్వయం సహాయక సంఘాల కోసం పది కోట్ల రుణాలు మంజూరయ్యాయని, శ్రీనిధి ద్వారా ఐదు సోలార్ యూనిట్లు మంజూరయ్యాయని, ఇదే కాకుండా మార్చి 8న మహిళా దినోత్సవం పురస్కరించుకొని మరో మూడు కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందించనున్నట్లు ఏపీఎం తెలిపారు. వీటి ద్వారా మహిళా సంఘాలు ఆర్థిక పరిపుష్టిని సాధించి మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం వీటిని మంజూరు చేసిందని, మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అందరి సహకారంతో ఈ ఘనతను సాధించడం జరిగిందని సీసీలు, సిఏల ఇతర సిబ్బంది సహకారం మరువలేనిదని ఏపిఎం అన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం వర్ధంతి

నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి22 (జనంసాక్షి) : నిర్మల్ లో నిరాడంబరంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆబుల్ కలాం గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించారు. ఐయిదు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర సమరయోధులు తొలి విద్యాశాఖ మంత్రి మానవతావాది భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈకార్యక్రమంలో. ఎం ఐ ఎం అధ్యక్షులు అజీమ్ బిన్ యాహియా,మున్సిపల్ కౌన్సిలర్లు ఇమ్రాన్ ఉల్లా, లక్కాకుల నరహరి ,అడ్వ పోశెట్టి,శేఖ్ సలీం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మజహర్ ,కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ సొసైటీ సొసైటీ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, నాయకులు శేఖ్ ఇంతియాజ్,షేక్ షాదుల్లా హుస్సేన్, మహమ్మద్ జుబేర్ హుస్సేన్ ఖాన్, షేక్ షకీల్, అబుల్ ఖదీర్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్‌కు ముజీబ్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ మజీదుల్లాహ్ హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో నూతన చైర్మన్, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌కు నియమితులైన జనాబ్ సయ్యద్ అజమతుల్లాహ్ హుస్సేనిని వారి కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారిపట్ల పూర్తి నమ్మకం ఉందని రాబోయే రోజుల్లో రాష్ట్ర వాక్ఫ్ బోర్డ్ మరింత అభివృద్ధి చెందుతున్న ఆశాభావం వ్యక్తం చేశారు. వారిని చైర్మన్‌గా నియమించిన శుభ సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. డిపార్ట్మెంట్లో పలు దీర్ఘకాల సమస్యలు ఉన్నాయని వివరించగా తక్షణమే చైర్మన్ స్పందించి అతి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరించబడతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కే ఆర్ రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఖలీద్ ఆహ్మద్, వైదిక్ శాస్త్ర, బోలిగిద్ద శంకర్, ముఖీమ్ ఖురేషి, వాక్ఫ్ బోర్డ్ యూనిట్ అధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం, సభ్యులు సయ్యద్ అసద్ హుస్సేని, తిర్మీజీ జబ్బార్, అబ్దుల్ ఖాదర్, హయుంఖాన్ పాల్గొన్నారు.

మేడారంలో నిరుద్యోగుల ఆకట్టుకుంటున్న ఫ్లెక్సీ

మేడారం ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : గ్రూప్-1కి ప్రిపేర్ అయ్యాం...కానీ నోటిఫికేషన్ రద్దు అయ్యింది తప్పని పరిస్థితుల్లో ఉద్యోగాలు లేక ఉపాధి ఏర్పాటు చేసుకున్న నిరుద్యోగ యువత మేడారం శ్రీ సమ్మక్క- సారలమ్మ మహా జాతరలో కొంత మంది నిరుద్యగులు కలిసి కూల్ డ్రింక్ షాప్ ను ఏర్పాటు చేసుకున్నారు. మేడారంకు వచ్చే భక్తులందరు సహకరించండి అని చిలకల గుట్ట రోడ్డు పక్కన షాప్ పెట్టుకో నీ భక్తులకు కనిపించేలా ఫ్లెక్సీ లో షాప్ పేరును 'శ్రీ సమ్మక్క - సారలమ్మ కూల్ డ్రింక్స్' అని ఏర్పాటు చేశారు.

మానవత్వం చాటుకున్న ఫోటోగ్రాఫర్

మేడారం ఫిబ్రవరి22 (జనం సాక్షి) : మానవత్వం చాటుకున్న ఫోటో గ్రాఫర్ మేడారం మహా జాతరలో మధ్యాహ్నం సమయంలో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని తమ వారి నుండి తప్పిపోయి తిరుగుతున్న వ్యక్తిని గుర్తించి వారి వివరాలను తెలుసుకొని ఆ వ్యక్తిని తమ బంధువులకు అప్పగించడం జరిగింది.

ఆస్తిపన్ను బకాయిలపై రాయితీ

- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పాడిగించాలి
- ప్రభుత్వానికి జిహెచ్ఎంసి లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : వన్‌టైమ్ సెటిల్మెంట్‌గా ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి నివేదించింది. జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే కనుక దీనిపై దృష్టి సారించాలన్నారు. త్వరలో ముగియనున్న ఈ ర్థికక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 2100 కోట్లు అయినప్పటికీ, గతనెల 20 వరకు రూ.1269 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల్లో ఉంది. నెలనెలా సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకే కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో పలు పర్యాయాలు కల్పించిన ఓటీఎస్ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ స్కీమ్ అమల్లోకి వస్తే ఆస్తిపన్ను బకాయిదారులు అసలుతో పాటు బకాయిల వడ్డీలపై కేవలం 10 శాతం పెనాల్టీ చెల్లిస్తే సరిపోతుంది. అది ఎందరికో వెసులుబాటుగా ఉండటమే కాక జీహెచ్ఎంసీ కష్టాల నుంచి గట్టెక్కేందుకూ ఉపకరిస్తుంది. ఈ అంశాన్ని వివరిస్తూ లేఖ రాశారు. పరిశీలనలోకి తీసుకుని ప్రభుత్వం అవకాశం కల్పించగలదని ఆశిస్తున్నారు. 4,95,628 ప్రైవేట్ యజమానుల భవనాలకు సంబంధిం చి బకాయిలు రూ.1887.59 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో కలిపి అవి రూ.4522.18 కోట్లకు పేరుకు పోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 1800 భవనాల నుంచి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు రూ. రూ.1622.16 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో సహ అవి రూ.5281.21 కోట్లకు పేరుకుపోయాయి. అన్నీ వెరసి పేరుకు పోయిన మొత్తం బకాయిలు రూ.9803.39 కోట్లు ఉన్నట్లు అంచనా.

పట్టా కోసం వచ్చిన రైతుల నుండి వసూళ్లు

గుండాల, ఫిబ్రవరి 22(జనం సాక్షి) : యాదాద్రి జిల్లా గుండాల మండలం తహసిల్దార్ కార్యాలయంలో ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాజు దర్జాగా వసూళ్లకు పాల్పడుతున్నాడని విషయం ధరణి ద్వారా పట్టా పొందిన ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే బుధవారం చుక్కల షాపురం గ్రామానికి చెందిన రైతులు ధరణి ద్వారా పట్టా పొందడానికి వెళ్తే నాకేం ఇస్తావో ఇవ్వు అలాగే లోపల మేడంకు కూడా ఇవ్వాలని వారితో భేరాసారాలకు దిగిన వీడియో వెలుగులోకి వచ్చింది. సక్రమంగా ధరణి ద్వారా పట్టా పొందాలని వచ్చిన రైతులతో వసూళ్లకు పాల్పడుతుండడంతో చేసేదేం లేక ముడుపులు అప్పచెబుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే తహసిల్దార్ కార్యాలయానికి చెడు పేరు తీసుకొస్తాడని పలువురు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. లోపల ధరణిరాజును వసూలు చేయమన్న మేడం ఎవరు? వాస్తవంగా మేడం చేయమన్నారా లేదా మేడం పేరు చెప్పి తానే జేబు నింపుకుంటున్నాడా ఇంకా తెలియాల్సి ఉంది.

స్వచ్ఛ సమాజం కోసం కృషి చేసిన

సంఘసంస్కర్త గాడ్గేబాబా



తన జీవితాంతం పరిశుభ్రత కోసం కృషి చేసి ఆయన కుటుంబం అనుసరించగా వారిని జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి సంత్ గాడ్గేబాబా సంఘసంస్కర్త. భిక్షువు. మహారాష్ట్ర వ్యాప్తంగా వున్న తన భక్తుల సహకారం తీసుకొని వారం వారం పండగలు నిర్వహించే వారు శుభ్రత, తోటి వారికి సహాయపడడం గురించి వివరించే వారు. జంతువులకు రక్షణ. నిరుద్యోగులకు ఉపాధి. నిస్సహాయులకు ఆలంబన, పేద యువతీయువకులకు వివాహం జరగాలని ఆశించి, అందుకోసం జీవితమంతా కృషిచేశారు. భక్తులను ప్రోత్సహించి, వారి పాఠశాలలు, ధర్మశాలలు, శరణాలయాలు, గోశాలలు, ఆస్పత్రులు, విద్యార్థినుల వసతి గృహాలు నిర్మించారు. వందలాది సేవాసంస్థలను, ట్రస్టులను నిర్మించిన బాబా తన కుటుంబసభ్యులను, బంధువులను ఆయా ట్రస్టుల్లోని పదవుల్లో నియమించకుండా సేవాభిలాష ఉన్న సహచరులనే ఎంపికచేసి నియమించడం విశేషం. సంచార సన్యాసిగా ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికిని, చెత్తను చీపురుతో శుభ్రపరిచేవారు. ఆయన పరిశుభ్రతకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా పేరు పొందారు. తన భక్తులకు పరిశుభ్రత ద్వారానే భగవత్సేవ చేయమని ప్రబోధం చేసేవారు. కొన్నేళ్లు గడిచాకా గ్రామగ్రామాలలో అపరిశుభ్రతను రూపుమాపి, శుభ్రపరిచేందుకు చీపురు దండును నెలకొల్పాడు. బాబా స్థాపించిన చీపురుదండులో కృషిచేసినవారిలో ఎందరో తదనంతర కాలంలో రచయితలుగా, పత్రికా సంపాదకులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగి ఆయన భావజాలానికి ప్రత్యక్ష పరోక్ష వ్యాప్తిని కల్పించారు. విద్యాభ్యాసమే సమాజంలోని మూఢత్వానికి, వెనకబాటు తనానికి విరుగుడు కాగలదని విరాళాలు తీసుకుని వారంనారీ పండుగలు నిర్వహించేవారు. గ్రామాలలో శుభ్రత, తోటివారికి సాయపడే లక్షణం. సేవ వంటివాటిని ప్రచారం చేస్తుండేవారు. భారతదేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పక్షాలూ, సేవాసంస్థలు ఆయనను స్ఫూర్తిగా స్వీకరిస్తున్నారు. ఆయన అసలుపేరు దేవీదాస్ దేబూజీ. గాడ్గే బాబా మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన అంజన్గావ్ తాలూకాకు చెందిన షేన్గావ్ గ్రామంలోని రజక కుటుంబంలో 1876 ఫిబ్రవరి 23న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జింగ్రాజ్, సక్కుబాయిలు. వారు రజక కులంలో జన్మించినా తండ్రితాతల కాలం నుంచే ఉన్న భూమిని సాగుచేసుకుంటూ జీవించేవారు. తండ్రి దేబూజీ చిన్నతనంలోనే మద్యపానానికి బానిసై మరణించడంతో దేబూజీ మేనమామ ఇంట్లో ఆశ్రయం పొందారు. మేనమామ కూడా మంచి భూ వసతి కలిగినవాడు కావడంతో దేబూజీ ఆయన పశువుల్ని చూసుకుంటూ, పొలంపనులు చేస్తూ కుటుంబంలో మంచి పేరు తెచ్చుకున్నారు.

చిన్నతనం నుంచీ భజనమండళ్ళలో కీర్తనలు, పాటలు పాడుతూ చుట్టుపక్కల గ్రామాలలో కూడా ప్రఖ్యాతిపొందారు. ఆయన సన్యాసాశ్రమ పూర్వపు జీవితంలో ఒక ముఖ్యమైన ఘటన జరిగింది. షావుకారు తన ఆస్తిని అన్యాయంగా ఆక్రమించుకోబోగా దానిని సహించలేక ఎదురుతిరిగారు. షావుకారు గూండాలను పంపితే దేబూజీ ఒక్కడే వారందరినీ తన్ని తరిమేశారు. దేబూజీ తన 29వ ఏట ఫిబ్రవరి 5. 1904 కుటుంబాన్ని అర్ధరాత్రివేళ విడిపెట్టి వెళ్ళిపోయారు. ఆ సమయంలో ఆయనకు తల్లి, తాత, భార్య, పిల్లలు ఉన్నారు. అప్పటికే ఆయన ఇద్దరు బిడ్డల తండ్రి కావడంతోపాటుగా భార్య గర్భవతిగా ఉంది. అనంతరకాలంలో ఆయన సన్యాసం స్వీకరించి, గాడ్గేబాబాగా ఆధ్యాత్మిక విషయాలను బోధించడంతో పాటుగా సాంఘిక సమస్యల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించడం సేవా కార్యక్రమాలు. చేపట్టడం వంటివి చేసేవారు. ఆకలితో వున్నవారికి ఆహారం, దాహంతో అలమటిస్తున్నవారికి నీరు, దుస్తులు లేనివారికి వస్త్రాలు, పేదలకు నాణ్యమైన విద్య, రోగులకు తలదాచుకునేందుకు వైద్యం, నివాసం కల్పించే వారు. విరాళాలతో మహారాష్ట్ర వ్యాప్తంగా 150 విరాళాలను వినియోగించి అనేక పాఠశాలలు, వసతి గృహాలు నిర్మించారు. వందకు పైగా పాఠశాలలను ఆయన నెలకొల్పారు. ఇళ్ళులేని, ఆధారంలేని వృద్ధులను ఆదరించేందుకు వృద్ధాశ్రమాలు నిర్మించారు. సమాజం నుంచే కాకుండా అత్యంత సన్నిహితుల నుంచి కూడా దూరమై దారుణమైన వివక్షను అనుభవిస్తున్న కుష్ఠురోగులకు సేవచేసేందుకు గాడ్గే బాబా కుష్ఠురోగులకు సేవాశాలలు నిర్మించి వారికి సేవాకార్యకలాపాలు చేపట్టారు.

చిన్నతనంలోనే తండ్రిని తాగుడు కారణంగా పోగొట్టుకున్న గాడ్గే బాబా పై వ్యసనాలపై వ్యతిరేకత జీవితాంతం కొనసాగింది. తన కీర్తనల ద్వారా మద్యపానం, ధూమపానం, జూదం వంటి దుర్వ్యసనాలకు వ్యతిరేకంగా చైతన్యాన్ని ప్రజల్లో వ్యాపింపజేశారు. తాగుడు వ్యసనం కుటుంబాల ఆర్థిక స్థితిని, వ్యక్తి ఆరోగ్యస్థితిని, మానసికస్థితిని ఎలా దెబ్బతీస్తుందో మనస్సుకు తండ్రినైనా కొట్టి మాన్పించమని ఆయన ప్రబోధించారు. భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు బి.ఆర్. అంబేద్కర్ గాడ్గే కార్యకలాపాలకు, వ్యక్తిత్వానికి, భావజాలానికి ప్రభావితులై ఆయనను గురువుగా సంబోధించేవారు. దళితుల కొరకు నిర్మింపజేసిన ధర్మశాల పేరుపెట్టారు. గాధే మహరాజ్ కు ఆయన సమకాలికులైన మెహర్ బాబాపై చాలా గౌరవాభిమానాలుండేవి. ఆయనను స్వయంగా తన కుష్ఠురోగుల ఆశ్రమానికి ఆహ్వానించి ఇద్దరూ కలిసి రోగులకు స్నానాలు చేయించారు. 1999లో తపాలాశాఖ విడుదల చేసిన సంత్ గాడ్గే బాబా తపాలా బిళ్ళ గాడ్గే బాబా జీవించివున్నప్పుడు, మరణానంతరం కూడా ఆయన కృషికి వివిధ రూపాల్లో గౌరవం లభిస్తూనేవుంది. మహారాష్ట్రలోని అమరావతిలో ఆయన పేరుమీదుగా మే 1, 1983న సంత్ గాడ్గే బాబా అమరావతి విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు. 1956 డిసెంబరు 20న అమరావతి వెళుతుండగా పేఢీ నదీతీరాన వలగావ్ దగ్గర తనువు చాలించారు.

- సంపత్ గడ్డం
కామారెడ్డి జిల్లా, 7893303516

'ఆవాజ్'కే 'దునియా'క 'షెహెన్షా'!

ఓహ్ ఏక్ ఆవాజ్ కే దునియాక షెహెన్షా థా! (ఆయన గొంతు చప్పుడు ప్రపంచానికి కే రాజాధిరాజు)1952 నుంచి 42 ఏండ్ల పాటు కోట్ల మంది అభిమానుల 'బినాకా గీత్ మాల ' లో ప్రతీ బుధవారం తన అద్భుతమైన, గొంతు నుంచి విలువడే బహెనో! ఔర్ భాయియో.. అని పిలిచిన అమీన్ సయాని(91) గొంతు మూగపోయినా, ఇంకా ఎక్కడో వినిపిస్తున్నట్లే ఉన్నది.రేడియో సిలోన్ లో బినాక గీత్ మాలలో హిందీ పాటల ను ఆయన, ప్రతీ వారం శ్రోతలు పాటలకు ఇచ్చిన రేటింగ్ ద్వారా వినిపించే వారు!మొత్తం 13 పాటలు క్రమ సంఖ్యలో ఉండేవి!టాప్ వన్ లాస్ట్ లో వచ్చేది. ఈ ప్రోగ్రాం లో అమీన్ భాయ్ యాంకరింగ్ ద్వారా జనంలో ఒక ఆసక్తి పుట్టేది! టాప్ వన్పై అంచనాలు వేసుకుని అందరూ షరతులు పెట్టుకుని, గుంపులు, గుంపులుగా రేడియో వద్ద చేరి ఎంజాయ్ చేసే వారు! శ్రోతల లేఖల ద్వారా పాటల ఎంపిక జరిగేది! ఎంపిక అయిన వారికి ప్రైజ్ మనీ పంపేవారు!

దేశంలో అంత హిట్ కార్యక్రమం మరోటి ఇప్పటిదాకా రేడియో ప్రపంచంలో లేదంటే అతిషయోక్తి కాదు!గోల్డెన్ వాయిస్ అఫ్ ఆల్ ఇండియా రేడియో' అయిన అమిన్ భాయ్ గొంతు లో జాదూ ఉండేది! ఆయన గొంతు వింటే ఈ రోజు కూడ ఎంతో తృప్తిగా ఉంటుంది!ఆయన గొంతు వింటే చాలు ముఖం లో ఒక చిరు దరహసం తో కూడిన సంతోషం ఉట్టి పడేది!ఎంత బిజీగా ఉన్నా చిన్న తనం నుంచి బినాక గీత్ మాలను ఇంటిల్లి పాదిగా మేము చూసే వాళ్ళం!మిస్ అయ్యో వారం కాదు!బెస్ట్ సాంగ్ అఫ్ ది ఇయర్, బెస్ట్ సింగర్స్ అఫ్ ది ఇయర్ కూడ ఉండే వారు!1932 డిసెంబర్ 21 న ముంబై లో పుట్టిన అమిన్ సయాని,తర్వాత గ్వాలియర్ కు మారి, స్వతంత్ర్యమ్ వచ్చిన తర్వాత తిరిగి ముంబై కి వచ్చేసాడు!దేశంలో, విదేశాల్లో ఎన్నో రేడియో కార్యక్రమం లలో పాల్గొని, కార్యక్రమం లు నిర్వహించేవారు! 2009 లో అయనకు పద్మశ్రీ ఇచ్చి భారత ప్రభుత్వం గౌరవించింది.జీవిత కాలం లో అమిన్ భాయ్ ఎన్నో రివాడ్లు, అవార్డ్స్ సాధించారు. యాక్టింగ్ లో ఎలాగైతే అమితాబ్ బచ్చన్ సహా ఎంతో మంది దిలీప్ కుమార్ ను చూసి, అనుకరించి నేర్చుకున్నారో, నిలబడ్డారో, అలాగే బ్రాడ్ కాస్టింగ్, యాంకరింగ్ ప్రపంచంలో ఎందరో అమిన్ సయాని ని చూసి, ఆదర్శంగా తీసుకుని నిలబడ్డారు, అని పేర్కొనవచ్చు!అమిన్ సయాని కి ప్రముఖ గాయకుడు మొహమ్మద్ రఫీ ని ఇంటర్వ్యూ చేయాలని ఉండేది! అందుకోసం వెంటబడి మరీ ఒకసారి ఒప్పించారు. అయితే రఫీ సాబ్ ఒక షరతు పెట్టారట, నీ ప్రతీ ప్రశ్నకు జవాబుగా నేను పాట పాడుతనన్నారట,జవాబు అంతే అన్నారట!ఎందుకంటే ఎంతో అద్భుతంగా పాట పాడే రఫీ సాబ్ తక్కువ మాట్లాడే వారు అంటారు. ఆయన ను ఎరిగిన వారు, రఫీ సాబ్ ముఖం లో కోపం చూడలేదు, అంటారు, ఆయన అంత సౌమ్యుడు అన్న మాట! అప్పటికే కొందరు సినిమా వాళ్ళను అమిన్ సయాని చేసిన ఇంటర్వ్యూ లు రఫీ సాబ్ చూసి ఉంటారు!ఇక అమిన్ భాయ్ ఇంటర్వ్యూ కు ప్రశ్నలతో సిద్ధం అవుతున్న సందర్భంలోనే, రఫీ సాబ్ మరణ వార్త వచ్చింది! దీనితో ఎంతో దుక్కించిన అమిన్ సయాని ఆ తర్వాత ఆయన అంతిమ యాత్రలో పాల్గొని రఫీ సాబ్ పాడిన 'దిల్క సూనా సాజ్ తరానా దూండేగా! ముజ్ కో మేరే బాద్ జమాన దూండేగా!' అనే పాట ను ఆయన మాటల్లో పేర్కొన్నారు.ఎస్ అమిన్ భాయ్ ఇప్పుడు మీ గొంతు అంతే!వఖ్త్ అబ్ ఆప్ కే బాద్, ఆప్ కి ఆవాజ్ సే నికిలి హుయి ,రికార్డు హోచుకి, ఓహ్ బాతోంకే ఖాజానేకో దూండేగా! వాయిస్ ఇండస్ట్రీ కే ఓహ్ బాద్షా! మీ జ్ఞాపకాలు సజీవం!ఆప్ కో ఆప్ కే బహెనో! ఔర్ భాయి యోంకా సలాం!మా గుండెల్లో ఆ రేడియో లో మీరు ఇంకా బతికే ఉన్నారు. ఉంటారు! మీ ముచ్చటఅయిన మాటలను వెతుక్కుంటూ మిమ్మల్ని వింటూ ఉంటాం!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చిన నారిమన్

ప్రముఖ న్యాయ కోవిదుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి శామ్ నారిమన్ మరణం యావత్తు భారత న్యాయ వాద వృత్తికే లోటు. 1991లో పద్మభూషణ్, 2007లో పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్న నారిమన్ 70 సంవత్సరాలకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగారు. 1950లో బాంబే హైకోర్టులో న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నారిమన్ 1961 నాటికి సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 1972లో ఆయన భారత అదనపు సొలిసిటర్ జనరల్గా నియమితులయ్యారు. అయితే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించడాన్ని వ్యతిరేకిస్తూ 1975లో పదవికి రాజీనామా చేశారు. 1999లో రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయిన నారిమన్ 2005 వరకూ ఆ పదవిలో కొనసాగారు. 1991 నుంచి 2010 వరకూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించారు. 1989 నుంచి 2005 వరకూ పారిస్లోని ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్కు చెందిన అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టుకు వైస్ ఛైర్పర్సన్గా పనిచేశారు. నారిమన్ అనేక న్యాయ శాస్త్ర గ్రంథాలు రచించారు. గాడ్ సేవ్ ది ఆనరబుల్ సుప్రీంకోర్టు, బిఫోర్ మెమరీ ఫేడ్స్, ది స్టేట్ ఆఫ్ ది నేషన్ వాటిలో కొన్ని. ఆయన కుమారుడు రోహింగ్టన్ నారిమన్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. కుమార్తె అనహీత. మయన్మార్లోని రంగూన్లో 1929 జనవరి 10న ఫాలి నారిమన్ జన్మించారు. సిమ్లా, ముంబయిలో విద్యాభ్యాసం చేశారు. 1955లో బాప్సీని వివాహం చేసుకున్నారు. నారిమన్ అనేక ప్రతిష్టాత్మక కేసుల్లో వాదించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో యూనియన్ కార్బైడ్ తరఫున వాదించారు. ఆ తర్వాత తప్పు తెలుసుకొని బాధితులు, కంపెనీ మధ్య నష్టపరిహారం విషయంలో ఒప్పందం కుదిరేలా చూశారు. ఆర్టికల్ 370పై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన తప్పుపట్టారు. ఆయన అత్యుత్తమ న్యాయవాదులు, మేధావుల్లో ఒకరు. సామాన్యులకు న్యాయం అందించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. నారిమన్ మేధోసంపద అపారము. రాజ్యాంగం యొక్క పవిత్రతను కాపాడే విషయంలో అనేక మంది న్యాయ నిపుణులకు నారిమన్ స్ఫూర్తినిచ్చారు. నారిమన్ మరణం న్యాయ వ్యవస్థకు తీరనిలోటు. నారిమన్ మరణంతో ఓ యుగం ముగిసింది. దేశం గొప్ప న్యాయవాదిని కోల్పోయింది.వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి

సమ్మక్క జాతర-తమ్ముని యాది

సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం

మా వూరికి దక్షిణ శివారులో పాలాగు ఒడ్డుకు సమ్మక్క సారక్క జాతర జరుగుతుంది. నేను నా భార్య, ఇద్దరు పిల్లలు, అవ్వ–నాన్న కలిసి జాతరకు వెళ్లినం. వన దేవతలకు మొక్కులు చెల్లించి ఒక కోన్ని కోసి అక్కన్నే చెట్లల్ల వండుకున్నం. రాత్రి 8 గంటలు అయితంది.. పల్లెం లో అన్నం కూర పెట్టుకుని తింటున్న. పిండారపోసినట్టు తెల్లని వెన్నెల కురుస్తంది. స్టీల్ పల్లెం పై ఆ వెన్నెల పడి మెరుస్తంది. ఈ టైంలో తమ్ముడు ఏమి చేస్తున్నట్లు? ఎక్కడ వున్నట్లు? ఒక్క సారిగా మనసు తమ్ముని మీదికి పోయింది. కోర మీసాలు. చురుకైన కళ్ళు . చామనఛాయకు కొద్దిగా మించిన తెలుపు. కండలు తిరిగిన దేహం. వంకీలు తిరిగిన జుట్టు. ఒక్కసారిగా ఆ రూపం నా కళ్ళెదుట కట్టింది. గుండెలో సన్నని బాధ.

నేను ఇంటర్మీడియట్, తను పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఇంట్లో వేములవాడ జాతరకు పోతుంటే తాను రానని మొండికేసిండు. లేని దేవున్ని మొక్కలేనని ఖరాఖండిగా చెప్పిన మొండోడు. చిన్నప్పుడు బహుశా మూడు, నాలుగు తరగతుల్లోననుకుంటా.. చుట్టంగా వచ్చిన మా మేనమామ పోతూపోతూ మా ఇద్దరికి చెరో రూపాయి ఇచ్చి పోయిండు. "పిల్లికి రొయ్యల మొలతాడు" లెక్క పొద్దుగూకె వరకు పాపడాలు, లేమిడీలు కొనుక్కుని రూపాయి మొత్తము ఒడగొట్టిన. ఎన్నడూ కోపానికి రాని మా నాన్న ఆ రోజు నన్ను ఇంట్లకు రానియ్యకుండా బయట నిలబెట్టి తలుపులేసిండు. కొంచెం సేపట్లోనే తలుపు తెర్సుకుంది.తమ్ముడు బయిటికి వచ్చిండు. వెంటనే తలుపు మూసుకుంది".అన్నను ఇంట్లకు తీసుకుంటే సరే... లేదంటే అన్నతోని నేనుంటా" అని ఇంట్ల ఏడిస్తే వాన్నీ బయిటికి దొబ్బిండ్రు. అన్నకష్టములో తోడుండాలన్న తపన వయసుతో పాటే పెరిగి పెద్దదయి, విశాలమయి మంది కష్టాలు పాపేందుకు ప్రాణ త్యాగానికి సిద్ధం చేసింది.

ఇంటిముందు రామస్వామి మామ తాగుబోతు. రోజూ తాగచ్చి కమలత్తను కొడుతుండెడిది. ఒక రోజు దెబ్బలకు తట్టుకోక ఆమె మొత్తుకుంటుంటే రివ్వున రాకెట్లెక్క వాల్లింట్లోకి దూసుకెల్లిండు. ఆయన నుంచి ఆ అత్త ను విడిపించి.."ఆమెను కొట్టడానికి నువ్వెవ్వరు? భర్తవైతే కొట్టే హక్కెవ్వరిచ్చిండు? ఇంకోసారి కొడితే మంచిగుండది" అని గట్టిగా బెదిరిచ్చేసరికి తాగుబోతు మామ హడలిపోయిండు. అది మొదలనుకుంటా... అన్యాయాన్ని ఎదిరించే తత్వం మళ్లెక్కడా ఆగిపోలేదు. తాను పూర్తి కాలపు విప్లవ కార్యకర్తగా మారిన కాలములో ఒక్క సారి హఠాత్తుగా హైదరాబాద్ లో హడావుడిగా ఎదురుపడ్డాడు. ఆశ్యర్యాలు, అలాయ్ – బలాయ్ లు అయిన తరువాత ప్రేమ అంటే ఏమిటి? అని అడిగిండు. నేను 'ఏందిరా ప్రేమలో పడ్డావా? ' అని అడిగాను ఒకింత ఆత్రంతో."అదేం లేదు కానీ, తెల్సుకోవాలని వుంది" అన్నాడు.సినిమా ప్రేమలు, ప్రేమ వివాహాలు, చలం "మైదానం", రంగనాయకమ్మ "జానకి విముక్తి", ఐత్ మాతోవ్ "జమీల్య–దనియార్" 'మార్క్స్–జెన్నీ", మనుషుల పట్ల ప్రేమ, మూగ జీవాల పట్ల ప్రేమ, వర్గ ప్రేమ ఒకటేమిటి అన్ని అంశాలతో ఒక మూడు నాల్గు గంటల నిర్విరామ చర్చ. తన నిండా ప్రేమను మాలోకి వంపి వెళ్ళిపోయాడు. ప్రేమైక మూర్తి. జాతర అయిపోయిన పది రోజుల తరువాత ఒక రోజు నేను పొద్దటి బదిలికి పోయి ఇంటికి వచ్చిన. బెల్లంపల్లి నుండి దోస్తు లక్ష్మన్ లాండ్ ఫోన్ చేసిండు. అన్నా పేపర్ చూసినవా.. అని అడిగిండు. విషయం చెప్పకుండా వార్త దిన పత్రిక మెయిన్లో మూడవ పేజి చూడమన్నడు. ఒక్క సారిగా నెత్తి మీద పిడుగు పడ్డట్టు అయింది. తూర్పు గొదావరి జిల్లా దారకొండ లో సరిగ్గా సమ్మక్క పున్నమి రోజు జరిగిన పోలీస్ అవుట్ పోస్ట్ పై జరిగిన దాడిలో పి.ఎల్.జి.ఎ.డిప్యూటి కమాండర్ గా మా తమ్ముడు సత్యం , నవీన్ పాల్గొని ప్రాణాలొదిలినట్లు జాంబ్రి పేరిట ప్రకటన వచ్చింది. పోలీసు నిర్బంధం వల్ల వెంటనే ప్రకటించలేకపొయామని, గాయపడిన దశలో సత్యంను వెంట తీసుకెళ్తున్న క్రమం లో చనిపోయాడని, అతనిని విప్లవ సాంప్రదాయాలతో ఆంధ్రా–ఒరిస్సా సరిహద్దు గ్రామంలో అంత్యక్రియలు జరిపినట్లు ఆ ప్రకటన సారాంశం. ప్రేమైక సమాజం ఏర్పడాలంటే దోపిడి పోవాలి. ఆ దోపిడికి వ్యతిరేకంగా గిరిజన వీర వనితలు సమ్మక్క–సారక్కలు రాజరికానికి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యి తమ తనువులను తమ వారికి కూడా కనపడనియ్యకుండా చిలకలగుట్టలో వన ప్రవేశం చేసి కుంకుమ బరిణలయ్యారు. సత్యం కూడా ఈ సమాజాన్ని ప్రేమ మయంగా మార్చే యుద్ధం లో అమరుడయ్యి తనువును కూడా మాకు కనపడనియ్యకుండా స్థూపమై ఆకాశమెత్తులో నిలిచాడు.

-హెచ్. రవీందర్

'ఆదిలాబాద్' స్థానంపై కాంగ్రెస్.. కన్ఫ్యూజ్!

రాష్ట్రంలో అధికారంలో చేపట్టిన తర్వాత.. లోక్ సభ ఎన్నికల్లోనూ సత్తా చాటాలనుకుంటున్న కాంగ్రెస్.. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా.. శాసనసభ ఎన్నికల ఓట్ షేరింగ్ ను పరిశీలిస్తే ఇక్కడ 'హస్తం' మూడో స్థానంలో ఉన్నది. దీంతో ఈ సెగ్మెంట్ పై స్పెషల్ ఫోకస్ పెట్టేందుకు మంత్రి సీతక్కను పార్లమెంట్ ఇన్ చార్జిగా, జిల్లా ఇన్ చార్జి మంత్రిగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. ఇక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సుమారు 22 మంది నాయకులు దరఖాస్తు చేసుకోగా.. అభ్యర్థి ఎంపిక విషయంలో ఏఐసీసీ, టీపీసీసీ మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. పరిశీలనలు, సర్వేల తర్వాత లంబాడాలను క్యాండిడేట్ గా ఎంపిక చేయాలని జాతీయ నాయకత్వం సూచిస్తుండగా.. ఆదివాసీ అభ్యర్థికి టికెట్టు ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వం పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఇప్పుడు ఈ పంచాయితీ 'హస్తిన'కు చేరగా... రాహుల్ గాంధీ నిర్ణయమే ఫైనల్ కానున్నట్లు సమాచారం.

కాంగ్రెస్, బీజేపీలకు ఆదిలాబాద్ ఎంపీ స్థానం 'హాట్ సీట్'గా మారగా, టికెట్టు ఆశిస్తున్న ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉన్నది. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు బీజేపీ నాయకత్వానికి 42 మంది దరఖాస్తు చేసుకుంటే.. కాంగ్రెస్ టికెట్టు కోసం 22 మంది అప్లయ్ చేశారు. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు రాజకీయ నేతలతోపాటు ఆఫీసర్లు, రియల్టర్లు, న్యాయవాదులు, సంఘసేవకులు ఆసక్తి కనబరుస్తున్నారు. కాగా, కాంగ్రెస్ టికెట్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాంనాయక్ తోపాటు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్ చార్జి నరేశ్ జాదవ్, ఐఆర్ఎస్ ఆఫీసర్ ప్రకాశ్ రాథోడ్, రియల్టర్ శ్రీనివాస్ నాయక్, న్యాయవాది జాదవ్ శ్రవణ్ కుమార్ ఉన్నారు. వీరితోపాటు ఆత్రం సుగుణ, జాదవ్ రాంకిషన్ నాయక్, తొడసం ధనలక్ష్మి, కోట్నాక్ తిరుపతి, ఆత్రం రోషన్ కుమార్, ఆత్రం భాస్కర్, సేవాలాల్ రాథోడ్ సైతం రాష్ట్ర నాయకత్వం వద్ద తమ ఆసక్తిని కనబర్చారు.

ఆల్రెడీ షార్ట్ లిస్ట్?

తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు 309 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ ఎలక్షన్, స్క్రీనింగ్ కమిటీలు పలుమార్లు భేటీ అయి ఆదిలాబాద్ నుంచి కొందరి పేర్లను షార్ట్ లిస్ట్ చేసి హై కమాండ్ కు పంపినట్లు తెలిసింది. ఇందులో కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్ చార్జి నరేశ్ జాదవ్, ఐఆర్ఎస్ అధికారి ప్రకాశ్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ తోపాటు పలువురి పేర్లు ఉన్నట్లు సమాచారం. అయితే షార్ట్ లిస్ట్ లో ఉన్న నేతలతోపాటు, తమ పేర్లను ఎందుకు హై కమాండ్ కు పంపించలేదో తెలుసుకోవడానికి ఇతర దరఖాస్తుదారులు సైతం పలుమార్లు హస్తినకు వెళ్లి జాతీయ నేతలతో కలుస్తున్నట్లు సమాచారం.

ఒకరిపై మరొకరి ఫిర్యాదులు..

రాష్ట్రంలో స్క్రీనింగ్ ప్రాసెస్ కంప్లీట్ కావడంతో టికెట్టు కోసం దరఖాస్తు చేసుకున్న నేతలంతా పలుమార్లు ఢిల్లీ వెళ్లి వస్తున్నారు. తమ గురించి ఆలోచించాలని జాతీయ నేతలను వేడుకుంటున్నారు. అయితే ఒకరిపై మరొకరు ఫిర్యాదులు సైతం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన ఓ నేత.. దశాబ్దాలుగా పార్టీని అంటిపెట్టుకొని ఉన్న వారిని కాదని.. అధికారులు, రియల్టర్లకు ఎలా ప్రాధాన్యతనిస్తున్నారని ప్రశ్నించినట్లు సమాచారం. అంతేకాకుండా తనకు టికెట్టు కేటాయించాలని రాష్ట్ర నాయకత్వానికి మొరపెట్టుకున్న ఓ మాజీ ఎమ్మెల్యే.. వారు ససేమీరా అనడంతో నేరుగా ఢిల్లీకు వెళ్లినట్లు తెలిసింది. అక్కడ డైరెక్ట్ గా డీకే శివకుమార్ తో మంతనాలు జరిపినట్లు సమాచారం. ఈ వ్యవహారాలు ఇలా ఉండగా.. ఓ కాంగ్రెస్ నేత అయితే తనకు ఇంటర్నల్ గా ఇండికేషన్ ఇచ్చారంటూ 'సోషల్ మీడియా'లో ప్రచారాన్ని సైతం మొదలుపెట్టడం గమనార్హం.

దరఖాస్తు చేసుకున్నా.. చేసుకోకున్నా..!

దరఖాస్తుతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ లాస్ట్ టైమ్ లో ఎవరికైనా టికెట్టు కేటాయించే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా కాంగ్రెస్ పోటీ చేసే వారి నుంచి అప్లికేషన్లను ఆహ్వానించింది. ప్రతి సెగ్మెంట్ నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు వెళ్లాయి. అయితే చెన్నూరు నియోజకవర్గం నుంచి కూడా పలువురు దరఖాస్తు చేసుకోగా.. అసలు దరఖాస్తు చేసుకోని, బీజేపీ నుంచి చేరిన గడ్డం వివేక్ ను టికెట్టు ఇచ్చి బరిలో దింపింది. ఆదిలాబాద్ ఎంపీ స్థానం విషయంలో కూడా కొంతమేర ఇలాగే జరిగే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

- ఫిరోజ్ఖాన్
సీనియర్ జర్నలిస్ట్
9640466464

పొడుపు విడుపులు

1.మూగజీవాల రోదన
మనకు ప్రకృతిలో ప్రయాణ
అనుభూతి
(జంతుప్రదర్శనశాల)
2.ఆకలితీర్చే క్షేత్రం
గృహిణికి నిరంతరం
అస్త్రశస్త్రవిన్యాసం
ఆహారోత్పత్తి ,(వంటగది)
3.ప్రకృతిలో వనరు
ధరలో మనకు సమకూరు
(అదేఊటనీరు)
4.పక్షుల కిలకిల రావాలు
ధరణికి పచ్చలసొబగులు
(వర్షఋతు సూచన)
5.ఎగిరే తుండుగుడ్డా
పనికిరావు నీవు కిందపడ్డా
(చేరుమాలు)
6.గాలిని ఇచ్చే తిరుగలి
అది ఆగిందా మన పని కథాకళి
(సీలింగ్ ఫ్యాన్)
7.రుచికి రారాజు
అది లేనిదే గడవదేరోజు
(లవణం)
8.తనపనైతే జోరు,ఇతరులదైతే
ఎంతో హెూరు
ఎందుకయ్యా ఈ బేజారు
(సోమరి)
9.మధ్యతరగతి జీవుల
వేసవి విడిది
(ఎయిర్ కండిషన్ గది)
10.మోతమోగటం చేత
హస్త భూషణం అయ్యింది అంచేత
(చరవాణి)
11.కవితకు కాదేది అనర్హం
పలు సంస్కృతులలో భిన్నం ఆహార్యం
కంటికి ఇంపైనదే ఆహ్లాదం
(దుస్తులు)
12.దేవుళ్ళకు రెస్టింగ్ ప్లేస్
మనకు డివైన్ డెకరేషన్ ప్లేస్
(పూజగది)
13.పలువస్తువులకు ప్రదర్శన
,అందరికి ఆకర్షణ
డబ్బు ఖర్చుపెట్టాలం

మణికొండ మున్సిపాలిటీలో వీగిన అవిశ్వాస తీర్మానం

- తిరుజట్ల గోవా క్యాంపు రాజకీయంతోనే బెడిసి కొట్టింది
- చాకచక్యంగా వ్యవహరించిన చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22(జనం సాక్షి)

మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ కస్తూరి నరేందర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టిన అసమ్మతి పాలక వర్గం బోల్తా పడింది. గురువారం మణికొండ మున్సిపాలిటీలో ఖచ్చితంగా గెలుస్తాం అని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన బల నిరూపణలో కోరం సంఖ్యాబలం లేక కేవలం 10 మంది కౌన్సిలర్లు పాల్గొనడంతోనే వారి ఆశలపై వారే నీళ్లు చల్లుకున్నట్లయింది. గురువారం 11 గంటలకు ప్రారంభమైన అవిశ్వాస తీర్మానంలో 11:30 గం లకు కౌన్సిలర్లు పద్మారావు, నవీన్ కుమార్, శ్వేత, శైలజ, వందన, హైమాంజలి, కావ్య, నాగలక్ష్మి లు మున్సిపాలిటీ లో హాజరుకాగ, చివరి నిమిషంలో రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్ స్వామిలు హాజరయ్యారు. మొత్తం 2/3 వంతు మద్దతుపై మొత్తం 13 మంది కౌన్సిలర్లు బల నిరూపణలో తెలుపాల్సి ఉంది. అందుకు 10 మంది మాత్రమే మద్దతు తెలపడంతో అవిశ్వాసం వీగిపోయింది. గత నెల కిందట పదిమంది సంతకాలు చేసి జిల్లా కలెక్టర్ అందించిన వారిలో మొదటినుంచి 2వ వార్డు కౌన్సిలర్ వసంత్ చౌహాన్ అవిశ్వాస మద్దతు కూడగట్టిన అవిశ్వాస బల నిరూపణలో పాల్గొనక వెనుకడుగు వేయడంపై 12మంది కౌన్సిలర్లు పాల్గొనలేదని తాను 13వ కౌన్సిలర్ మద్దతు తెలిపేందుకే ఉన్నానని ఆయన వివరించారు. కానీ మీడియా పరంగా రాజకీయ ఒత్తిడి ఉందని, ఆయనకు ఆరోగ్యం సరిగా లేదని హాజరైన కౌన్సిలర్లు తెలిపారు. వైస్ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి మొదటి నుంచి తటస్థంగా ఉండి 12 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపితే తాను 13వ కౌన్సిలర్‌గా మద్దతు తెలుపుతానన్న విషయం తెలియజేశారు. దీనిపై చివరి నిమిషం వరకు సంపూర్ణ మద్దతు తమకే ఉందంటూ రామకృష్ణారెడ్డి విస్తృత ప్రచారం చేసినప్పటికీ తన సన్నిహితులే మద్దతు తెలుపకపోవడంతో పరువు పోయిందని మున్సిపాలిటీలో విశ్లేషించుకుంటున్నారు. గత నెలలో మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ కస్తూరి నరేందర్ పై జిల్లా కలెక్టర్ కు నోటీసులు అందజేశారని దాని ప్రకారం అవిశ్వాస బలం నిరూపణలో 2/3 ప్రకారం 13 మల్లి కౌన్సిలర్లు మద్దతు తెలుపాల్సి ఉంది. కేవలం పది మంది మాత్రమే కౌన్సిలర్ పాల్గొనడంతో నే అవిశ్వాసం వీగిపోయిందని ప్రిసైడింగ్ అధికారిగా, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి వెల్లడించారు. మణికొండ మున్సిపాలిటీలో రాజకీయ చతురుడుగా పేరుగాంచిన చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ ఎక్కడ కూడా ఆర్భాటానికి ,హెచ్చులకు తావివ్వకుండా ఏది జరిగితే అది కానీ అంటూ చెబుతూనే దబ్బులకే ఇదంతా జరుగుతుందని స్పష్టంగా తెలిపాడు. తన అసమ్మతి వర్గంపై కన్నేసిన నరేంద్రుడు లోలోపల వ్యూహరచనలు అల్లాడు. చివరి నిమిషంలో అసమతి వర్గం మేమే నెగ్గుతాం చైర్మన్ రాజీనామా చేయవలసిందిగా ప్రకటన విడుదల చేసినప్పటికీ తనదైన శైలిలో ప్రత్యర్థులు వేసిన గోవా ట్రిప్పులో తాను కూడా వేసి అక్కడే కొంత మందిని తన జట్టులోకి తెచ్చుకున్నాడని విశ్వసనీయ సమాచారం. అసమతి వర్గంలో 12 మంది కౌన్సిలర్లు మద్దతు తెలుపుతున్నారని తెలుసుకొని తన దైన వ్యూహరచన లో అసమ్మతి వర్గంను చిత్తు చేసి కేవలం 10 మంది కౌన్సిలర్లు మాత్రమే పాల్గొనేలా చేశాడని మున్సిపాలిటీలో వినిపిస్తున్న ఆరోపణలు.

పదిమంది అవిశ్వాసం

అవిశ్వాసం వీగిపోయినా అభివృద్ధి అన్ని వార్డుల్లో సమానంగా జరగాలి. గత మూడు సంవత్సరముల నుంచి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల వార్డులోని అభివృద్ధి జరిగిందని దీనిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్న అధికారులు చైర్మన్లు కలిసి తమ వార్డులోనే అభివృద్ధి జరిగేలా అజెండాలు రూపొందించారని ఆరోపణలున్నాయి. కానీ ఇప్పుడు అలా జరగదని, సంఖ్యా బలం కౌన్సిలర్లతోనే అభివృద్ధి అన్నివార్డుల్లో సమానంగా జరిగేటట్టు కచ్చితంగా తీర్మానిస్తామని తెలిపారు. అవిశ్వాసం నెగ్గడంతో గోవాలోనే తన పార్టీ కౌన్సిలర్ల తో విజయ చిహ్నంగా విక్టరీ చూపించిన చైర్మన్ కస్తూరి నరేందర్

ఎటిఎంలో చోరీకి యత్నం

సీసీ ఫుటేజ్ సహాయంతో అదుపులోకి ఇద్దరు వ్యక్తులు

శంషాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యూనియన్ బ్యాంక్ ఎటిఎంలో గురువారం తెల్లవారుజామున ఇద్దరు దుండగులు చోరీకి విపలయత్నం చేశారు. అల్లారం మొగుడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో. సీసీ కెమెరాల ఆధారంగా శంషాబాద్‌కు చెందిన మరి కంటి కృష్ణ, చేవెళ్ల కృష్ణ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. రెండు గంటల వ్యవధిలో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులను యూనియన్ బ్యాంక్ సిబ్బంది వర్షం వ్యక్తం చేశారు. ఏటీఎంలో 10 లక్షల వరకు నగదు డిపాజిట్ చేయడంతో కొంత ఇబ్బంది పడ్డాము. ఏటీఎం తెరుచుకోకపోవడంతో, పది లక్షల రూపాయల నగదు భద్రంగా ఉందన్నారు. పోలీసులకు యూనియన్ బ్యాంక్ శంషాబాద్ మేనేజర్ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

మా కెప్టెన్‌లే మా బలం..!

సహా వ్యవస్థాపకులు పవన్ గుంటుపల్లి చంపాపేట్‌లో ఘనంగా రాపిడ్ క్యాబ్ మహోత్సవం

మహేశ్వరం, ఫిబ్రవరి 22 (జనం సాక్షి)

హైదరాబాద్‌లో తమ 1500కు పైగా అంకితమైన క్యాబ్ కెప్టెన్‌లను సత్కరిస్తూ "క్యాబ్ మహోత్సవం"ను చంపాపేట్ లోని మినర్వా గార్డెన్లో గురువారం నిర్వహించిన రాపిడో. హైదరాబాద్‌లోని 1500ం కంటే ఎక్కువ మంది కెప్టెన్‌లు రాపిడో నిర్వహించిన క్యాబ్ మహోత్సవంలో పాల్గొని నిర్వాహకుల ప్రశంసలను అందుకున్నారు. రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి, రాపిడో పరంగా తమ లక్ష్యం సాధించడంలో, నగర ప్రయాణాన్ని సులభతరం చేయడంలో కెప్టెన్స్ అందించిన అమూల్యమైన కృషికి వారిని ప్రోత్సహించి, రివార్డ్ లను అందజేశారు. జీరో-కమీషన్ మోడల్‌ను అవలంబించడంలో అగ్రగామిగా, రాపిడో దాని కెప్టెన్‌లకు మరింత సంపాదించడానికి, వారి ఆదాయాలను పెంచుకోవడానికి వారికి సహాయక, సాధికారత వాతావరణాన్ని ప్రోత్సహిస్తుంది. సరసమైన ప్రయాణ ఎంపికలను సులభతరం చేయడంతో పాటు, రాపిడో

విస్తరణ హైదరాబాద్‌లో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో గణనీయంగా సహాయపడింది, ఇది నగరం మొత్తం ఆర్థిక వ్యవస్థకు దోహదపడిందన్నారు. వారి అంతులేని కృషి, సహకారాన్ని గుర్తించడమే కాకుండా, తోటి కెప్టెన్‌లతో వారి విజయాలను పంచుకోవడానికి, ఒకరికొకరు మద్దతు ఇవ్వడానికి, ప్రయాణీకులకు అసాధారణమైన సేవలను అందించడంలో వారి నిబద్ధతలో ఐక్యంగా ఉండటానికి ఈ కార్యక్రమం ఒక ప్రత్యేకమైన వేదికగా పనిచేసింది.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తాండూరు ఫిబ్రవరి 22(జనం సాక్షి)

అంగన్వాడీలకు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం తాండూరు పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడిలో ఎదురుకుంటున్న సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఎల్లప్పుడు పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు సమస్యల పరిష్కారం కోసం కనీస వేతనం 25వేల రూపాయలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని గత ప్రభుత్వాలపై అనేక పోరాటాలు నిర్వహించి కొన్ని హక్కులు సాధించుకున్న చరిత్ర అంగన్వాడీలకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం దిశగా ఆలోచించి వారి న్యాయమైన డిమాండ్ లను పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా అంగన్వాడి హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని ఈనెల 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంద న్నారు. అంగన్వాడి హెల్పర్స్ ప్రతిఓక్కరు పెద్ద సంఖ్యలో వికారాబాద్ జిల్లా కలెక్టర్

కార్యాలయం ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాండూర్ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక అధ్యక్షురాలు ఎం. బాలమణి ప్రధాన కార్యదర్శి బేబి, ఉపాధ్యక్షులు జయంతి, లలిత, రామానుజమ్మ, రాజేశ్వరి సహాయ కార్యదర్శులు సుజాత, అంజమ్మ, మాణిమల, లక్ష్మి, సరస్వతి, శోభ, వాణి, కోశాధికారి శశికళ, చంద్రకళలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కమిషనర్ రోనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22(జనం సాక్షి):

యాకత్ పుర మౌలిక చిల్లగంగా నగర్ నుండి భవాని నగర్ వరకు చేపట్టే నాలా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, యాకుత్ పుర, చార్మినార్ ఎమ్మెల్యేలతో కలిసి గంగా నగర్ వర్షపు నీటి కాలువను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన నాలా పనులను పూర్తి చేసేందుకు ఏజెన్సీ మెన్ మెటీరియల్ పెంచి వర్షాకాలం నాటికి పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మొఘల్ పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిహెచ్ఎంసికి చెందిన పలు విభాగాల కార్యాలయాలు ఇక్కడి నుండి మార్చేందుకు అనువైన భవనాలను గుర్తించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. చార్మినార్ సర్దార్ మహల్ పునరుద్దన పనులను చార్మినార్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ పనులను పరిశీలించి సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులను నిర్దేశించిన కాల వ్యవధి కంటే ముందు త్వరితంగా పూర్తి చేయాలని తెలిపారు. మొఘల్ పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తులు చేపట్టాలని అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్, యాకత్ పుర శాసనసభ్యులు మీర్ జుల్ఫేకర్ అలీ, జాఫర్ హుస్సేన్ మిరాజ్, ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్, కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ, సిసిపి రాజేంద్ర ప్రసాద్ నాయక్, శానిటేషన్, స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, యాదగిరి రావు, జోనల్ కమిషనర్ వెంకన్న, ఎస్ఈ లు దత్తు పంతు, కులికుతుబ్ షా, ఈఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి సీనియర్లు

ఎమ్మెల్యే సబితా అనుచరగణం ఆరాచకలపై ఆవేదన

కష్టకాలంలో పార్టీని కేఎల్ఆర్ నిలబెట్టారు

మహేశ్వరం, ఫిబ్రవరి 22 (జనం సాక్షి)

కందుకూర్ మండలం జైత్వారం, బాచుపల్లి గ్రామాల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు బీఆర్ఎస్ నాయకులు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.. తుక్కుగూడ నివాసంలో కండువాలు కప్పుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో హస్తం పార్టీని ముక్కలుగా చేసి... కారెక్కిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పార్టీ సీనియర్ నాయకులు మండిపడ్డారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కేఎల్ఆర్ పోటీ చేసి క్యాడర్ ను నిలబెట్టారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్, బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మళ్లీ తిరిగి సొంతగూటికి రావటం సంతోషం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రోజూ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రీవెన్స్ కోసం వచ్చే బాధితుల్లో ఎక్కువ మంది సబితమ్మ

అనుచరగణం బాధితులే ఉన్నారని చెప్పారు. సమస్యలను పరిష్కరించకుండా చిక్కుముడులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేఎల్ఆర్ మండిపడ్డారు. బాచుపల్లి నుంచి వెంకటేశ్, జైత్వారం నుంచి మహేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని కేఎల్ఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణానాయక్, జంగారెడ్డి, సత్యనారాయణ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- మేడ్చల్ జిల్లా డి ఎం హెచ్ ఓ రఘునాథ స్వామి
- కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

కాప్రా జనం సాక్షి

కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం కేంద్రం చిరువ్యాపారులకు అడ్డాగా మారింది. ఆరోగ్య కేంద్ర సముదాయాన్ని చిరువ్యాపారులు స్టోర్ రూంగా మార్చుకోవటంతో పాటు పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణీ స్త్రీలు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత కొంతకాలంగా ఇక్కడి ఆరోగ్యకేంద్రం గధులను చిరువ్యాపారులకు నెలసరిగా కిరాయిలకు ఇచ్చుకున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. స్పందించిన అధికారులు సబ్ సెంటర్ ను సందర్శించి వాస్తవాలను గ్రహించారు, ఆరోగ్య సిబ్బంది హెచ్ఈఓ శ్యాంసుందర్, ఏఎన్ఎం మహేశ్వరిలకు మెమో జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డి ఎం హెచ్ ఓ రఘునాథ స్వామి, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తో కలిసి కుషాయిగూడ ప్రాథమిక ఉప కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య ఉప కేంద్రానికి సంబంధం లేని సామాగ్రిని ఖాళీ చేయించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. శిధిలావస్తులో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండ నూతన పల్లె దవాఖాన మంజూరీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, హెచ్ ఈ ఓ శ్యాం సుందర్, ఏఎన్ఎం మహేశ్వరి, వరలక్ష్మి, టౌన్ ప్లానింగ్, జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులు పండాల శివకుమార్ గౌడ్, సీతారాం రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, బొడిగ ప్రభు గౌడ్, వెంకట్ రెడ్డి, బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

మల్కాజిగిరి, ఫిబ్రవరి22 (జనంసాక్షి)

వికలాంగులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో వికలాంగులతో కలిసి గురువారం కొత్తగా బాధ్యతలు తీసుకున్న మల్కాజిగిరి తహసిల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం. వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ. వికలాంగులకు సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వ స్థలంలో బిల్డింగ్ నిర్మించి ఇవ్వాలని, జనవరి నెలలో ప్రజా దర్బార్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయనికి ఆదేశాలు జారీ చేశారనీ తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోను, రజిత, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ పాలకుల విధానాలు..నేటి యువత కర్తవ్యం

ఈ నెల 28న రాష్ట్ర సదస్సు

నాచారం(జనం సాక్షి) :

దేశ పాలకుల విధానాలు నేటి యువత కర్తవ్యం అనే అంశంపై రాష్ట్ర యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వరంగల్ లో ఈ నెల 28న రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సుకు సంబంధించిన గోడ పత్రికను ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద విడుదల చేశారు. ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తో పాటు రాష్ట్రంలో ఉన్న అన్ని యువజన, విద్యార్థి బాధ్యులను ఆహ్వానించనున్నట్లు, అదేవిధంగా జాతీయ నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలోనే యువత ఎక్కువ ఉందని చెప్పారు. ప్రపంచంలో 186 కోట్లమంది యువజనులు ఉంటే అందులో 28 శాతం భారతీయులేనన్నారు. పాలకుల వినాశకర విద్యా విధానాల కారణంగా దేశంలోని 30శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేవన్నారు. రాష్ట్రానికి విభజన హామీలకు దిక్కులేదని,బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. ఖాజీపేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం,సైనిక్ స్కూల్స్ వంటి హామీలను నెరవేర్చలేదన్నారు. కనీసం వీటినైనా నిర్మించి ఉంటే వేలాది మందికి ఉపాధి లభించి ఉండేదన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న వినాశకర ఆర్థిక విధానాల ఫలితంగా చదువుకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదని విమర్శించారు. అవినీతి, దోపిడీలకు ఆస్కారం లేని సమాజం యువత ఆకాంక్ష అని చెప్పారు. ఇది యువతతోనే సాధ్యమని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు మహేష్, కిరణ్, రాజు, కల్పన, రాజశ్రీ, రమ్య, స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

మల్కాజిగిరి,ఫిబ్రవరి22(జనంసాక్షి)

ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండి అవగాహన పెంచుకోవాలని సైబర్ క్రైమ్ ఏసిపి నరేందర్ అన్నారు. గురువారం మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో షేర్ అంబ్రెల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ శైలజ అధ్యక్షతన సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..విద్యార్థులందరూ అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని,సెల్ ఫోన్ లో వచ్చే మెసేజ్‌లకు రిప్లై ఇవ్వకుండా జాగ్రత్త పడాలని మోసానికి ఎక్కడ గురికాకుండా ఎప్పుడు ఎల్లవేళలా జాగ్రత్తగా ఉండాలని సెల్ ఫోన్ మంచి పనులకే ఉపయోగించి చెడుకు దూరంగా ఉంచాలని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. షేర్ అంబ్రెల్లా ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ విజయ అర్చన మాట్లాడుతూ. పర్యావరణం పై అందరు బాధ్యతాయుతంగా ఉండాలని పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందనీ అన్నారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవాటు పరుచుకొని సరైన జీవితాన్ని ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ చంద్రలేఖ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జగన్ మల్లిక, డాక్టర్ రచన,డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 ఫిబ్రవరి 2024

భయపడితే బలైపోతారు

జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రామేశ్వర్

బిజినేపల్లి జనం సాక్షి:

విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారికి భయపడి బలైపోకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రామేశ్వర్ విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో గల బాలికల ఉన్నత పాఠశాలలో మిషన్ వాత్సల్య బాల రక్ష భవన్ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రామేశ్వర్ మాట్లాడుతూ.గ్రామాలలో బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు అదేవిధంగా బాలల అక్రమ రవాణాను నివారించాలన్నారు. బాలలతో బిక్షాటన చేయించడం చట్టారీత్య నేరం అని తెలిపారు. బాలికల పట్ల వివక్ష చూపించరాదన్నారు. మన చుట్టుపక్కల లైంగిక వేధింపులకు గురవుతున్న బాలబాలికలను రక్షించాలని తెలిపారు. బడి మానివేసిన పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత మనందరి పైన ఉందని గుర్తు చేశారు. చట్టాలపై విద్యార్థిని

విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో ప్రజలకు రక్షణ కల్పించడం. వారి ప్రాణాలకు. వారి ఆస్తులకు రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఆకతాయిల పట్ల మహిళలు. చిల్డ్రన్స్ బలహీనంగా ఉండి భయపడిపోకుండా చట్టాల సపోర్టు తీసుకుని ధైర్యంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. తొమ్మిదవ తరగతి నుండి సెకండ్ ఇయర్ చదువుకునే విద్యార్థినిలు ఈ వయసులో శరీరంలో జరిగే మార్పులను బట్టి చాలా జాగ్రత్తగా ఉండాలని. విద్యార్థినీలు ఒంటిగా చదువుకునే సమయాలలో లైంగిక నేరాలు జరగకుండా ధైర్యంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం లైంగిక అత్యాచార నిరోధక చట్టం అందుబాటులో ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ విని యోగించుకోవాలన్నారు. ఈ వయసు విద్యార్థిని విద్యార్థులు ఈ సమయంలోనేచదువుపై శ్రద్ధ పెట్టిఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు. కొంతమంది ఆకతాయిలు అసభ్యకరమైన ఉద్దేశంతో సెక్సువల్ అరాచ్మెంట్ కు. రేపు గురికాకుండా జాగ్రత్తలు పాటిస్తూ చైల్డ్ వెల్ఫేర్ హెల్ప్ లైన్ నెంబర్. 1098. వాట్సాప్ నెంబర్.8712657676.లేదా100 కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఇట్టి సంఘటనలపై ఎవరైనా ఫిర్యాదు చేసినచో వారి పేర్లను గోప్యంగాఉంచబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇన్చార్జి విజయలక్ష్మి ఎస్సై నాగ శేఖర రెడ్డి, షీ టీమ్ నెంబర్ వెంకటయ్య, హోంగార్డు శివకుమార్. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు. విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జైన్ మందిర ప్రారంభించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణ ఫిబ్రవరి 22 (జనం సాక్షి)

మండలం కున్సి గ్రామ శివారులో గురువారం నూతన పార్శనాథ భగవాన్ ప్రతిష్టాపన విగ్రహం మందిరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధ్యరంలో ప్రారంభించారు. జైన్ ధర్మ,మత గురువులు, భక్తులు, చుట్టుపక్కల వివిధ గ్రామాల ప్రజలు అందరూ కలిసి అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక శ్రద్ధ భక్తితో , పూలమాలలతో, వివిధ అభిషేకాలాతో పూజ చేసి అనంతరం తీర్థ ప్రసాదాలు ,ఆశీర్వాదం తీసుకుని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని గ్రామాల ప్రజలందరికీ స్వామి వారి ఆశీర్వాదం అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని రైతులు ,పండే, పంటలు, బాగా పండాలని వారి ఆరోగ్య ,ఐశ్వర్యములు,నిండు నూరేళ్ళు, సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువకులు,ప్రజాప్రతినిధులు, మహిళలు, జైన్ ధర్మ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లా వికలాంగుల అభ్యున్నతికి కృషి చేయండి

జిల్లా వికలాంగుల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కందనూలు నిరంజన్

నాగర్ కర్నూల్ ఆర్సీ ఫిబ్రవరి 22(జనం సాక్షి):

నాగర్ కర్నూలు జిల్లాకు కొత్తగా వచ్చిన వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా వికలాంగుల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కందనూలు నిరంజన్ గురువారం మధ్యాహ్నం ఐడిఓసి లోని వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు వికలాంగుల అభివృద్ధి, అభ్యున్నతికి తమరు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా జిల్లాల్లో వికలాంగుల నిరుద్యోగులు ఎక్కువగా ఉన్నారని బ్యాక్లాగ్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కోరారు. వికలాంగులకు జీవనోపాధి కొరకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, బ్యాంకులతో సంబంధం లేకుండా లోన్లు మంజూరయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. త్రీ వీలర్ మోటార్స్ వెహికల్స్ త్వరగా అందజేయాలని ఉన్నత చదువులు చదువుతున్న వికలాంగుల విద్యార్థులు కొత్తవారికి కూడా అవకాశాలు కల్పించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. మరియు వికలాంగుల అంతర్జాతీయ దినోత్సవం అయిన డిసెంబర్ 3, లూయిస్ బ్రెయిలీ జనవరి 4న నిర్వహించాల్సిన అంతర్జాతీయ దినోత్సవాలు ఇంతవరకు నిర్వహించనందున వాటిని నిర్వహించేందుకు తమరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా టౌన్ ప్రెసిడెంట్ భీమ్ సాగర్, సెక్రెటరీ బాలపిరు, జిల్లా నాయకులు రాము, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నీటి వాట విషయంలో రాజీ పడేది లేదు

మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ ఫిబ్రవరి 22(జనం సాక్షి)

కొల్లాపూర్ నియోజక వర్గం స్వరాష్ట్రంలో కేసీఆర్ హయాంలోనే కృష్ణా జలాల్లో ఏపీ దోపిడీ ఎక్కువైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కృష్ణా నీటిని వినియోగించుకోవడంలో విఫలమయ్యాం మంత్రి జూపల్లి కృష్ణారావు కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో మనకు తీవ్ర అన్యాయం జరగడానికి కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వారు అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాకు రావాల్సిన వాటా విషయంలో రాజీపడేది లేదని మంత్రి జూపల్లి వారు స్పష్టంచేశారు.తెలంగాణకు రావాల్సిన నీటి వాటా గురించి సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యమని, మన ప్రాజెక్ట్స్ ను కేఆర్ఎంబీకి అప్పగించబోమని అసెంబ్లీ తీర్మానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కృష్ణా జలాల వాటాను 299:512 టీఎంసీలుగా 2015 నుంచి 2023 వరకు ఒప్పుకొని ఇప్పుడు తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు 50:50 నీటి వాటాపై పోరాడాలని మాకు నీతులు చెపుతున్నారని వారు ద్వజమెత్తారు. ఏపీ కేటాయింపును మించి వాడుకుందని,ఈ 299 టీఎంసీలను కూడా తొమ్మిదిన్నర ఏండ్లలో ఏ సంవత్సరం కూడా పూర్తిగా వినియోగించు కోలేకపోవడానికి గత ప్రభుత్వం కారణం కాదా అని

వారు ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరగ డానికి కారణం కేసిఆరేనని మంత్రి జూపల్లి కృష్ణారావు వారు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎక్కువ నీళ్లు వాడుకుం టున్నా. అప్పట్లో కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. రైతులపాలిట కేసిఆర్, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు ద్రోహులుగా నిలిచిపోతారని వారు విమర్శించారు. కృష్ణా జలాల వినియోగ సామర్థ్యం పెంచటంలో గత కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దక్షిణ తెలంగాణ దారుణంగా మోసపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులోనూ వివక్ష చూపారని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాల కింద కాలువల పనులను చేపట్టకపోవడం, ప్రాజెక్టులను పూర్తిచేయకపోవడం మూలంగా జిల్లా ప్రజలకు సాగునీరు ఇస్తామన్న ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని దుయ్యబట్టారు.కాల్వలు, పిల్ల కాల్వల పనులను కూడా పూర్తి చేయలేదు. ఇప్పటివరకు చివరి ఆయక్‌ట్టుకు నీరందించలేకపోయారని వారు అన్నారు. చేసిందంత చేసి బీఆర్ఎస్ నేతలు ఈ అంశంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమంగా రాసేందుకు ప్రయత్నం చేయాలి

వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వర్

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 22 (జనంసాక్షి)

పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు అనగానే భయపడాల్సిన అవసరం లేదని చదువుకున్న విషయాలను అత్యుత్తమంగా రాసేందుకు ప్రయత్నం చేయాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వర్ ఉద్బోధించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎంబి గార్డెన్స్‌లో ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు ప్రేరణ, పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. అన్ని సబ్జెక్టులపై నిపుణులతో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విద్యార్థులకు పరీక్షల పట్ల మానసిక సంసిద్ధత ధైర్యాన్ని నింపారు. విద్యార్థులు వార్షిక పరీక్షలు అనగానే అనవసర ఆందోళన పడుతుంటారని ఆందోళన వల్ల చదువుకున్నది సైతం పరీక్ష రాసే సమయంలో మరచిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అందువల్ల భయాన్ని వీడి చదువుకున్న వాటిని బాగా రాసేవిధంగ ప్రయత్నం చేయాలని సూచించారు. తద్వారా పదో తరగతిలో మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులందరూ బోర్డు పరీక్షల్లో పదికి పది సాధించాలని సూచించారు. పరీక్షలు అంటే విద్యార్థులకు భయం ఉండకూడదని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత, డిటిడిఓ ఎం శ్రీనివాసులు, ఇంపాక్ట్ రవీంద్ర ధీర, ఉపాధ్యాయ నిపుణులు శ్రీనివాసులు, నాగరాజు, గోవర్ధన్, మధుసూదన్, శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ఒక్కటే సమాజాన్ని మార్చాగలదు

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి)

జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి కో ఆప్ జూనియర్ కాలేజీ ఇంటర్ సీనియర్ విద్యార్థులకు యూత్ ఫెస్ట్ పేరిట వీడ్కోలు సమావేశం ను అంజనా గార్డెన్‌లో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 320లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరి నారాయణ బట్టడ్, ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో మార్పు విద్యా ద్వారానే సాధ్యం అవుతుంది అన్నారు. విద్యార్థులు సమయపాలన, క్రమ శిక్షణ పాటిస్తూ గొప్ప లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం ను మన అభివృద్ధికి వినియోగించు కొని తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జనవరిలో నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్ట్ విజేతలకు బహుమతులు అందచేశారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమంలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యపాక బృందం రఘుపతి రెడ్డి, రాజు, రవి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలి

ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ ఆర్సీ ఫిబ్రవరి 22(జనం సాక్షి):

నాగర్ కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు అన్ని రంగాలలో రాణించి నియోజకవర్గ పేరు ప్రతిష్టను దేశవ్యాప్తంగా తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజులలో కళాశాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచే విధంగా తన వంతు కృషి చేస్తానని వివరించారు. 1964 లో ప్రారంభించిన కళాశాల కొంత శిథిలావస్థకు చేరుకుందని త్వరలోనే వాటిని పునర్నిర్మాణం చేపట్టి ముందుకు సాగుతామని విద్యార్థులు విద్యలో రాణించి కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కళాశాల అభివృద్ధి కోసం తన తండ్రి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కృషి చేయడం జరిగిందని అందువల్లే కొన్ని శిలాఫలకాలపై ఆయన పేరు ఉందని గుర్తు చేశారు.

అభిరామ రైతు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో గురువారం నూతనంగా అభిరామ రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు ఉత్పత్తి దారుల కేంద్రం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందనీ అన్నారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, అభిరామ రైతు డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

నిజామాబాద్ ఆర్ఏం శ్రీనివాస్

జహీరాబాద్ ఫిబ్రవరి 22 (జనం సాక్షి)

మండలంలోని మల్చేల్మా గ్రామంలో గల కెనరా బ్యాంక్ నూతన భవనాన్ని నిజామాబాద్ రీజనల్ హెడ్ బి శ్రీనివాస్ స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ పట్లోళ్ల అరవింద్ రావుతో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ మల్చేల్మా మేనేజర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ మేరుగైన నెట్ బ్యాంకింగ్ వ్యవస్థతో నూతన ఖాతాదారులను ఆకర్షించి ప్రజల అవసరాల నిమిత్తం అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని, గతంలో రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకొంటే వడ్డీ రాయితీ పొందవచ్చని అన్నారు. ఈ సందర్భంగా సంగరెడ్డి జిల్లా లిడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించినప్పుడే ప్రజలకు బ్యాంకింగ్ సౌకర్యాలపై నమ్మకం ఏర్పడుతుందని, ఆన్లైన్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డు వంటి సౌకర్యాలు కల్పించి అధిక శాతం మంది ఖాతాలు కలిగి ఉండేటట్టు చర్యలు తీసుకొంటమని, రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకున్నట్టయితే వడ్డీ రాయితీలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో శేకపూర్ ఎంపిటిసి శెట్టి నర్సింలు, సహకార బ్యాంక్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మల్చేల్మా మాజీ సర్పంచ్ పాండురంగ రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, కెనరా బ్యాంక్ క్లార్క్ మొహమ్మద్ తాజుద్దీన్, బ్యాంక్ క్యాషియర్ ప్రకాష్, శేకపూర్ సిఏ అబ్దుల్ మాజిద్, బిఆర్ఎస్ నాయకులు మొహమ్మద్ షౌకత్ అలీ, శహబుద్దిన్, మొహమ్మద్ అబ్దుల్ రావుఫ్, బ్యాంక్ ఖాతాదారులు, రైతులు, నాయకులు, వివిధ గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ స్తాయి అథ్లెటిక్స్‌లో పేట క్రీడాకారునికి బ్రౌంజ్ మెడల్

సన్మానించిన ఎమ్మెల్యే

నారాయణపేట. జిల్లా బ్యూరో(జనం సాక్షి):

గుజరాత్ రాష్టంలో జరిగిన జాతీయ స్తాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన(ట్రయాథ్లాన్ 60మి లాంగ్ జంప్ 6వందల మీ. పోటీలో అండర్ 14 బాలుర విభాగంలో బసంత్‌కు (మహాత్మా జ్యోతి రావు పూలె స్కూల్, ఈనాడు లక్ష అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ కి చెందిన క్రీడాకారుడు) బ్రౌంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా నారాయణపేట శాసన సభ్యులు చిట్టెం ఫర్ణిక రెడ్డి తన నివాసంలో శాలువా తో సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేశామని భవిష్యత్తులో క్రీడాకారులకు ఎలాంటి సహాయం కావాలన్న నేను ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణ, ప్రిన్సిపాల్ రాములు, కోచ్ జగదీష్, భరత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గద్దెలపై కొలువుదీరిన సమ్మక్కసారలమ్మ

తల్లు రాకతో గద్దెలవైపు ఎగబడిన జనం

నిర్విఘ్నంగా పూర్తయిన అమ్మవార్ల రాక

భక్త జనసంద్రంగా మారిన మేడారం

మేడారం ఫిబ్రవరి 22 (జనంసాక్షి):
మేడారం మహా జనసంద్రమైంది. తల్లుల కోసం నలుదిశల నుంచి పరుగుపరుగున తరలివచ్చిన బిడ్డలతో మహారణ్యం జనారణ్యమైంది. ఎటుచూసినా జనమే జనం. అమ్మగద్దెలను దర్శించుకోవాలని వస్తున్న జనం అంతా చీమల దండులా కనిపిస్తోంది. జంపన్నవాగులో జనం స్నానాలను ఆచరించి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. భక్తులు వేయికళ్లతో ఎదురు చూస్తున్న తరుణం ఆసన్నమైంది. మేడారంలో సమ్మక్క ఆగమన పూజలు ప్రారంభమయ్యాయి. చిలుకలగుట్ట నుంచి సమక్కను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు. కుంకుమభరణి రూపంలో ఉన్న సమ్మక్కను కోయ పూజారులు గద్దెపై ప్రతిష్టించడంతో ప్రధాన ఘట్టం ఆవిష్కృతం అయ్యింది. కాగా.. ఇప్పటికే సారమ్మను ఆదివాసీ పూజారులు కొమ్మ బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో తీసుకువచ్చి మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెలపై కొలువుదీరారు. చివరగా సమక్క రాకతో జాతరలో కీలక ఘట్టం మొదలయ్యింది. సమక్క గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడారం భక్తజనసంద్రంగా మారింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది. గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో పరుచుకున్నాయి. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు ఇప్పటికే చేరుకోగా.. సారలమ్మ రాకతో మేడారం దేవనగరిగా మారిపోయింది. కన్నెపల్లి కల్పవల్లి పాదస్పర్శతో మహాజాతర తొలిఘట్టం ప్రారంభమైంది. రెండేండ్ల ఎదురుచూపుల తర్వాత సమ్మక్కసారలమ్మ బుధవారం గద్దెలకు చేరుకోవడంతో మేడారం భక్తిపారవశ్యంతో ఊగిపోయింది. కన్నెపల్లి– మేడారం దారంతా భక్తజనం ప్రణమిల్లింది. జంపన్నవాగు జన సందోహంతో పరవళ్లు తొక్కింది. తల్లి సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి స్వాగతించేందుకు మేడారం ఒళ్లంత కండ్లు చేసుకొని పులకించింది. మేడారం మహా జాతరలో తొలి ఘట్టం బుధవారం నిర్విఘ్నంగా పరిపూర్ణమైంది.

కన్నెపల్లి నుంచి తరలివచ్చిన సారలమ్మ బుధవారం అర్ధరాత్రి గద్దెను అలంకరించింది. పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారలమ్మకు స్వాగతం పలికారు. సారలమ్మను కనులారా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే కన్నెపల్లికి భక్తజనం పోటెత్తింది. సారలమ్మను తోడ్కొని వచ్చే ప్రధాన వడ్డె (పూజారి) కాక సారయ్య సహా ఆయనను అనుసరించే ఇతర వడ్డెలు గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, మహారాష్ట్రలోని సిరోంచ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ, కోయ గిరిజనుల పూజా విన్యాసాలతో కన్నెపల్లి మార్మోగింది. పూజల తరువాత కన్నెపల్లి నుంచి 16 మంది ఆడబిడ్డలు సంప్రదాయం ప్రకారం డోలి విన్యాసాలతో తరలివచ్చి తల్లీబిడ్డలైన సమ్మక్క–సారలమ్మ కొలువుదీరే గద్దెలపై ముగ్గులు పెట్టి కంకవనానికి కంకణాలు కట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచే కన్నెపల్లి సారలమ్మ గుడి వద్ద డోలి విన్యాసాలు, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి పరిషత్, సారలమ్మ యువజన సంఘం బృందాల సారథ్యంలో కళా ప్రదర్శనలు కొనసాగాయి. అదే సమయంలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య సహా ఇతర పూజారులు సారలమ్మ గుడిలో వారి ఆచార సంప్రదాయాలను ఆచరించారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కన్నెపల్లి సారలమ్మ గుడి నుంచి మేడారంలోని గద్దెల వరకు తోడ్కోని బయల్దేరారు. కన్నెపల్లిలో ఇల్లిల్లూ తమ ఇంటి ఆడబిడ్డకు నీళ్లారగించి, చీరెసారె పెట్టి, కొబ్బరికాయలు కొడుతూ మంగళహారతులు పట్టారు. అక్కడినుంచి జంపన్న వాగుకు చేరుకోగా.. జంపన్న తన అక్క సారలమ్మ కాళ్లుకడిగి మేడారానికి సాగనంపారు. జంపన్నవాగు నుంచి బయల్దేరిన సారలమ్మ మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకోగా.. అక్కడ పగిడిద్దరాజు, గోవిందరాజుల వ్డడెలు ఘనస్వాగతం పలికారు. అక్కడ ముగ్గురు దేవతల ప్రతినిధులు వారి వారి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. సమ్మక్క కూడా చేరుకోవడంతో ఇక ప్రధాన ఘట్టంలో చివరి అంకం కూడా ముగిసింది. సమ్మక్క గద్దెకు చేరిందన్న వార్తతతో జాతర ప్రాంగణం నుంచి భక్తులు తండోపతండాలుగా పరుగులు తీశారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం అత్యంత నియమ నిష్ఠలతో పూజారులు అమ్మవార్లను గద్దెలపైకి చేర్చారు.

కన్నెపల్లి నుంచి మేడారానికి దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా దారికి ఇరువైపులా జనం పోటెత్తారు. శివాలూగె శివసత్తుల పూనకాలతో జాతర మార్మోగింది. ఎదురుకోళ్లు సమర్పిస్తూ, ఒడిబియ్యం చల్లుతూ, కొబ్బరికాయలు కొడుతూ జనం సమ్మక్కసారలమ్మకు నీరాజనం పలికారు. ఆదివాసీ సంప్రదాయ విన్యాసాలతో డోలి మోతలు, కొమ్ము బూరల నాదాలతో దద్దరిల్లాయి. మేడారం జాతరలో అత్యంత ఉద్విగ్నతకు లోనయ్యే ఘట్టం సమ్మక్క ఆగమనం. గురువారం చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లి రావడంతో భక్తుల మొక్కులు అందుకుంటున్నది. సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్టయ్య సమ్మక్క తల్లిని గద్దెలపై ప్రతిష్టించారు.

మేడారంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు

పరిసరాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ములుగు, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):
మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో గురువారం ఉదయం నుండి భక్తులు పోటెత్తారు. శ్రీ సమ్మక్కసారలమ్మ దేవతలు గద్దెకు వచ్చిన సందర్భంగా అమ్మవార్లకి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు యంత్రాంగం, దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసి గద్దెల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి హెడ్ హెల్మెట్లు సమకూర్చారు. గద్దెల వద్ద భక్తులు సమర్పించే బంగారాన్ని వెంట వెంటనే తరలిస్తూ అమ్మవారి గద్దెలను శానీటేషన్ సిబ్బందిచే శుభ్రపరుస్తూన్నారు. బక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో గ్దదెల ప్రాంగణంలో సింగరేణి రెస్కూ టీం, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, దేవాదాయశాఖ, శానిటేషన్ సిబ్బంది, మూడు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తూన్నారు. మధ్యాహ్నం కేంద్ర పర్యటకశాఖ మంత్రి కిషన్ రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసారు. మేడారం జాతర ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య వాచ్ టవర్‌పై నుండి అమ్మవారి గద్దెల వద్ద భక్తుల రద్దీని గమనిస్తూ వైర్‌లెస్ సెట్ల ద్వారా సంబంధిత సెక్టార్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ద్వారా జాతరలో నిరంతరం గమనిస్తూ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జాతర ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, వెంట ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్, అధికారులు ఉన్నారు. ఇదిలావుంటే అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి వస్తున్న కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను జిల్లా పాలన అధికారి ఇలా త్రిపాఠి సంబంధిత ధికారులతో కలిసి ఆయా ప్రదేశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా అమ్మవారి గద్దలు,తులాభారం,మీడియా పాయింట్ల వద్ద తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీస్,దేవాదాయ శాఖ,ప్రోటోకాల్ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవారి గద్దెల ముఖద్వారం వద్ద దివ్యాంగుల కోసం ప్రత్యేక ఎలక్ట్రిక్ మోటార్ బైకుల సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సమ్మక్క దేవతను గద్దెపైకి తీసుకు వచ్చిన పూజారులు

స్టేషన్ ఘన్పూర్ , ఫిబ్రవరి 22 , (జనంసాక్షి) :
మండలంలోని తాటికొండ, ఇప్పగూడెం గ్రామాలలో, చిల్పూర్ మండలంలోని ఫతేపూర్ గ్రామంలో వనదేవ తలైనటువంటి శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గద్దెల వద్ద కొబ్బరికాయలు కొట్టి అమ్మవార్లను దర్శిం చుకున్నారు.ఈసందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడు తూ శ్రీ సమ్మక్కసారలమ్మ తల్లులు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని కోరడం జరిగింద న్నారు. మూడురోజులు జరిగేపండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో,సంతోషంగాజరుపుకోవాలని కోరారు.ఈకార్య క్రమంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి,రాపోలు మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ గన్ను నరసింహులు, ఎంపీటీసీ బెల్లపు వెంక టస్వామి శ్రీనివాస్, సానాది రాజు, ఐలోని సుధాకర్, చాడ రాజకుమార్, బూరు నరేందర్, బానోతు రూప్లా నాయక్,పోకల నారాయణ,అంజిరెడ్డి, మల్లారెడ్డి, చల్ల నరసింహారెడ్డి,సంపత్ రెడ్డి, బొంగోని యాదగిరి,ఐలోని రాజు,దేశిని సతీష్,వేల్పులగట్టయ్య, ఆనందం, బాబు రావు, రాజిరెడ్డి, వెంకన్న, వీరస్వామి, రాజేందర్,రాజు రమేష్,తదితరులు పాల్గొన్నారు. జాతరల వద్దదుకాణాలు పెద్దఎత్తు న వెలిశాయి. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ సమ్మక్క సారలమ్మపండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ బాధ్యులు, ప్రజా ప్రతినిధులు,ఆయా శాఖల అధికారు లు, పోలీసులు, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి:జిల్లా కలెక్టర్

నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 22 జనంసాక్షి:
రాబోవు పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ పై ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రశాంత వాతావరంలో ఎన్నికల నిర్వహ ణకు రాజకీయ పార్టీలు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల కోసం 1564 బ్యాలెట్ యూనిట్లు, 1067 కంట్రోల్ యూనిట్లు, 1322 వీవీ ప్యాట్ ల మొదటి దశ తనిఖీలు నిర్వహించి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయడం జరిగిందని అన్నారు. జిల్లాకు అదనంగా కేటాయించబడిన ఈవిఎం తనిఖీలు ఈ నెల 26 నుండి ప్రారంభమవుతాయని, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. అలాగే తుది ఓటర్ల జాబితాను ఈ నెల 8 న ప్రచురిం చడం జరిగిందని, నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలలోని 922 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లుగా 379880 మహిళలు, 353786 పురుషులు, 51 ఇతరులు ఉన్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 పూరించి ఓటరుగా నమోదు చేసుకోవాలి అన్నారు. ఓటరు జాబితాను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నకిలీ, మరణించిన వంటి ఓటర్లను తొలగించడం జరుగు తుందని తెలిపారు. సమగ్ర ఓటరు జాబితాను రూపొందించేం దుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, ఎన్నికల విభాగం పర్య వేక్షకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జగన్ మోహన్, శ్రావణ్ రెడ్డి, రవి కుమార్, సయ్యద్ హైదర్, గంధ్రత్ రమేష్, సయ్యద్ మజార్, సిరికొండ రమేష్, నూతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజలందరూ చల్లగా ఉండాలి కోరుకున్న మంత్రి

భీమదేవరపల్లి ఫిబ్రవరి22 (జనంసాక్షి)
భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ కొత్తకొండ లో గురువారం తెలంగాణ రాష్ట్ర రవణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. సమ్మక్క సారలక్క అమ్మవార్లకి నిలువెత్తు బంగారం సమర్పించుకున్ని సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నారు. అనంతరం భక్తులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియా సమావేశంలో మాట్లాడుతూసమ్మక్క సారలమ్మ దీవెనలతో తెలంగాణ లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందిన్నారు. ప్రజా పాలన లో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. రాబోయే కాలంలో మంచి వర్షాలు పడి రైతులు అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మ వారి ఆశీస్సులు అందరి పై ఉండాలని అమ్మవార్లను కోరినట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడినటువంటి ప్రభుత్వం లో ఇచ్చినటువంటి హామీలు ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని అమలై ప్రజలందరికీ లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వానికి మార్గ దర్శనమిచ్చి ఆశీర్వదించాలని వేడుకున్నా.తెలంగాణ కుంభమేళ. సమానంగా జరిగే జాతర ఇది ఆదివాసుల జాతర తప్పకుండా ప్రభుత్వం జాతీయ ఉత్సవాలు జరపాలని కోరుతున్నాం ఎందుకో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆ అమ్మవారి ఆశీస్సులతోని భవిష్యత్తులో మా ప్రభుత్వం ఏర్పడితే వెంటనే జాతీయ ఉత్సవాలు జరిపిస్తామని ప్రకటిస్తున్నాం. ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ కమిటీ చైర్మన్ మాడుగుల వీరస్వామి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు చిదురల స్వరూప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు,ఆదరి రవీందర్, ఊసకోయిల ప్రకాష్, మాడుగుల గోపి, మంగ రామచందర్,మాజీ బొజ్జపురి అశోక్ ముఖర్జీ,మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, కోడూరి సరోజన,తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వీరేశం, ఎల్కతుర్తి సిఐ ప్రవీణ్ కుమార్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు,వంగర ఎస్సై నీలోజ్ వెంకటేశ్వర్లు, సమ్మయ్య,కమిటీ మెంబర్లు పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

గద్దెలవద్ద కంకణావనం ప్రతిష్ట

• భారీగా తరలివస్తున్న భక్తజనం • స్వాగత కార్యక్రమంలో మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):
మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కావడంతో భక్తులు పులకించి పోయారు. గద్దెల వద్దకు జనం భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. భక్తులు వేయికళ్లతో ఎదురుచూస్తున్న తరుణం ఆసన్నమైంది. మేడారంలో సమ్మక్క ఆగమన పూజలు ప్రారంభమయ్యాయి. గద్దెపై కంకవణాన్ని కోయపూజారులు ప్రతిష్టించారు. చిలకలగుట్ట నుంచి తెచ్చిన ప్రత్యేకజాతి వెదురు బొంగులే ఈ కంకవణాలు. చిలుక లగుట్ట నుంచి సమక్కను తీసుకువచ్చారు కుంకుమభరణి రూపంలో ఉన్న అమ్మవారిని కోయ పూజారులు మేడారంకు తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు. కాగా.. ఇప్పటికే సారమ్మలను ఆదివాసీ పూజారులు కొమ్మ బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో తీసుకువచ్చి మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెలపై కొలువుదీరారు. చివరగా సమక్క రాకతో జాతరలో కీలక ఘట్టం పూర్తయ్యింది. సమక్క గద్దెపైకి రాదంతో భక్తుల కోలాహలం కూడా పెరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మేడారం సమక్క – సారలమ్మ మహా జాతర కీలక ఘట్టానికి చేరిందని మంత్రి సీతక్క తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కోయ పూజారులు ఉపవాసం ఉండి పూజా కార్యక్రమాలు చేస్తారని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి చిలకలగుట్టలో పూజలు ప్రారంభమవుతా యన్నారు. సమ్మక్క వచ్చే ముందు జిల్లా ఎస్పీ శబరీష్ రెండు రౌండ్లు కాల్పులు జరిపి సమ్మక్కకు స్వాగతం పలుకుతారన్నారు. కంకవణాల మధ్య ఉండే సమ్మక్కకు ఆమె వచ్చే ముందు నీడ ఏర్పాటు కోసం కంకవణం స్థాపన చేస్తామని తెలిపారు. ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటున్నామన్నారు. తల్లులకు ఘనస్వాగతం పలుకుతామని ఘనంగా సాగనంపుతామని మంత్రి సీతక్క వెల్లడించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం మహా జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేస్తుండటంతో మేడారం భక్తజనసంద్రంగా మారింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గ్దదెలను భక్తులు దర్శించుకుంటున్నారు. ఇసుకేస్తే రాలనంతగా మేడారం ప్రాంగణం జనంతో నిండిపోయింది. గ్దదెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగి పోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో పరుచుకున్నాయి.

మేడారంలో వైద్య సేవలు సూపర్

- 1126 మంది సిబ్బంది..73 హెల్త్ క్యాంపులు
- 16 అంబులెన్స్ లు..40 బైక్ అంబులెన్స్
- అందుబాటులో అన్ని రకాల మెడిసిన్స్
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, డిఎంహెచో అప్పయ్య

వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):
మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో వైద్య సేవలు సూపర్ చెప్పుకోవచ్చు. సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో తాత్కాలిక హాస్పటల్ ఏర్పాటు చేశారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉత్సాహంగా పనిచేస్తున్నారు. అదేవిధంగా అత్యవసర వాహనమైన 108 తో పాటు బైకులపై కూడా అస్వస్థతకు గురైనటువంటి వాళ్లను వెంటనే హాస్పిటల్కు తరలించడంతోపాటు సరైన సమయంలో సరైన చికిత్స అందేలా చూస్తున్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు రోగుల పట్ల అప్రమత్తంగా ఉండడంతోపాటు వారికి ఎలాంటి ఇబ్బంది కలగకడా పాటు సరైన మందులను కూడా అందుబాటులో ఉంచుకొని ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా ఉచితంగా మాస్కులు పంపిణీ చేస్తున్నారు. లక్షలాదిమంది భక్తులు జాతరకు రావడంతో పాటు వివిధ ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని చీకట్లో ఉండడంవల్ల పాములు తేళ్లు సంచరించడం వాటి బారిన పడటం కూడా జరుగుతుంది. గుండె నొప్పితో బాధపడ్డ వారిని ప్రమాదాల్లో గాయపడ్డ వారిని ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారిని హుటాహుతిన హాస్పిటల్ కు తరలించి వారికి సరైన వైద్య సేవలు అందిస్తున్నారు. జాతరలో మొత్తం 1126 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ములుగు డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య తెలిపారు. అదేవిధంగా 73 హెల్త్ క్యాంపులు, 16 అంబులెన్సులు 40 బైక్ అంబులెన్సులను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య సేవలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటున్నట్లు వివరించారు.

అన్ని ఉద్యోగాల కంటే.. రైతు ఉద్యోగమే సంతృప్తి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తల్లాడ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి): దేశంలో అన్ని ఉద్యోగాల కంటే రైతు వ్యవసాయ ఉద్యోగమే సంతృప్తిగా ఉంటుందని రాష్ట్రవ్యవసాయ, సహకార శాఖ , మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. గురువారం తల్లాడ మండలం అన్నారుగూడెం రెవెన్యూ పరిధిలో చావా శ్రీనివాసరావు రైతులు సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన భద్రాద్రి కోల్డ్ స్టోరేజ్ ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టరాగమై, వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రామదాసు నాయక్ల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతులు కొత్త పంటలపై అవగాహన పెంచుకొని నూతన యాజమాన్య పద్ధతులు ద్వారా పంటలనుపండించి అభివృద్ధి చెందాలన్నారు. మనకున్న టెక్నాలజీ, మార్కెటింగ్ సౌకర్యాలు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ లు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు..గోదావరి నీళ్లతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను ససశ్యామలం చేయడమే తన ఆకాంక్ష అని వివరించారు. జగ్గయ్యపేట నుండి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఖమ్మం, దేవరపల్లి రహదారి ఈ సంవత్సరంలోనే పూర్తిఅతుందని, అదేవిధంగా నాగపూర్ అమరావతి, కొత్తగూడెం హైదరాబాద్ రహదారులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. సూర్యాపేట కోదాడ ప్రాంతాలలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి పాలేరు నియోజకవర్గంలో స్థల పరిశీలన చేస్తున్నట్లు వివరించారు. మన దేశంలో పామాయిల్ విత్తనం తయారు చేసే సంస్థ లేకపోవడంతో ఇండోనేషియా, మలేషియా నుండి విత్తన కొనుగోలు చేస్తున్నా సరైన సమయానికి అందుబాటులో ఉండటం లేదన్నారు. అందుకోసం అనే ఖమ్మం జిల్లాలో ప్రైవేట్ సంస్థ నిర్మిస్తున్న గాడ్రెజ్ కంపెనీ కి పామాయిల్ విత్తనం తయారు చేసే విధంగా కంపెనీ యాజమాన్యానికి సూచించినట్లు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాల వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారత రైతాంగానికి నష్టం లేకుండా కేంద్రం ఎగుమతులు దిగుమతులు పాలసీ పెట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. స్వామినాథన్ కమిషన్ అమలు చేసి అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా, పంజాబ్ రైతులు చేస్తున్న నిరసనలకు తెలంగాణ రైతాంగం సంఘీభావం తెలియజేయాలని కోరారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో రవి హైబ్రిడ్ సీడ్స్ విత్తన క్షేత్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంత్ రెడ్డి, అన్నారుగూడెం మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, భద్రాద్రి కోల్డ్ స్టోరేజ్ మేనేజ్మెంట్ చావా శ్రీనివాసరావు,పలు ప్రభుత్వ శాఖల ఆఫీసర్లు, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ చేరిన కార్పొరేటరు

ఖమ్మంటౌన్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షం లో కాంగ్రెస్ చేరిన కార్పొరేటర్లు,50 వ డివిజన్ రాపర్తి శరత్, 44 వ డివిజన్ పాలేపు విజయ-వెంకటరమణ ,39 డివిజన్ కార్పొరేటర్ మాదురి ప్రసాద్,23 వ డివిజన్ కార్పొరేటర్ నిరిష -అంజి రెడ్డి,20 వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వేంకటేశ్వర్లు .కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ లోకీ సాదరంగా ఆహ్వానించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డి సి సి ప్రెసిడెంట్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, జావేద్, సైది రెడ్డీ, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలి

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి

రెండవ రోజు కొనసాగిన సమ్మక్క సారలమ్మ జాతర

తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళ కోలాటాలా క్రీడలను ప్రారంభించిన మాజీ మంత్రి

ప్రత్యేక పూజలు నిర్వహించుకుని నిలువెత్తు బంగారాన్ని అందించిన మాజీ మంత్రి

పెన్ పహాడ్ ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గాజుల మల్కాపురం గ్రామ శివారులో కొండల మధ్య వెలసిన గిరిజనుల ఆరాధ్య వన దేవతలైన సమ్మక్క సారలమ్మ జాతర గురువారం రెండో రోజు కొనసాగింది .ఈ సందర్భంగా విచ్చేసిన మాజీమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించుకుని నిలువెత్తు బంగారాన్ని అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మంత్రికి ఘన సన్మానం నిర్వహించారు. అనంతరం తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళ కోలాట పోటీలను మాజీ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజించడం అనాదికాలం నుండి వస్తుందని ప్రతి ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతరను ఇంత ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకట్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ తూముల భుజంగరావు, మాజీ సర్పంచ్ బండి ధనమ్మ రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్ రావు, జిల్లా నాయకులు వేనారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మామిడి వెంకన్న గౌడ్బొల్లికొండ వీరస్వామి, బండి మధుసూదన్ రెడ్డి, బెల్లంకొండ శ్రీరాముల గుత్తికొండ రామ్ రెడ్డి, బండి రవీందర్ రెడ్డి, కుందూరి వెంకటరెడ్డి, ,తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతి ఒకరి పరిస్థితి విషమం

టేకులపల్లి,ఫిబ్రవరి 22 (జనంసాక్షి): టేకులపల్లి మండలంలోని ఆరో మైలు సమీపంలోని బొజ్జయిగూడెం సమ్మక్క – సారలమ్మ జాతరకు వెళుతున్న టేకులపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకు లు ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. టేకులపల్లి ఎస్సై సైదా రావూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెగళ్లపాడు పంచాయతీ లోని పడమటి గుంపుకు చెందిన ఇద్దరు యువకులు వాసం సాయి (26) మోకాళ్ళ భద్రం (30) ఇద్దరు ద్విచక్ర వాహనంపై బొజ్జాయిగూడెంలో ఉన్న సమ్మక్క సారలమ్మ దర్శనంకు వెళ్తున్న క్రమంలో ఎదురు అతివేగంగా వచ్చిన ఇసుక లారీ ఢీకొనడంతో మోకాళ్ళ భద్రం అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వాసం సాయికి రెండు కాళ్లు నుజ్జునుజ్జు కావడంతో 108 అంబులెన్సులో ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నట్లు ఎస్సై తెలిపారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదా రావూఫ్ తెలిపారు.

హామీలు అమలు చేయలేక చతికిల

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే

నల్గొండ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి): అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ నోటికొచ్చిన హామీలు ఇచ్చిందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చలేక చతికిల పడిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం నానా యాతన పడుతోంద ్నారు. వీటికి నిధులు ఎలా సమకూరుస్తారో.. ఎప్పటినుంచి అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. నకిరేకల్లో జరిగిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా కాటేపల్లి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పగిలిన డ్యాములు కట్టి, ఉద్యోగాలు ఇవ్వక నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు లాంటిదని.. కాంగ్రెస్ చిల్లుపడ్డ నోటు లాంటిదన్నారు. తెలంగాణలో బీజేపీ 11 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. 2028లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కాటేపల్లి జోస్యం చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ లో 11 ఎంపీ స్థానాలు గెలుచ ుకుంటామని అన్నారు. రాజకీయ నాయకుల మాటలు చూసి రొచ్చు డైలాగులు అని ప్రజలు అనుకుంటు న్నారని తెలిపారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పగిలిన డ్యాములు కట్టి, ఉద్యోగాలు ఇవ్వక నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏమీ లేదని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయలేకనే రాష్ట్రం అప్పులపాలు అయిందని చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు లాంటిదన్నారు. మోడీ ప్రవేశ ెపెట్టిన వికసిత భారత ద్వారా ఇతర దేశాల నుండిమనదేశానికి స్వదేశీయులు వస్తున్నారు.

సక్సెస్ కి సీక్రెట్ ప్రాక్టీస్.. ప్రాక్టీస్.. ప్రాక్టీస్..

- మహిళలు విద్యావంతులై ఆర్థికంగా,రాజకీయంగా ఎదగాలి
- నవభారత నిర్మాణంలో నవ సమాజానికి కొత్త ఊపిరి పోస్తున్నావారు నారీమణులే
- ప్రముఖ సైకాలజిస్ట్, ఫిజియోథెరపీ డాక్టర్ జబీన్ ఫాతిమా

దేవరకొండ ఫిబ్రవరి 22 జనంసాక్షి: బాలికలు,మహిళలు,ఆత్మవిశ్వాసంతో, ఏకాగ్రతతో,పట్టుదలతో చదివితే భవిష్యత్తు బంగారు మయం అవుతుందని, భయం వీడితే విజయం సొంతం అవుతుందని దేవరకొండ పట్టణంలోని ప్రముఖ సైకాలజిస్ట్, ఫిజియోథెరపీ డాక్టర్ జబీన్ ఫాతిమా తెలిపారు. బుధవారం జరిగిన బైట్ కంప్యూటర్స్ మరియు యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహిళల స్వయం ఉపాధి శిక్షణ కేంద్ర సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం ఉపాధి శిక్షణ పొందిన బాలికలు, మహిళలు దాదాపు 200 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జబీన్ మాట్లాడుతూ బాలికలు, మహిళలు,స్త్రీలు సమాజంలో ఉండే ప్రతి ఒక్కరూ ఎలా ఉండాలి ఒక ఉన్నతమైన ఆశయాల కోసం, లక్ష్యాల కోసం ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయాన్ని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దానికి అనుగుణంగా ప్రతిక్షణం పరితపిస్తూ ముందుకు సాగితే ఎలాంటి విజయాలైన కూడా సాధించ గలుగుతామని చెప్పారు. పనులు వాయిదా వేసి తత్వానికి స్వస్తి చెప్పాలని,ముందు చూపుతో ముందడుగు వేస్తూ భవిష్యత్తు కోసం కృషి చేయాలని,పని పట్ల అంకిత భావంతో క్రమబద్ధమైన అభ్యాసం నిరంతర కృషితో దేనికైనా సాధించగలరని తెలిపారు. ప్రతి ఒక్క స్త్రీ మీ పనిని భుజస్కంధాల మీద వేసుకొని కఠోరమైన శ్రమతో పని చేయాలని, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని అన్నారు. పెద్ద లక్ష్యాలను చిన్న చిన్నవిగా విడగొట్టలని,దీన్నే థింక్ బిగ్ స్టార్ట్ స్మాల్ అంటారని అన్నారు. సక్సెస్ కి సీక్రెట్ ప్రాక్టీస్ ప్రాక్టీస్ ప్రాక్టీస్ మాత్రమే అని, అందుచేతనే పెద్దలు సాధన చేయమురా సాధ్యము కానిది లేదురా అంటారని అన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు,మహా పురుషులవుతారు అన్న విషయాన్ని మర్చిపోవద్దని, నిరంతరం సాధన ద్వారా రాని పనిని పట్టుదలతో పట్టు సాధించవచ్చు అని అన్నారు. గతంలో సాధించిన విజయాలను మననం చేసుకోవాలని, పొరపాట్లు జరిగితే సరిదిద్దుకోవాలని,సరదాల పేరుతో, కబుర్ల పేరుతో సమయాన్ని వృధా చేయవద్దని అన్నారు. ఈ రోజుల్లో చెడు అలవాటు ఉన్న స్నేహాలకు అవసరమనుకుంటే స్వారీ అని చెప్పి వారికి పక్కకు పెట్టాలని,మంచి అలవాట్లు మీకు లేకపోతే నిపుణులైన లేదా సైకాలజిస్ట్ ద్వారా సలహాలు తీసుకొని ప్రతిరోజు కొద్ది కొద్దిగా సాధన చేయడం ద్వారా మంచి భవిష్యత్తుకు పునాది వేసుకున్న వారు అవుతారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ఖాజా ఖైరత్ అలీ మరియు బైట్ కంప్యూటర్స్ అధ్యక్షులు మొహమ్మద్ మహేమూద్ శిక్షణ కేంద్ర సిబ్బంది బీబీ ఫాతిమా, ఉమా, నాహీద్, శీర్స్, అయేషా, ప్రసన్న, రాంబాబు, నేనావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు సింగరేణి జిఎంకు ఏఐటీయూసి నాయకుల వినతి..

ఇల్లందు, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఏఐటియుసి నాయకులు సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ కు వినతి పత్రం అందజేశారు.ఈ గురువారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు(ఏఐటియుసి) ఇల్లందు ఏరియా వారు జే కే కాలనీ లోని సి.ఇ.అర్ క్లబ్ నందు ఉన్న జిమ్ లోని సమస్యలు, అదేవిధంగా క్లబ్ లో ఉన్నటువంటి కాంక్రీట్ షటిల్ కోర్టుకు బదులుగా సి.ఇ.ఆర్ క్లబ్ వెనుక భాగాన నూతన సింథటిక్ కోర్టును ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. దానికి గాను ఏరియా జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య, బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, జిఎం కార్యాలయ సహాయ పిటి కార్యదర్శి కిషోర్, యూనియన్ ప్రతినిధులు క్రీడాకారులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గెలిచిన విద్యార్థులకు గోల్డ్,సిల్వర్ మెడల్స్ అందజేత..

యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం ఫిబ్రవరి 22 (జనంసాక్షి): ఆదివారం రోజున కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన 4వ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ రుద్రమ దేవి సేల్ఫ్ డివెన్స్ వారు నిర్వహించిన పోటీలో బొమ్మల రామరం కస్తూరిబాగాంధీ బాలికలు 15 మంది పాల్గొనరు. అందులో 5గోల్డ్ మెడల్ మిగతా వారు సిల్వర్ మరియూ బ్రంజ్ మెడల్ సాదించరు. మెడల్స్ మరియు సర్టిఫికెట్లను కేజీబివి ఎస్ ఓ లక్ష్మి మేడం వారిని అభినందిచి మెడల్స్, సర్టిఫికెట్లను వారి చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కరుణాకర్ , తదితరులు పాల్గొన్నారు..

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

మోత్కూరు ఫిబ్రవరి 22 జనంసాక్షి : మోత్కూరు పురపాలక సంఘం పరిధిలో రోడ్డు వెడల్పు కార్యక్రమములో భాగముగా విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ కొరకు డిఎమ్ఎఫ్ టి ద్వారా మంజూరైన 45 లక్షల రూపాయల పోల్ శిఫ్టింగ్ పనులను తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్ చైర్మన్ బోల్లేపల్లి వెంకటయ్య, వార్డు కౌన్సిలర్స్,నాయకులు,ప్రజా ప్రతినిదులు ,కో ఆప్షన్ సభ్యులు, అర్ అండ్ బి ఎలక్ట్రికల్ వింగ్ డిఈ హనుమాన్, ఏఈఈ శ్రుతి పాల్గొన్నారు.

వైరా నదిలో అక్రమ ఇసుక తోలకాలతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

అక్రమ దందాకు పాల్పడుతున్న మాఫియా

యదేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ దందా

పగలు రాత్రి తేడా లేకుండా అక్రమతోలకాలు

ఒక్క కూపన్ తో పదుల ట్రిప్పులు తోలకాలు

ముగ్గురుపై కేసు నమోదు చేసిన ఎస్ఐ సంధ్య

మధిర ఆర్సి, ఫిబ్రవరి 22 (జనంసాక్షి): మధిర మండలంలో ప్రత్యేక్కించి మధిర పట్టణంలో ఇసుక మాఫియా దందా తిరిగి యదేచ్ఛ గా కొనసాగుతోంది. మధిర పట్టణానికి మండల పరిధిలోని ఇతర గ్రామాలకు సాగునీటిని తాగునీటిని అందించే వనరుగా ఉన్న వైరా ఏరులో అక్రమ ఇసుకతోలకాలతో నది గర్భం అడుగున్నర లోతు లో కూడా మట్టి పొరలతో కూడిన ఇసుకను కూడా అక్రమ రవాణా దారులు తరలిస్తుండడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభ దిశలోనే నదిలో నీటిజాలు కనిపించని పరిస్థితి నెలకొనడంతో రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఎదురయ్య పరిస్థితిలో కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం మండలాల వారీగా గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు ప్రారంభం కావడంతో ఇసుక తోలకాలకు డిమాండ్ పెరిగింది. కాగా భవన నిర్మాణాలకు అభివృద్ధి పనులకు పూర్తిగా పనికిరానిది గా మారిన ఇసుకను కూడా మాఫియా గ్యాంగ్ తరలిస్తుండడం గమనించాల్సిన అంశం. వైరా ఏటి పరివాహక ప్రాంతాలలో అనేక లిఫ్టులు చెక్ డ్యాములు ఇంటెక్వెల్ లు ఉండడం, తద్వారా సాగు తాగునీటిని పంపింగ్ చేసుకునేందుకు అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం గత ప్రభుత్వ కాలంలో వేలాది ట్రిప్పులు అక్రమంగా తోలకాలు చేపట్టిన క్రమంలో ప్రస్తుతం వైరానది పరివాహక ప్రాంతంలో కొన్ని కొన్ని గ్రామాల శివారుల లో మాత్రమే ఒక మోస్తారు ఉపయోగంగా ఉండే ఇసుక జాడలు కనిపిస్తున్నాయి.మధిర నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వ కాలంలో దళిత సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం అందించిన ట్రాక్టర్లను లీజుకు తీసుకొని కొంతమంది అక్రమ ఇసుకను యదేచ్ఛగా తరలించుకొని సొమ్ము చేసుకుంటున్న సంఘటనలు అనేకం. నిబంధనల మేరకు కాంట్రాక్టు పనులు కొనసాగుతున్న ప్రాంతానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వ ఆదేశాల మేరకు సూచించిన నిబంధనలు మేరకు కొంత సొమ్ము చెల్లించి కూపన్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ధ్రువీకరిస్తూ స్థానికంగా ఉన్న రెవెన్యూ యంత్రంగానికి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వీటన్నింటిని పక్కనపెట్టి నిబంధనలను ఉల్లంఘిస్తూ నామమాత్రంగా ఒకటి రెండు కూపన్లను కొనుగోలు చేస్తూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఉపయోగించి ఇసుకను తరలిస్తుండడం యదార్థ సాదృశ్యం.

అర్ధరాత్రి అక్రమ దందా:

కొద్ది నెలల క్రితం వరకు అధికారంలో ఉన్న ప్రభుత్వం లోని పలువురు ప్రజా ప్రతినిధుల అండదండలతో కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రభుత్వ ఖజానాకు గండికోడుతూ అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తోడుకొని వెళ్లి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకున్న సంఘటనలు అనేకం. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత స్తబ్దతగా ఉన్న ఇసుక మాఫియా ఇటీవల కొద్ది రోజులుగా పంజా విప్పి అడ్డు అదుపు లేకుండా దందాను కొనసాగిస్తుంది. పట్టణంలో,గ్రామాల్లో పలు ప్రాంతాల్లో సిసి రోడ్లు సిసి కెమెరాల సాక్షిగా కొనసాగుతున్న ఈ దందా అటు రెవెన్యూ అధికారులు ఇటు పోలీసు యంత్రంగానికి సవాలుగా మారింది.రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణాపై కొరడా జులిపించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ నియోజకవర్గ పరిధిలోని వైరా, కట్టలేరు, మున్నేరు నదుల నుండి ఇసుక అక్రమ తరలింపు కు మాత్రం తెరపడలేదంటే అతిశయోక్తి కాదేమో.ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ మధిర తో పాటు నియోజకవర్గ పరిధిలోని నదుల నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక మాఫియా పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటకుండా ఇసుక తరలింపు కు అవసరమైన సమగ్ర చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ ఇసుక పై ఉక్కు పాదం:

అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చట్ట పరిధిలో కఠినమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పట్టణ ఎస్సై సంధ్య తెలిపారు. ఇప్పటికే రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ఒక ట్రాక్టర్ను అదుపులోకి తీసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. అదేవిధంగా అక్రమ ఇ సుకతోలకాలపై మైనింగ్, రెవిన్యూ, పంచాయతీరాజ్ శాఖలతో కలిసి సమన్వయంగా ఇసుక తరలింపు పై చట్ట పరిధిలో నిబంధనల కనుగుణంగా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఐకూ నుంచి నియో 9ప్రో

4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్

చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ ఐకూ నియో సిరీస్‌లో మరో ఫ్లాగ్‌షిప్ ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. ఐకూ నియో9ప్రో పేరుతో దీన్ని తీసుకొచ్చింది. 120వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు ఈ ఫోన్ సపోర్ట్ చేస్తుంది. ఔటాఫ్‌ది బాక్స్ ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్‌తో వస్తున్న ఈ ఫోన్‌కు.. మరో మూడు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ కూడా ఇస్తామని హామీ ఇస్తోంది.

మరి ఈ ఫోన్ ధరెంత? ఫీచర్లేంటి?

ఐకూ నియో 9 ప్రో 5జీ స్మార్ట్‌ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. బేసిక్ వేరియంట్ 8జీబీ+128జీబీ ధరను రూ.35,999గా కంపెనీ నిర్ణయించింది. 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.37,999గా పేర్కొంది. 12జీబీ+256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.39,999గా నిర్ణయించింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై కొనుగోలు చేస్తే రూ.2వేల వరకు డిస్కౌంట్ పొందొచ్చు. నలుపు, ఎరుపు రంగుల్లో లభిస్తుంది. బేస్ వేరియంట్ మినహా మిగిలిన రెండు వేరియంట్లు అమెజాన్, ఐకూ ఇ-స్టోర్లలో ఫిబ్రవరి 23 నుంచి అమ్మకానికి రానున్నాయి. ప్రీ బుక్ చేసుకున్న వారు 22 మధ్యాహ్నం నుంచే కొనుగోలు చేయొచ్చు. బేస్ వేరియంట్ మార్చి 21న అందుబాటులోకి రానుంది. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులో 6.78 అంగుళాల 1.5 ఎల్‌టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120 రిఫ్రెష్ రేటు ఉంటుంది. గేమింగ్ సమయంలో 144 రిఫ్రెష్‌రేటుతో పనిచేస్తుంది. కొత్తగా వెట్ టచ్ టెక్నాలజీని ఇందులో పరిచయం చేశారు. దీనివల్ల తడిచేత్తో ఫోన్‌ను ఆపరేట్ చేసినా డిస్‌ప్లే పనిచేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 8 జనరేషన్ 2 చిప్‌సెట్‌తో వస్తోంది. ఇందులో వెనుక 50ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 920 సెన్సర్ ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. ముందువైపు 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. 5,160 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 120 సూపర్‌వూక్ ఛార్జింగ్ సదుపాయం ఇచ్చారు.

అనంత్- రాధిక ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌కు బిల్‌గేట్స్, జుకర్ బర్గ్

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, నీతా అంబానీ దంపతుల చిన్న కుమారుడు అనంత్ త్వరలో ఓ ఇంటివారు కాబోతున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త వీరేన్ మర్చంట్ కుమార్తె రాధికా మర్చంట్‌ను వివాహమాడనున్నారు. 2022 డిసెంబర్‌లోనే వీరికి నిశ్చితార్థం జరగ్గా.. ఈ ఏడాది జులైలో వీరు వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఈ పెళ్లి వేడుక కంటే ముందు గుజరాత్‌లోని జామ్‌నగర్ అతిపెద్ద ఈవెంట్‌కు వేదిక కానుంది. దీనికి వివిధ దేశాలకు చెందిన అపర కుబేరులు, వివిధ కంపెనీల సీఈఓలు, పలు దేశాల రాజకీయ ప్రముఖులు రానుండటంతో సందడి వాతావరణం నెలకోనుంది. మార్చి 1- 3 తేదీల మధ్య జామ్‌నగర్‌లోని రిలయన్స్ కాంప్లెక్స్‌లో అనంత్- రాధిక ప్రీవెడ్డింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌కు మెటా సీఈఓ మార్క్ జుకర్ బర్గ్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్ హాజరుకానున్నారు. వీరితో పాటు బ్లాక్‌రాక్ సీఈఓ ల్యారీ పింక్, బ్లాక్‌స్టోన్ ఛైర్మన్ స్టీఫెన్ స్వార్జ్‌మ్యాన్, డిస్నీ సీఈఓ బాబ్ ఐగర్, ఇవాంకా ట్రంప్, ఖతార్ ప్రధాని మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్‌థాని విచ్చేయనున్నారు. మోర్గాన్ స్టాన్లీ, బ్యాంక్ ఆఫ్ అమెరికా, బెర్క్‌షైర్ హాథ్‌వే వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో పాటు.. కెనడా, స్వీడన్, ఆస్ట్రేలియా, బొలీవియా దేశాల మాజీ ప్రధానులు, భూటాన్ రాజు, రాణి తదితరులు ఈ వేడుకకు హాజరుకానున్నారు.

బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌పై ఈడీ లుకౌట్ నోటీసులు

దిల్లీ జనం సాక్షి:

ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌కు కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లుకౌట్ నోటీసులు జారీ చేసింది. దేశం విడిచి వెళ్లకుండా చూడాలని సంబంధిత వర్గాలను ఆదేశించింది. గత ఏడాది బెంగళూరులో రెండు కార్యాలయాలతో పాటు ఆయన నివాసంలో సోదాలు జరిపింది. ఇప్పటికే రవీంద్రన్‌పై 'ఆన్ ఇంటిమేషన్ లుకౌట్ సర్క్యులర్' అమల్లో ఉంది. అంటే విదేశాలకు వెళ్లినప్పుడు ఇమ్మిగ్రేషన్ అధికారులు ఈడీకి ముందుగానే సమాచారం అందజేయాల్సి ఉంటుంది. తాజాగా పూర్తిస్థాయి లుకౌట్ సర్క్యులర్ జారీ అవడంతో ఇకపై దేశం విడిచి వెళ్లడానికి ఆస్కారం ఉండదు. బైజూస్ బ్రాండ్‌పై కార్యకలాపాలు నిర్వహిస్తున్న థింక్ అండ్ లెర్న్ తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ సంస్థ విలువ ఏడాది వ్యవధిలో రూ.1,82,600 కోట్ల నుంచి రూ.16,600 కోట్లకు పడిపోయినట్లు పలు ప్రముఖ ఆర్థిక సంస్థలు అంచనా చేశాయి. కొన్ని నెలలుగా నగదు లభ్యత సమస్యల్లో ఉన్న ఈ కంపెనీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు కూడా చెల్లించలేని స్థితిలో ఉంది. మరోవైపు రవీంద్రన్‌ను సీఈఓ పదవి నుంచి తొలగించేందుకు కొంత మంది వాటాదారులు అసాధారణ బోర్డు సమావేశానికి పిలుపునిచ్చారు. కొత్త బోర్డును ఎన్నుకోవాలని నిర్ణయించారు. అందుకోసం ఫిబ్రవరి 23న సమావేశం ఏర్పాటు చేయాలని కంపెనీని కోరారు. వాటాదారుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ బైజూస్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈజీఎం నిర్వహణకు అనుమతించింది. కానీ, అందులో తీసుకునే నిర్ణయాలను మాత్రం తదుపరి విచారణ వరకు అమలు చేయొద్దని ఆదేశించింది. బైజూస్‌లో ఇన్వెస్టర్లుగా ఉన్న ప్రోసస్, పీక్ ఎక్స్‌వీ, సోఫినా, లైట్‌స్పీడ్, జనరల్ అట్లాంటిక్ సంస్థలు ఈజీఎంకు పిలుపునిచ్చినట్లు సమాచారం.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు ఎప్పుడంటే?

రైతులకు పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం-కిసాన్ పథకం 16వ విడత నిధుల విడుదలకు తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 28న రూ.2వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధుల్ని విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని పీఎం కిసాన్ అధికారిక 'ఎక్స్' (ట్విటర్) ఖాతాలో వెల్లడించారు. పీఎం కిసాన్ నిధులు అందుకోవాలంటే అర్హులైన రైతులు ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాను కలిగిఉండాలి. అలాగే, ఇ-కేవైసీ చేసి ఉండాలి. ఒకవేళ పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన స్టేటస్ తెలుసుకోవాలన్నా, పీఎం కిసాన్ జాబితాలో మీ పేరు ఉందో, లేదో చూడాలన్నాలోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు. ఆయా వివరాలు పొందడానికి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్/ ఆధార్ నంబర్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. పీఎం కిసాన్ మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉంది. అలాగే, పీఎం కిసాన్‌కు సంబంధించిన ఏమైనా సందేహాలు ఉంటే 155261/011-24300606 హెల్ప్‌లైన్లను సంప్రదించొచ్చు.

ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు.. లాభాల్లో మార్కెట్ సూచీలు

ముంబయి జనం సాక్షి:

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాల మధ్య నష్టాల్లో ప్రారంభమైన సూచీలు ఆ తర్వాత కోలుకున్నాయి. టీసీఎస్, ఐటీసీ, రిలయన్స్ వంటి ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. కనిష్ఠాల నుంచి సెన్సెక్స్ 1100 పాయింట్లు పైకెగిసింది. సెన్సెక్స్ ఈ ఉదయం 72,677.51 వద్ద (క్రితం ముగింపు 72,623.09) ప్రారంభమై మెల్లగా నష్టాల్లోకి జారుకొంది. మధ్యాహ్నం 1 గంట వరకు నష్టాల్లో కొనసాగిన సూచీ.. కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్ ముగిసే సమయానికి భారీగా పుంజుకుంది. ఇంట్రాడేలో 73,256.39 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 535.15 పాయింట్ల లాభంతో 73,158.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 162.40 పాయింట్ల లాభంతో 22,217.45 వద్ద స్థిర పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 82.84గా ముగిసింది. సెన్సెక్స్-30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, ఐటీసీ, ఎంఅండ్‌ఎం, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ, మారుతీ సుజుకీ, విప్రో, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, ఇన్ఫీ, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహేంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

జీడీపీలో డిజిటల్ ఇన్‌ఫ్రా వాటా మూడింతలు

దిల్లీ జనం సాక్షి:

ఆధార్, యూపీఐ, ఫాస్టాగ్ లాంటి డిజిటల్ మౌలిక వసతులు (డీపీఐ) 2022లో 31.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.64 లక్షల కోట్ల) విలువను సృష్టించాయని, దేశ జీడీపీలో ఇది 0.9 శాతానికి సమానమని నాస్కామ్ తన నివేదికలో అంచనా వేసింది. 2030 కల్లా ఈ వాటా మూడింతలై జీడీపీలో 2.9-4.2 శాతానికి పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆఫ్ ఇండియా-యాక్సెలరేటింగ్ ఇండియాస్ డిజిటల్ ఇన్‌క్లూజన్' నివేదికలో నాస్కామ్ పేర్కొంది. ఆధార్, యూపీఐ, ఫాస్టాగ్ లాంటి డీపీఐలు 2022 నాటికే ఎక్కువ మందికి చేరువయ్యాయని.. వచ్చే 7-8 ఏళ్లలో మరింతమందికి ఇవి విస్తరించే అవకాశం ఉందని వివరించింది.

జాతీయం అంతర్జాతీయం

కొవిడ్ వేళ ప్రధాని మోదీ సాయపడ్డారు: వెల్లడించిన సీజేఐ

దిల్లీ జనం సాక్షి:

సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఆయూష్ హెూలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఆయూష్‌తో తనకున్న వ్యక్తిగత అనుభవాన్ని వెల్లడించారు. "కొవిడ్ వ్యాప్తి ప్రారంభమైన దగ్గరినుంచి ఆయూష్‌తో అనుబంధం మొదలైంది. ఆ సమయంలో ప్రధాని మోదీ ఫోన్ చేశారు. 'కొవిడ్ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుందనుకుంటున్నాను. ఆయూష్ మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఒక వైద్యుడు. ఒకసారి మీతో మాట్లాడమని చెప్తాను. మీకు అవసరమైన మందులు పంపుతారు' అని చెప్పారు. ఆయూష్ నుంచి వచ్చిన మందులు నేను తీసుకున్నాను. తర్వాత మళ్లీ కొవిడ్ బారినపడినా.. నేను ఎలాంటి అల్లోపతి మందులు వేసుకోలేదు" అని జస్టిస్ చంద్రచూడ్ వెల్లడించారు. న్యాయమూర్తులతో పాటు వారి కుటుంబాలు, సిబ్బంది అందరికీ సంపూర్ణ జీవనశైలి ముఖ్యమని ఈసందర్భంగా ఆయన వెల్లడించారు. "నేను సంవత్సరం క్రితం పంచకర్మ (కేరళ ఆయుర్వేద విధానం) చేయించుకున్నాను. మరోసారి చేయించుకోవాలనుకుంటున్నాను. సుప్రీంలో న్యాయమూర్తులతో సహా 2వేల మంది సిబ్బంది ఉన్నారు. వారంతా రోజువారీ పనిలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వారితో పాటు వారి కుటుంబాలు సంపూర్ణ జీవనశైలిని అనుసరించడం ముఖ్యమని భావిస్తున్నాను. వీరి ద్వారా దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు ఈ సందేశాన్ని ప్రచారం చేయొచ్చు" అని అన్నారు. ఈసందర్భంగా వైద్యులు, ఆయూష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హెూమియోపతి వంటి వైద్య పద్ధతుల సమాహారంగా మంత్రిత్వ శాఖకు ఆయూష్ పేరు పెట్టారు. దీనిని కేంద్రం 2014లో ఏర్పాటుచేసింది.

సందేశ్‌ఖాలీ బాధిత మహిళలతో ప్రధాని మోదీ భేటీ..!

కోల్‌కతా జనం సాక్షి:

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ ఘటనలో బాధిత మహిళలను ప్రధాని మోదీ కలుసుకోనున్నట్లు తెలుస్తోంది. మార్చి 6న బరాసత్‌లో భాజపా మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగే ర్యాలీలో మోదీ పాల్గొంటారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ సుకాంత మజుందార్ తెలిపారు. ఒకవేళ సందేశ్‌ఖాలీలోని మాతృమూర్తులు, సోదరీమణులు ప్రధానిని కలవాలనుకుంటే అందుకు ఏర్పాటు చేస్తామన్నారు. గత కొద్దిరోజులుగా పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఈ ఉదంతం తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై ప్రతిపక్షాలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఈ ఘటన గురించి సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ.. భాజపా నిరసనకారులను రెచ్చగొడుతోందని వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ ఘటనను కలకత్తా హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ షేక్, అతడి అనుచరులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, భూములు ఆక్రమించారని స్థానిక మహిళలు ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ

నిరసన చేపట్టారు. బాధిత మహిళలకు మద్దతుగా భాజపా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో హింస చెలరేగడంతో ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు. అనంతరం బాధితులను కలిసేందుకు వెళ్తుండగా చోటుచేసుకున్న ఘర్షణల్లో భాజపా ఎంపీ సుకాంత మజుందార్ గాయపడ్డారు. దీంతో ఆయన లోక్‌సభ సచివాలయానికి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా దర్యాప్తు చేపట్టిన లోక్‌సభ సెక్రటేరియట్ ప్రివిలేజెస్ కమిటీ.. పశ్చిమబెంగాల్ ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. దీనిపై రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై దర్యాప్తు చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలంటూ లోక్‌సభ సెక్రటేరియట్, భాజపా ఎంపీ సుకాంత, కేంద్ర హెూంశాఖకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఈ హింసలో ప్రధాన నిందితుడు, పరారీలో ఉన్న షాజహాన్ షేక్‌ను పోలీసులు ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం విస్మయం కలిగిస్తోందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడిని రక్షిస్తున్నారా లేదా అన్న విషయం తెలియదు కానీ, అతడిని మాత్రం ఇంతవరకు అదుపులోకి తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తుచేసింది.

ఇలాగైతే భారత్ ఎలా పురోగమిస్తుంది?

గుజరాత్‌లో స్కూళ్లపై కేజ్రీవాల్ ట్వీట్

దిల్లీ జనం సాక్షి:

గుజరాత్‌లో 341 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒకే తరగతి గదితో నడుస్తున్నట్లు ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కేబుర్ దిండోర్ అసెంబ్లీలో మంగళవారం ఇచ్చిన సమాచారం చర్చనీయాంశంగా మారింది. దీంతో అక్కడి పాఠశాలల పరిస్థితిపై దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా అధికారంలో కొనసాగుతున్నా ఇంకా ఒక్కో గదిలోనే 341 స్కూళ్లు నడుస్తున్నాయంటే గుజరాత్ ప్రభుత్వానికి ఇంతకన్నా అవమానం మరొకటి ఉండదన్నారు. ఇలాగైతే భారతదేశం ఎలా పురోగమిస్తుందని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ప్రశ్నించారు. దిల్లీలో తమ ప్రభుత్వం బడ్జెట్‌లో 25శాతం నిధుల్ని విద్యపైనే ఖర్చు చేస్తోందని.. తమ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు నీట్, జేఈఈ, ఎన్‌డీఏ వంటి పరీక్షల్లో విజయం సాధిస్తున్నారని కేజ్రీవాల్ తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తేనే పిల్లలు చదువుకుని, అభివృద్ధి చెంది దేశాన్ని ముందుకుతీసుకెళ్తారని పేర్కొన్నారు. ఈ పనిని తాము దిల్లీలో చేస్తున్నామని.. పంజాబ్‌లో కూడా ప్రారంభించామన్నారు. దేశంలో తమకు ఎక్కడ అవకాశం వచ్చినా ఇలాగే చేస్తామని.. దేశాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కిరీట్ పటేల్ అడిగిన ఓ ప్రశ్నకు

మంత్రి కుబేర్ దిండోర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అందులో 2023 డిసెంబర్ నాటికి 341 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒకే తరగతి గదితో నడుస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, విద్యా విభాగంలో 1,400 ఉన్నతస్థాయి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను కూల్చివేయడం, విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడం, కొత్త తరగతి గదులు నిర్మించేందుకు స్థలం లేకపోవడం వంటి కారణాలతో కొన్ని పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొందని కుబేర్ దిండోర్ వివరించారు. ఆయా స్కూళ్లలో కొత్త తరగతి గదులను వీలైనంత వేగంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

'గుల్‌మార్గ్'లో మంచు బీభత్సం..!

విదేశీయుడు మృతి, పలువురు గల్లంతు

శ్రీనగర్ జనం సాక్షి:

జమ్మూకశ్మీర్‌లోని ప్రముఖ పర్యటక కేంద్రం గుల్‌మార్గ్‌లో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో ఓ విదేశీ పర్యటకుడు మృతి చెందాడు. అతడిని రష్యా జాతీయుడిగా గుర్తించారు. మరికొందరు గల్లంతయినట్లు అధికారులు తెలిపారు. అయిదుగురిని కాపాడి, స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఆర్మీ, స్థానిక యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమైంది. దీనికోసం హెలికాప్టర్లను రంగంలోకి దించారు. స్థానికుల తోడు లేకుండానే.. విదేశీ పర్యటకులు కొంగ్‌దోరి వాలు ప్రాంతంలో స్కీయింగ్ వెళ్లినట్లు అధికారులు వెల్లడించారు. కొన్ని రోజులుగా కశ్మీర్‌ను మంచు కమ్మేసింది. హిమపాతం కారణంగా ఎత్తైన ప్రాంతాలతోపాటు లోయలూ మంచుతో నిండిపోతున్నాయి. దీంతో 'స్కీయింగ్'కు పేరుపొందిన గుల్‌మార్గ్‌కు పర్యటకులు వెల్లువెత్తారు. పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే ముప్పు ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేసిన వేళ ఈ ఘటన చోటుచేసుకుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 ఫిబ్రవరి 2024

సిద్దిపేట అగ్నిప్రమాదంపై దర్యాప్తు

- వేగంగా పునరుద్ధరణ చర్యలు
- యధావిధిగా విద్యుత్ సరఫరా
- ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి పొన్నం

సిద్దిపేట, ఫిబ్రవరి 22 (జనంసాక్షి): సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. రైతులకు ఇబ్బందిలేకుండా వ్యవసాయానికి ఉదయం నుంచి కరెంట్ ఇస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. దురదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. మూడు రోజుల వరకు కరెంట్ రాదనుకున్నాం ..కానీ వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ ఇచ్చామన్నారు. సిద్దిపేట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మంటలు భారీగా ఎగసి పడుతుండటంతో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం కారణంగా సిద్దిపేట పట్టణంతోపాటు పరిసర మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లకు కూడా మంటలు వ్యాపించడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు హైదరాబాద్ నుంచి ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదస్థలిని మంత్రి పొన్నం ప్రభాక్ సందర్శించారు. కారణాలు తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి త్వరగా పునరుద్ధరణ చేపట్టాలన్నారు. సిద్దిపేటలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. పీటీఆర్ పేలిపోవడం వల్లే సబ్ స్టేషన్‌లో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. మూడు అగ్నిమాపక యంత్రాలతో మంటలు ఆర్పామన్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు. జరిగిన ప్రమాదంపై విచారణకు ఆదేశించామని మంత్రి చెప్పారు. కాగా, సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రమాదంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు రేగాయి. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. విద్యుత్ ట్రిప్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే గతకొంతకాలంగా ప్రతిదానికి విమర్శలు చేస్తున్న బిఆర్ఎస్ తాజాగా ఈ ప్రమాదంపైనా విమర్శలకు దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సబ్ స్టేషన్ల నిర్వహణ కూడా సరిగా రావడం లేదని బీఆర్ఎస్ విమర్శిస్తే.. గత ప్రభుత్వంలో చేపట్టిన నాసి రకం పనుల వల్లే ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. ఈ ఘటనకు రాజకీయం రంగు పులుముకుంది. విద్యుత్ సరఫరా నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ప్లాప్ అయ్యిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శించాయి. కాంగ్రెస్ ను ఓడించిన సిద్ధిపేట ప్రజలను చీకట్లో మగ్గపెట్టి ఆ పార్టీ పగ తీర్చుకుంటోందంటూ హరీష్ రావు విమర్శలు గుప్పిస్తున్నారు.

సిద్దిపేట పట్టణంతోపాటు 5 మండలలాకు సరఫరా నిలిచిపోయిందంటూ మండిపడుతున్నారు. దాదాపు మూడు గంటల పాటు సబ్ స్టేషన్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. అక్కడి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి మాట్లాడిన హరీశ్ రావు తక్షణం హైదరాబాద్ నుంచి విచారణ బృందాలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు సిద్ధిపేటకు చేరుకున్న తర్వాత వాళ్లతో మాట్లాడిన హరీశ్ రావు ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తక్షణం విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే అగ్ని ప్రమాదాలు అనుకోకుండా సంభవిస్తాయని వీటికి ఎవరూ కారకులు కారని కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగింది. సబ్ స్టేషన్ లో అగ్నిప్రమాదానికి కాంగ్రెస్ పార్టీకి సంబంధం ఏంటని వారు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల విమర్శలను తిప్పికొట్టిన కాంగ్రెస్...రెండు నెలల క్రితం వరకు మీ పార్టీయే అధికారంలో ఉందని వారు ఎందుకు నిర్వహణ పట్టించుకోలేదని మండిపడింది. అగ్నిప్రమాదం జరిగిన ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ఇలాంటి చౌకబారు విమర్శలు ఏంటని మండిపడింది.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 (జనంసాక్షి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) మీడియా డైరీ-2024 తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీలో పొందుపరిచిన సమాచారం జర్నలిస్టులకే కాకుండా ప్రభుత్వ అధికారులకు సైతం ఎంతో ఉపయోగకరంగా వుందంటూ టీయూడబ్ల్యూజే ఐజెయును అభినందించారు. విలేఖర్లతో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. నా రాజకీయ ఎదుగుదలలో వారి పాత్ర గణనీయంగా ఉందన్నారు. రాజన్న జిల్లాలో విలేకరులకు రావలసిన ఇంటి స్థలాలు తదితర అంశాలపై నా వంతు కృషి చేస్తానన్నారు.ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లకుండా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత మీడియాపై ఉంటుందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే ఐజేయూ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి దేవేందర్, జిల్లా కార్యదర్శి ముత్యం, కోశాధికారి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు తడక శ్రీనివాస్, వేములవాడ ప్రెస్ క్లబ్ ఫౌండర్ రేగుల దేవేందర్, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్,దాదుల నివారణ కమిటీ కన్వీనర్ కొక్కుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి తుపుకారి శ్రీనివాస్, సూర్యకిరణ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కొత్త హరి,జిల్లా కమిటీ సభ్యులు గొంగల్ల రవికుమార్, శ్రీరాముల శ్రీధర్, మంగళగిరి శ్రీనివాస్, వేములవాడ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ప్రశాంత్, జాయింట్ సెక్రటరీ దూలం సంపత్, కోశాధికారి మధిరాల నరేష్, కార్యవర్గ సభ్యులు మ్యాన శ్రీనివాస్, గుడిసె కిషన్, ఉల్లందుల మల్లేశం, హబీబ్ పాషా,చందుర్తి ,కోనరావుపేట, రుద్రంగి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, దేవారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

తక్కలపల్లి,వేమునూర్ సమ్మక్క సారలమ్మ జాతరలో అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్..

గోదావరిఖని, ఫిబ్రవరి 22, (జనంసాక్షి): వనదేవతల పూజా కార్యక్రమాల్లో మొక్కులు చెల్లించుకుని భక్తులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. వేమునూర్ , తక్కలపల్లి లో గల లిసమ్మక్క సారలమ్మ వనదేవతల జాతరలి సందర్భంగా గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకు న్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కుంభమేళా లాగా జరిగే వనదేవతల జాతర నిజంగా చాలా ఆధ్యాత్మికమైన జాతర అని సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడం అంటే ప్రకృతి మాత ఆశీర్వచనాలు తీసుకోవడం లాంటిదని సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు, కమిటీ వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నానని భక్తులకు ఏవైనా ఆటంకాలు ఎదురైతే నా దృష్టికి తీసుకురండని అని, ఈ సంధర్భంగా తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ తో పాటు, పాలకుర్తి మండల అధ్యక్షులు , కార్పొరేటర్లు,జాతర కమిటీ చైర్మన్ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు మరియు ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ విభాగాల అధ్యక్షులు, పలువురు ముఖ్యనాయకులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు నియమిస్తున్న వివిధ బృందాలు విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి తమ కర్తవ్యాలను సమర్థవంతంగా నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఏం.సి.సి., ఎంసిఎంసి , సి-విజిల్, సువిధ, కంట్రోల్ రూమ్ కాల్ సెంటర్ సిబ్బంది, తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత శాసన సభ ఎన్నికలలో నియమించిన సిబంది విధులు సమర్థవంతగా నిర్వహించారని ప్రశంసిస్తూ, ఈ పార్లమెంటు ఎన్నికలలో మరింత అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి పొరపాట్లకు, తావివ్వకుండా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరగకుండా అంకిత భావంతో షిఫ్ట్ ప్రకారం పనిచేయాలని కోరారు. ముఖ్యంగా సి విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులంకు స్పందిస్తూ ఆ ప్రాంత ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలకు, పోలీసులకు, ఎంసిసి నోడల్ అధికారికి సమాచారమందించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ డబ్బు, మద్యం, కానుకల పంపిణి, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న, వాహనాలు తిరుగుతున్నట్లు సమాచారం వచ్చిన వెంటనే క్షేత్ర స్థాయి అధికారులకు సమాచారమందించి అప్రమత్తం చేస్తూ టి.వి. కూడా వాచ్ చేయాలని,తీసుకున్న చర్య,లపై ఆన్ లైన్ వివరాలు నమోదు చేయాలన్నారు అదేవిధంగా కాల్ సెంటర్ ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ కు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహిస్తూ ఏ అంశానికి ఫిర్యాదు చేస్తున్నారు,? సమాచార మదుగుతున్నారో విడివిడిగా రికార్డు చేయాలన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలపై అవగాహన కలిగి ఉండాలని, సి- విజల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్దారిత సమయంలో పరిష్కరించే సమయంలో ముందస్తుగా ఆధారాలు సేకరించాలన్నారు.సీజ్ చేసిన డబ్బు, వస్తువులను ఇ ఎస్ ఎమ్ ఎస్ యాప్ లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరి ఉండాలని సూచించారు.ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, కోడ్ అమలులోకి వచ్చిన 24, 48, 72 గంటలలో చేసే విధుల పట్ల పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తే ఎన్నికలలో దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని అన్నారు.ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలలో ముందస్తు అనుమతులు లేకుండా వస్తున్న ప్రకటనలు, పెయిడ్ న్యూస్, కరపత్రాల ముద్రణ పై దృష్టిసారించాలన్నారు.మీడియా అంశాలపై భారత ఎన్నికల కమీషన్ ప్రత్యేకంగా మార్గనిర్దేశాలను రూపొందిన్చాన్నారు. త్వరలో బృందాలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకులు జ్యోతి,అనిల్ కుమార్, వివిధ బృందాల సిబంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- విస్తృతంగా అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వయోజనులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో స్వీప్ కార్యక్రమం లో భాగంగా మెంటర్స్ అండ్ క్యాంపస్ అంబాసిడర్లకు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలల్లో తోటి విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. ఓటు హక్కు నమోదు, వినియోగంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తరపున సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఈ సర్టిఫికెట్లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి ఓటరు స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారని ఇది దురదృష్టకరమని తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు చూడాలని సూచించారు. యువతతోనే సమాజంలో మార్పు వస్తుందని అన్ని అంశాల్లో ప్రజలను చైతన్య వంతులను చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత, వివిధ అంశాలపై పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు మాట్లాడారు. క్విజ్ పోటీలతోపాటు పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి రవీందర్, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, ఎన్ వై కే కోఆర్డినేటర్ రాంబాబు వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఘనంగా సమ్మక్క సారక్క జాతర ఉత్సవాలు

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద జాతరగా సమ్మక్క సారక్క జాతర ఖ్యాతి పొందినదని కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్ట్ మైదానంలో జాతరను తలపించే విధంగా ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ సమ్మక్క సారక్క మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ప్రారంభానికి ముందు వారు సమ్మక్క సారక్క చిత్రపటానికి పూజ కార్యాక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఈ జాతర మహోత్సవానికి ప్రత్యేకత ఏర్పడినదని ప్రపంచ దృష్టి ఆకర్శించే విధంగా వేడుకలను చాలా గొప్పగా పూజా విధానాలను పాటిస్తూ జాతరను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ నిర్వహిస్తున్నారని సమ్మక్క సారలమ్మలను వనదేవతలుగా పిలువడం జరుగుతుందని ముఖ్యంగా గిరిజన దేవతలుగా పరిగణించడం జరుగుతున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ఘట్టమైన సమ్మక్క సారక్క రాకను చాలా వైభవోపేతంగా గిరిజన సాంప్రదాయ పూజల నడుమ ప్రభుత్వ లాంఛనాలతో వనంనుంచి గద్దెమీదికి తీసుకురావడం జరుగుతుందని మూడు రోజుల పాటు చాలా గొప్పగా తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రలైన ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా ఇలా వివిధ రాష్ట్రాలనుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. అమ్మవార్లకు అత్యంత ప్రీతి పాత్రమైన బంగారంగా పిలువబడే బెల్లం నైవేద్యాన్ని సమర్పించి ఆశీస్సులను పొందుతారని ఒక గొప్ప ఆనవాయితిగా వస్తున్నదని తెలిపారు. విద్యార్థులను సమ్మక్క సారక్క వృత్తాంతాన్ని ఆకర్శనీయ పద్దతిలో సాంప్రదాయంగా తెలంగాణ ఆడబిడ్డలుగ వారి ఆశీస్సులు ఏకపూర్వగ ఉండడానికి స్పదల పెంపుదలకై ఆయురారోగ్యాలతో పరిరక్షణకై గోవిందరాజులు, పడిగిద్ద రాజు అవలంబించే విధానాలను తెలియజేయడానికై కార్యాక్రమాన్ని చాలా గొప్పగా నిర్వహించడం జరిగినదని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సమ్మక్క సారక్క నీవే మా దైవం - నీవే మా రక్ష వచ్చావమ్మ సమ్మక్క - వచ్చావమ్మ సారక్క తదితర నృత్యాలు ప్రత్యేక ఆకర్శనగా నిలిచాయి. కోయ దొర వేశంలో విచ్చేసిన విద్యార్థి విభజించిన సమ్మక్క సారక్క మహోత్సవం ప్రత్యేక ఆకర్శనగా నిలిచినవి, సుమారు 300 మంది విద్యార్థులు వివిధ సాంప్రదాయ దుస్తులలో విచ్చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 (జనంసాక్షి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులకు సూచించారు. ఈ నెల 28 నుండి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 12 గంటల వరకు కొనసాగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించి ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలును పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటె తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 19,509 మంది పరీక్షలు వ్రాయనున్నారని, ఇందుకోసం 37 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.సి.సి.కేమేరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్, దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. అధికారులకు ఇచ్చిన బుక్ లెట్ లోని మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు నిర్దారిత సమయంలో ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు, అందించాలని, వాటిపై విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్ సరిగ్గా వేసేలా ఇన్విజిలేటర్ సంతకం చేసేలా చూడాలన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని,ఉదయం 9.00 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమత్గించవద్దని స్పష్టం చేశారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరీక్షా కేంద్రాలలో అనుమతించబడవని అన్నారు.సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయన్నారు.జవాబుపత్రాలను క్లోస్డ్ కంటైనెర్ లో తరలించేలా చూడాలని తపాలా శాఖకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలనీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు, చీఫ్ సూపెరింటెండెంట్లు, శాఖాపర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం ఎంతో లాభదాయకం : జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 (జనంసాక్షి): చేపల పెంపకం ఎంతో లాభదాయకమని ఆ దిశగా సన్నచిన్నకారు రైతులను, మహిళా సంఘాలను ప్రోత్సహించవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కొర్ర మీను చేపలకు మార్కెట్ లో ఎంతో డిమాండ్ ఉందని, వ్యవసాయ క్షేత్రంలో కొంత స్థలంలో ట్యాంక్, పాంపడ్ ఏర్పాటు చేసుకోవడం బీద్వారా అటు వ్యవసాయంతో పాటు ఇటు కొర్రమీను చేపల పెంపకం చేపట్టి ఏడాదిలో మూడు సార్లు ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని అన్నారు. వీటి నిర్మాణానికి నాబార్డ్ 5 లక్షల రూపాయల ఖర్చవుతుందని అంచనా వేసిందని, పరిశ్రమల శాఖ సహకారంతో పి.ఏం.ఈ.జి.పి . క్రింద ట్యాంక్, పాంపడ్ ల నిర్మాణానికి 35 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఉదయం ఆక్వా కల్చర్ ఏజెన్సీ వీటి నిర్మాణాలు గావించడంతో పాటు అవసరమైన శిక్షణ, సాంకేతిక సలహాలు, సూచనలిస్తుందని కలెక్టర్ తెలిపారు. 8 మాసాలలో చేతికి వచ్చేపంటకు మొదటగా ట్యాంక్ లో వేయి చేప పిల్లలను విడిచి దాణ పెడుతూ రెండు రోజులకోమారు నీటిని ఖాలీచేస్తుండాలని,ఇలా నాలుగు మాసాల అనంతరం చేప పిల్లలను తిరిగి పాంపడ్ లో వదిలి మరో నాలుగు నెలల తరువాత వాటిని విక్రయిస్తే మంచి లాభాలొస్తాయని అన్నారు. ఇలా ఏడాదిలో మూడు పర్యాయాలు చేప పిల్లల పెంపకం చేపట్టవచ్చని, అట్టి నీటిని వ్యవసాయ క్షేత్రానికి తరలించడం ద్వారా రసాయనిక ఎరువులు వేసే అవసరం కూడా ఉండదని అన్నారు. జిల్లాలో 16,957 మహిళా సంఘాలలో 1,75,670 మంది సభ్యులున్నారని, చేపల పెంపకానికి ముందుకొచ్చిన 656 ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి 63 యూనిట్లు గ్రౌండ్ చేశామన్నారు. జిల్లాలో వేయి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యమని, ఆ దిశగా మహిళా సంఘ సభ్యులను ప్రోత్సహించవలసినదిగా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో నాబార్డు సహాయ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, డిపిఎం రమేష్ బాబు, జిల్లా మత్స్య శాఖాధికారి వరదా రెడ్డి, ఆక్వా కల్చర్ సాంకేతిక సలహాదారు , ఎపిఎం లు, సి.సి. లు, మహిళా సమాఖ్య సభ్యులు, మత్స్య సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే కారణం

- ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పేలవ ప్రదర్శనపై సంచలన వ్యాఖ్యలు : పాక్ క్రికెట్ బోర్డు మాజీ డైరెక్టర్

భారత్‌లో గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ దారుణ వైఫల్యంపై పాక్ క్రికెట్ బోర్డు మాజీ డైరెక్టర్ ముహమ్మద్ హఫీజ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజం, విదేశీ కోచ్‌లు మిక్కీ అర్థర్, గ్రాంట్ బ్రాడ్‌బర్న్ ఫిట్‌నెస్ గురించి అస్సలు పట్టించుకోలేదని, దానికి అసలు వారు ప్రాధాన్యమే ఇవ్వలేదని ఆరోపించాడు. ప్రపంచకప్ లీగ్ దశలో 9 మ్యాచుల్లో ఐదింటిలో ఓడిన పాక్ నాకౌట్ దశలోనే నిష్క్రమించింది. ప్రపంచకప్‌లో దారుణ ప్రదర్శన తర్వాత 2023 చివర్లో హఫీజ్ టీం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. కాగా, ఇటీవల అతడి కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించేందుకు క్రికెట్ బోర్డు నిరాకరించింది.

హఫీజ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను పాక్ వైట్‌వాష్ చేసింది. అయితే, ఐదు మ్యాచ్‌లో టీ20 సిరీస్‌ను మాత్రం 1-4తో కోల్పోయింది. తాను జట్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై టీం ట్రైనర్‌ను నివేదిక కోరానని, ఫిట్‌నెస్ కోసం కొత్త నియమావళిని సిద్ధం చేయాలని కోరానని గుర్తు చేసుకున్నాడు.

దానికి ఆయన చెప్పిన సమాధానం విని షాకయ్యానని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఫిట్‌నెస్‌కు అంత ప్రాధాన్యం ఇవ్వక్కర్లేదని, ఆటగాళ్లు వాళ్లు కోరినట్టు ఆడితే చాలని ఆరు నెలల క్రితం బాబర్(అప్పటి కెప్టెన్), హెడ్ కోచ్ (అర్థర్) తనకు చెప్పారని ట్రైనర్ తనతో చెప్పినట్టు హఫీజ్ వెల్లడించాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌తో పనిలేదని ట్రైనర్ చెప్పడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నాడు. ఆ తర్వాత ఆటగాళ్ల బాడీ ఫ్యాట్ పర్సెంటేజ్‌ను చెక్ చేస్తే అది అంతర్జాతీయ క్రికెట్ ప్రమాణాలకు చాలా తక్కువగా వుందని చెప్పాడు.

మోడర్న్ క్రికెట్‌లో అన్ని జట్లు ఫిట్‌నెస్‌కే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని హఫీజ్ చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు కొందరు ఆటగాళ్లు రెండు కిలోమీటర్ల పరుగును కూడా పూర్తిచేయలేక పోయారని ఆరోపించాడు. ఆటగాళ్ల స్కిన్ ఫోల్డ్ (శరీరంలోని కొవ్వు శాతం) సాధారణంగా ఉండాల్సిన స్థాయికి మించి ఒకటిన్నర పాయింట్లు ఎక్కువ ఉందని వివరించాడు. హఫీజ్ పాల్గొన్న టీవీషోలోనే ఉన్న పాక్ మాజీ టెస్ట్ కెప్టెన్ అజర్ అలీ మాట్లాడుతూ 2017లో చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇంగ్లండ్ వెళ్లినప్పుడు ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పాడు. ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైన ఉమర్ అక్మల్‌ను స్వదేశానికి పంపినట్టు గుర్తు చేసుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఇండియాను ఓడించి పాక్ కప్పు గెలుచుకున్న సమయంలో అర్థర్ పాక్ హెడ్ కోచ్‌గా ఉన్నాడు. టీ20 క్రికెట్‌లో ఓపెనింగ్ స్లాట్‌ను వదిలిపెట్టి మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు దిగాలని బాబర్‌ను ఒప్పించేందుకు తనకు మూడు నెలల సమయం పట్టిందని హఫీజ్ చెప్పుకొచ్చాడు.

బీసీసీఐ.. అలర్ట్

- ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదిన ఆంధ్రా కుర్రాడు..
- కల్నల్ సీకేనాయుడు ట్రోఫీలో చెలరేగిన వంశీకృష్ణ
- కడపలో రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసం
- 64 బంతుల్లో 110 పరుగులు చేసిన వంశీకృష్ణ
- వీడియోను పంచుకున్న బీసీసీఐ

ఆట అన్నాక రికార్డులు సహజం. రికార్డులన్నాక బద్దలు కావడం కూడా సహజమే. అప్పుడెప్పుడో టీమిండియా మాజీ కెప్టెన్ రవిశాస్త్రి రంజీల్లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాది రికార్డు క్రియేట్ చేశాడు. 1985లో బాంబేకు ప్రాతినిధ్యం వహించిన రవి బరోడాతో జరిగిన మ్యాచ్‌లో ఆరు బంతులను స్టాండ్స్‌లోకి తరలించి ఆ ఘనత సాధించిన తొలి ఇండియన్‌గా రికార్డులకెక్కాడు. కొన్ని దశాబ్దాలపాటు అది భద్రంగా ఉంది. దానిని బద్దలుగొట్టడం అసాధ్యమని క్రికెట్ పండితులు నిర్ణయానికి వచ్చిన వేళ 2007 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ ఆటగాడు స్టువర్ట్ బ్రాడ్ బౌలింగులో యువరాజ్ సింగ్ ఆరు బంతులను స్టాండ్స్‌లోకి పంపి అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. 1968లో నాటింగ్‌హామ్‌షైర్ తరపున కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఆడిన విండీస్ లెజెండ్ గ్యారీ సోబర్స్ గ్లామోర్గాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మాల్కమ్ నాష్ బౌలింగులో ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో మాత్రం ఆ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా సౌతాఫ్రికా బ్యాటర్ హర్షలే గిబ్స్ పేరు రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. ఇప్పుడీ జాబితాలోకి తాజాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వంశీకృష్ణ వచ్చి చేరాడు.

అండర్-23 జాతీయ టోర్నీ అయిన కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో వంశీకృష్ణ ఈ ఘనత సాధించాడు. ఈ వీడియోను ఎక్స్‌లో షేర్ చేసిన బీసీసీఐ.. అలెర్ట్ అంటూ రాసుకొచ్చింది. కడపలో జరిగిన మ్యాచ్‌లో రైల్వేస్ స్పిన్నర్ దమన్‌దీప్ సింగ్ బౌలింగులో వంశీకృష్ణ ఆరు సిక్సర్లు బాదాడని పేర్కొంది. ఈ మ్యాచ్‌లో వంశీకృష్ణ 64 బంతుల్లోనే 110 పరుగులు చేసినట్టు పేర్కొంది.

ఐపీఎల్-2024 షమీ దూరం

- వరల్డ్ కప్‌లో బౌలింగ్‌తో అదరగొట్టిన షమీ
- ఎడమకాలి మడమ గాయంతో జట్టుకు దూరం
- త్వరలో శస్త్రచికిత్స కోసం బ్రిటన్ పయనం
- వచ్చే నెలలో ఐపీఎల్ తాజా సీజన్ ప్రారంభం

వరల్డ్ కప్ లో సంచలన బౌలింగ్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్న టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ ప్రస్తుతం గాయంతో సతమతమవుతున్నాడు. భారత్ లో జరిగిన వన్డే వరల్డ్ కప్ తర్వాత షమీ ఎడమకాలి మడమ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా ఈ 33 ఏళ్ల పేసర్ ఐపీఎల్-2024 సీజన్ మొత్తానికి దూరం కానున్నాడు. షమీ గాయానికి బ్రిటన్‌లో శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. వాస్తవానికి షమీ జనవరి చివరి వారంలో లండన్ లో చికిత్స పొందాడు. ప్రత్యేకమైన ఇంజెక్షన్లు తీసుకున్న మూడు వారాల తర్వాత తేలికపాటి వ్యాయామాలు చేయొచ్చని బ్రిటన్ వైద్యులు తెలిపారు. అయితే, ఆ ఇంజెక్షన్లు పనిచేయకపోవడంతో షమీ గాయం ఏమాత్రం నయం కాలేదు. ఇక షమీ గాయం తగ్గడానికి మిగిలున్న ఏకైక అవ కాశం శస్త్రచికిత్స అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. త్వరలోనే శస్త్రచికిత్స కోసం షమీ బ్రిటన్ వెళతాడని, ఐపీఎల్ తాజా సీజన్ లో ఆడే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ఐపీఎల్ మార్చిలో ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.

ఐపీఎల్-2024 షమీ దూరం

- వరల్డ్ కప్‌లో బౌలింగ్‌తో అదరగొట్టిన షమీ
- ఎడమకాలి మడమ గాయంతో జట్టుకు దూరం
- త్వరలో శస్త్రచికిత్స కోసం బ్రిటన్ పయనం
- వచ్చే నెలలో ఐపీఎల్ తాజా సీజన్ ప్రారంభం

వరల్డ్ కప్‌లో సంచలన బౌలింగ్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టు కున్న టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ ప్రస్తుతం గాయంతో సతమతమవుతున్నాడు. భారత్ లో జరిగిన వన్డే వరల్డ్ కప్ తర్వాత షమీ ఎడమకాలి మడమ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా ఈ 33 ఏళ్ల పేసర్ ఐపీఎల్-2024 సీజన్ మొత్తానికి దూరం కానున్నాడు. షమీ గాయానికి బ్రిటన్‌లో శస్త్రచికిత్స నిర్వహించనున్నారు.

వాస్తవానికి షమీ జనవరి చివరి వారంలో లండన్ లో చికిత్స పొందాడు. ప్రత్యేకమైన ఇంజెక్షన్లు తీసుకున్న మూడు వారాల తర్వాత తేలికపాటి వ్యాయామాలు చేయొచ్చని బ్రిటన్ వైద్యులు తెలిపారు. అయితే, ఆ ఇంజెక్షన్లు పనిచేయకపోవడంతో షమీ గాయం ఏమాత్రం నయం కాలేదు. ఇక షమీ గాయం తగ్గడానికి మిగిలున్న ఏకైక అవకాశం శస్త్రచికిత్స అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. త్వరలోనే శస్త్రచికిత్స కోసం షమీ బ్రిటన్ వెళతాడని, ఐపీఎల్ తాజా సీజన్ లో ఆడే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ఐపీఎల్ మార్చిలో ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.

చివరి బంతికి ఫోర్ కొట్టి ఆసీస్‌ను గెలిపించిన టిమ్ డేవిడ్

- మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన ఆస్ట్రేలియా
- చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్
- 216 పరుగుల భారీ లక్ష్యాన్ని 4 వికెట్లు కోల్పోయి ఛేదించిన ఆసీస్
- 44 బంతుల్లో 7 సిక్సర్లతో 72 పరుగులతో మిచెల్ మార్ష్ కెప్టెన్ ఇన్నింగ్స్

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో గత రాత్రి వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టీ 20లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది. చివరి వరకు విజయం ఇరు జట్ల మధ్య దోబూచులాడింది. ఆసీస్ విజయానికి చివరి బంతికి 4 పరుగులు అవసరం కాగా క్రీజులో ఉన్న డేవిడ్ బంతిని బౌండరీ పంపి జట్టుకు విజయాన్ని అందించిపెట్టాడు.

వికెట్ కీపర్ కాన్వే (63), రచిన్ రవీంద్ర (68) అర్ధ సెంచరీలతో విరుచుకుపడడంతో తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిన్ అలెన్ 32, గ్లెన్ ఫిలిప్స్ 19(నాటౌట్), చాప్‌మన్ 18 (నాటౌట్) పరుగులు చేశారు. అనంతరం 216 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కంగారూ జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ మిచెల్ మార్ష్ 44 బంతుల్లో 2 ఫోర్లు,

7 సిక్సర్లతో విరుచుకుపడి 72 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ట్రావిస్ హెచ్ 24, డేవిడ్ వార్నర్ 32, గ్లెన్ మ్యాక్స్‌వెల్ 25, జోష్ ఇంగ్లిష్ 20 పరుగులు చేయగా, చివరి బంతికి విన్నింగ్ ఫోర్ కొట్టిన టిమ్ డేవిడ్ 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

సినిమా

శ్రీవిష్ణు కొత్త చిత్రం ఓం భీమ్ బుష్

యంగ్ హీరో, కథల విషయంలో ఆచితూచి అడుగేసే శ్రీవిష్ణు సరికొత్త మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. గత సంవత్సరం 'సామజవరగమన' చిత్రంతో విజయం అందుకున్న ఆయన మరో హిలేరియస్ కామెడీ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నారు. 'బోచేవారెవరురా' చిత్రం తర్వాత శ్రీవిష్ణు , ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ మరోసారి కలిసి నటించడం విశేషం. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల్లో యు.వి. క్రియేషన్స్ బ్యానర్‌పై ఓ చిత్రం రూపొందుతోంది. హర్ష కొనుగంటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు 'ఓం భీమ్ బుష్' అనే ఆసక్తికర టైటిల్ ఖరారు చేశారు. 'నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్' అనే క్యాప్షన్ ఇచ్చారు. తాజాగా ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఓం భీమ్ బుష్ పేరు వినగానే ఏదో మంత్రం చదివినట్లు అనిపిస్తోంది. పోస్టర్ చూస్తే శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ వ్యోమగాముల పాత్రలు పోషించినట్లు తెలుస్తోంది. బ్రోచేవారెవరురా సినిమాతో హిట్ కొట్టిన ఈ ముగ్గురు మరోసారి నవ్వించడానికి రెడీ అవుతున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 22న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

గీతాంజలి మళ్లీ వచ్చేసింది

శ్మశానంలో టీజర్ లాంచ్ కార్యక్రమం

ఈమధ్య సినిమాల ప్రచారాలు కొంచెం విచిత్ర ధోరణిలోనే వెళుతున్నాయని చెప్పకోవచ్చు. 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' సినిమా చిత్ర నిర్వాహకులు కూడా వైవిధ్యంగా ఉండటం కోసమని ఏకంగా శ్మశానవాటికలోనే తమ సినిమా టీజర్ లాంచ్ చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారు. ఈ శనివారం రాత్రి 7 గంటలకు బేగంపేట్ స్మశాన వాటికలో 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' టీజర్ లాంచ్ చేస్తున్నాం అని ఆ చిత్ర పీఆర్ మీడియా వాళ్ళకి మెసేజ్‌లు పంపాడు. ఈ 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' సినిమా ఇంతకు ముందు విడుదలై ఘన విజయం సాధించిన 'గీతాంజలి' కి సీక్వెల్ గా వస్తోంది. ఇందులో అంజలి ప్రధానపాత్రలో నటించింది. శివ తుర్లపాటి దీనికి దర్శకుడు, కోన వెంకట్ కథని సమకూర్చారు, ఈ సినిమా నిర్మాణంలో కూడా భాగం అయ్యారు. ఇంకా ఇందులో శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్, సత్య, షకలక శంకర్, బ్రహ్మాజీ, రవి శంకర్, రాహుల్ మాధవ్ ఇంకా చాలామంది నటీనటులు నటించారు. ఈ సినిమా నటి అంజలికి 50వ సినిమా కావటం ఆసక్తికరం. ఈసారి ప్రచారాలు వినూత్నంగా ఉండాలని చిత్ర నిర్వాహకులు అనుకు న్నారేమో, అందుకని ఈ చిత్ర ప్రచార చిత్రాలు బేగంపేట లోని స్మశానవాటికలో చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. సినిమా నేపథ్యం హర్రర్ అవటం, ఇందులో దెయ్యాలు, ఆత్మలు లాంటివి ఉండటం మూలాన, స్మశానంలో ప్రచారం చెయ్యాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

కొత్త సినిమా షూట్‌తో రాజమౌళి ఆంక్షలు

కొత్త సినిమా కోసం మహేశ్ బాబును కొతత్గా చూపాలని స్టార్ డైరెక్టర్ రాజమౌళి యోచిస్తున్నారు. అందుకోసం మహేశ్ బాబును కేవలం షూటింగ్‌కే పరిమితం చేయాలని, బయటకన పకుండా చూడాలిన అనుకుంటున్నాడట. అందుకే అతను ఇక పబ్లిక్ గా కనిపించరాదని ఆంక్షలు పెట్టారని టాక్ నడుస్తోంది. మహేష్ బాబు ఎలాంటి ఈవెంట్స్ కు కానీ, మూవీ ఫంక్షన్స్ కు హాజరుకాకూడదని ఆదేశాలు జారీ చేశారట. ఇప్పుడు ఇదే న్యూస్ టాలీవుడ్ లో చక్కర్లు కొడుతుంది. ఇకపై మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించకూడదని ఎస్ఎస్ రాజమౌళి చెప్పినట్లు టాక్ వినిపిస్తుంది. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్స్ లో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే.. ఈ సినిమా కోసం మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా పాత్ర కోసం మహేష్ బాబు గెటప్ మార్చనున్నారు. అలాగే బాడీ బిల్డింగ్ కూడా చేయబోతున్నాడు. ఆయన కొత్త గెటప్ ఎలా ఉంటుందో జనాలకు తెలియకూడదు. అందుకే మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించవద్దని రాజమౌళి రూల్ పెట్టారని టాక్. మిగతా దర్శకులతో పోలిస్తే రాజమౌళి వర్క్ స్టైల్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. జక్కన్న సినిమాలు తీయడానికి చాలా సమయం తీసుకుంటాడు. అందుకు తగ్గట్టుగానే హీరోల లుక్స్ ను కూడా మార్చేస్తుంటారు ఇప్పుడు మహేష్ బాబు లుక్ ను కూడా మారుస్తున్నారట దర్శకుడు రాజమౌళి. అందుకు తగ్గట్టుగానే మహేష్ బాబు విదేశాలకు వెళ్లి మరీ శిక్షణ పొందుతున్నాడు. మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమా హిట్ అయినా కూడా అది మహేష్ బాబు అభిమాను లకు ఆశించిన స్థాయిలో కిక్ ఇవ్వలేకపోయింది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే బి÷-గగెస్ట్ మూవీగా నిలవనుంది. రాజమౌళి ఈసారి తన టెక్నికల్ టీమ్ లో కొన్ని మార్పులు చేయనున్నాడని అంటున్నారు. దాంతో సినీవర్గాల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది.

విడుదలకు సి202 హార్రర్ చిత్రం రెడీ

మైటీ ఒక్ పిక్చర్స్ పతాకంపై తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం 'సి 202'. మున్నా కాశి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ హార్రర్ థ్రిల్లర్ చిత్రానికి మనోహరి కె ఎ నిర్మాత. పూర్తి సినిమా రాత్రిపూట చిత్రీకరించబడిన ఈ సినిమా.. ప్రస్తుతం షూటింగ్ అంతా పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలలో బిజీగా ఉంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ విశేషం ఏమిటంటే.. ఒక్క డైలాగ్ కూడా లేకుండా ముఖ్య తారాగణాన్ని చూపిస్తూ.. కేవలం సౌండ్ ఎఫెక్ట్స్‌తో ఉండటం. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉండటమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. ట్రైలర్ విడుదల సందర్భంగా దర్శకుడు, హీరో అయిన మున్నా కాశి మాట్లాడుతూ.. 'సి 202' ఒక వైవిధ్యమైన కథతో తెరకెక్కించాం. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ చూస్తే అందరికీ అది అర్థమవుతుంది. ఒక డైలాగ్ కూడా లేకుండా క్యారెక్టర్‌లను చూపిస్తూ సౌండ్ ఎఫెక్ట్స్‌తో.. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సినిమాపై ఇంట్రస్ట్ కలిగించేలా ట్రైలర్‌ని కట్ చేశాం. ఈ ట్రైలర్‌ని 'సౌండ్ ఆఫ్ సి 202' అని పిలుచుకుంటున్నాము. ఈ ట్రైలర్‌ని మంచి సౌండ్ సిస్టమ్‌తో చూడండి, ఖచ్చితంగా సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతుంది. సినిమా విషయానికి వస్తే.. 'సి 202' చిత్రం ఆద్యంతం రాత్రిపూట చిత్రీకరించబడింది. ఈ సినిమాలో తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ వంటి సీనియర్ నటులు ప్రధాన పాత్రలు పోషించారు. వీరంతా ఇప్పటి వరకు చేయని పాత్రలో నటించి ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నారు. ఈ చిత్రంలో 21 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయి. అవన్నీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తాయి.. త్వరలోనే చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

ఎన్టీఆర్‌తో నటించాలని ఉంది : శ్రీశాంత్

సినిమాతో యంగ్ టైగర్ ఎన్టీఆర్ క్రేజ్ పాన్ ఇండియా స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కొమరం భీంగా అద్భుత నటన కనబర్చి గ్లోబల్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకున్నాడు విదేశాల్లోనూ ఎన్టీఆర్ కి భారీ స్థాయిలో అభిమానులు ఉన్నారు. ఇక ఎన్టీఆర్ ఫ్యాన్స్ జాబితాలో క్రికెటర్స్ కూడా ఉన్నారు. తాజాగా మరో క్రికెటర్ అయితే ఏకంగా ఎన్టీఆర్ తో నటించాలని ఉందంటూ తన మనసులో కోరికను బయటపెట్టాడు. టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ తాజా ఇంటర్వ్యూలో జూనియర్ ఎన్టీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తారక్ పై తనకున్న అభిమానాన్ని చూపుతూ తాజా ఇంటర్వ్యూలో శ్రీశాంత్ చేసిన కామెంట్స్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. ఈ మేరకు శ్రీశాంత్ మాట్లాడుతూ..' ఎప్పటికైనా ఎన్టీఆర్ తో నటించాలని ఉంది. ఎన్టీఆర్ నటన అంటే నాకు చాలా ఇష్టం. ఆయన డాన్స్ కి నేను పెద్ద ఫ్యాన్ ని. గతంలో ఒకసారి నేను ఎన్టీఆర్ ని కలిసాను. ఆ సమయంలో ఆయనతో మాట్లాడాను. మీరు బాగా డాన్స్ చేస్తారు అని చెప్పాను. దానికి ఆయన థాంక్స్ చెప్పడంతో పాటు సరదాగా ఫ్లయింగ్ కిస్ కూడా ఇచ్చారు. ఎన్టీఆర్ ని చూస్తే ఎంతో మోటివేట్ గా ఉంటుంది. నేను ఎన్టీఆర్ ని కలిసిన ఈవెంట్లో అల్లు అర్జున్ కూడా ఉన్నారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఒకప్పుడు ఇండియన్ బెస్ట్ బౌలర్స్ లో ఒకరిగా పేరు తెచ్చుకున్న శ్రీశాంత్ క్రికెట్ నుంచి రిటైర్డ్ అయిన తర్వాత 2017లో సినీ అరంగేట్రం చేశాడు. 'అక్సర్ 2' సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత కొన్ని సౌత్ సినిమాల్లో నటించాడు. చివరగా 'కాతువాకుల రెండు కాదల్' సినిమాలో కనిపించాడు. ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు కొన్ని సౌత్ సినిమాల్లో నటిస్తున్నాడు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
23 ఫిబ్రవరి 2024

తల్లిదండ్రులు, గురువుల ఆశయాలు నెరవేర్చాలి

● రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)

ఉన్నతమైన స్థాయికి చేరుకుని శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. గురువారం గుడిపేట 13వ బెటాలియన్ లో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు ముఖ్య అతిథిగా హాజరై రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాసులు ట్రైనింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ను ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. పోలీస్ నోటిఫికేషన్ వెలువడిన అనంతరం పోలీస్ ఉద్యోగ ఉత్తీర్ణత సాధించడం కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు అహోరాత్రులు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారన్నారు. అందులో కొందరికే ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. మీరూ అందులో ఉన్నారన్నారు. కనుక ట్రైనీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన శిక్షణా కేంద్రానికి తరలి వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్ళ ముందుగా సీపీ అభినందనలు తెలిపారు. సీపీ తన సక్సెస్ స్టోరీని శిక్షకులతో పంచుకున్నారు వాళ్లు కూడా తనలాగా కష్టపడి ఇక్కడే ఆగిపోకుండా ఇంకా ఉన్నత మైన స్థాయికి చేరి తమ తల్లిదండ్రుల, గురువుల ఆశయాలను నెరవేర్చాలని శిక్షకులలో స్ఫూర్తినింపారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నిం చాలని సీపీ అన్నారు. స్వీయ క్రమశిక్షణను పాటించా లన్నారు. నూతనంగా ఎంపికైన అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకొని పోలీసు శాఖ కు మంచి పేరు తీసుకురా వాలన్నారు. పోలీస్ వృత్తి ఉన్నతమైనదని నిరంతరం ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసి యూనిట్‌కు మంచి పేరు తీసుకురా వాలన్నారు. సమర్థత, వృత్తి నైపుణ్యం, నీతి నిజాయితీ తో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం కానిస్టేబుల్ శిక్షణకు సంబంధించిన పుస్తకాలను సిపి చేతులమీదుగా శిక్షకులకు అందించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష, మంచిర్యాల ఏసిపి రత్నపురం ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, యూనిక్ మెడికల్ డాక్టర్ శ్రీధర్, డానియల్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు ఇతర అధికారులు, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

భారంగా లేగదూడల సంరక్షణ

గోశాలకు తరలిస్తున్న ఆలయ అధికారులు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : పేదల కొంగు బంగారమైన ఎములాడ రాజన్నకు దేశంలో ఎక్కడ లేని విధంగా కోడె మొక్కులు చెల్లించుకుంటారు. రాజన్న ఆలయానికి కోడె మొక్కుల టిక్కెట్ల ఆదాయము సింహభాగం ఉంటుంది. ఆలయ అధికారులు భక్తులకు ప్రత్యేకంగా కొడే మొక్కుల క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. కొంతమంది భక్తులు నిజ కోడేలు తీసుకొచ్చి స్వామివారికి సమర్పిస్తారు. ఈ క్రమంలో భక్తులు పాలు మరవని ఆరు మాసాలు, ఎనిమిది మాసాల లేగ దూడలను తీసుకువస్తే ఆలయ అధికారులు వాటిని తీసుకోకపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో వదిలి వెళ్తారు. ఉదయం నుండి రాత్రి ఆలయం మూసివేసే వరకు ఆ లేగ దూడలు ఆలయ పరిసర ప్రాంతాలు ఉండడంతో విధి లేని పరిస్థితిలో ఆలయ అధికారులు వాటిని గోశాల తరలిస్తారు. ఇప్పటికే ఆలయ అధికారులు ఆలయ పరిసర ప్రాంతాల్లో లేగ దూడలను, జెర్సీలను తీసుకోమని ఫ్లెక్సీ లు ఏర్పాటు చేసిన భక్తులు మాత్రం పాలు మరువని లేగ దూడలను,జెర్సీ దూడలను తీసుకురావడంతో ఆలయ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆలయ అధికారులు గోవుల సంరక్షణ కొరకు ఒకటి జాతర గ్రౌండ్లో,మరొకటి తిప్పాపురంలో రెండు గోశాలలు ఏర్పాటు చేశారు. ఈ రెండు గోశాల్లో సుమారుగా 700,800 కోడెలు ఉంటాయి. వీటి సంరక్షణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తున్నారు.భక్తులు తీసుకువచ్చే పాలు మరువని లేగ దూడలు, జెర్సీ దూడలపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ అనారోగ్యానికి గురవుతూ మరణిస్తున్నాయి. గోశాలలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో ఒక పశు వైద్యాధికారిని నియామకం చేశారు. ఆ పశు వైద్యాధికారి గోషాలలో ఉన్న కోడెలకు ప్రతిరోజు వాటికి పరీక్షలు నిర్వహిస్తూనే ఉంటారు. ఈ చిన్న లేగ దూడలు ఇక్కడి వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతూ మరణిస్తున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు,అన్ని జిల్లా కేంద్రాలలో, రాష్ట్ర కేంద్రంలో, ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా ద్వారా చిన్న లేగ దూడలను భక్తులు తీసుకురావద్దని ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చిన్న లేగ దూడలు జెర్సీ దూడలతో ఇబ్బందులే..

రాజన్న ఆలయానికి భక్తులు తీసుకువచ్చే పాలు మరువని చిన్నా లేక దూడలు జెర్సీ దూడలతో మేము ఇబ్బందులు పడుతున్నామని ఆలయ ఏఈఓ శ్రీనివాస్ అన్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు తమ నిజ కోడేల మొక్కు బడిలో భాగంగా పాలు మరమని లేగ దూడెలను తేవడంతో వాటికి ఉన్న వైరస్ వుండడంతో పశు వైద్య అధికారి వాటిని పరిశీలించి వైద్యం చేస్తునరాన్నారు. సంచార పశు వైద్యశాల సిబ్బంది కూడా వారంలో మూడు రోజులు వారు కూడా కోడెల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తున్నరాన్నారు.వాటికి వున్న వివిధ అనారోగ్యాలతో మృతి చెందుతున్నాయని, ఇప్పటికైనా భక్తులు కనీసం రెండు,మూడు సంవత్సరాల నిజకోడే దూడేలను స్వామివారి మొక్కుబడి కింద తీసుకురావాలన్నారు.

- శ్రీనివాస్, ఆలయ ఏఈఓ

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం

● రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురావు సునీత రావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ పార్లమెంట్‌లో మహిళా మీటింగ్‌లో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకొని కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకొని రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని మహిళా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు తెలిపారు. పార్లమెంటు రివ్యూ మీటింగ్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు మందాడి రోహిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తున్నామని గొప్పలు చెబుతూ నిరంతరం మహిళలపై వేధింపులు జరుగుతున్నా గతంలో పట్టించు కోని బిఆర్ఎస్, బిజెపికి బుద్ధి చెప్పాలని యుద్ధ ప్రాతిపదికన మహిళా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈరోజు నిత్యవసర వస్తువులు సామాన్య ప్రజలు కొన లేని పరిస్థితిలో ఉన్నారని ప్రతి వస్తువు పైన జిఎస్టి వేసి ప్రజలను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంటనే నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీలు, బ్లాక్ అధ్యక్షులు, మండల కమిటీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు తమ కమిటీలను పూర్తిస్థాయిలో నియమించి క్షేత్రస్థాయిలో మహిళా కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసి మహాలక్ష్మి పథకం ద్వారా6 గ్యారంటీలతోపాటు మహిళల అభివృద్ధి కోసం పెద్దపీట వేసిందన్నారు. మహిళా మేనిఫెస్టో గురించి మహిళల అభిప్రాయాలను సేకరించి, రానున్న పార్లమెంటు ఎన్నికలలో మహిళలు అత్యధిక స్థానాలలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా సునీత రావు పార్టీ అధినాయకత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రకటించే కార్పొరేషన్ నియామకాల్లో మహిళా కాంగ్రెస్ శ్రేణులకు అధిక సంఖ్యలో కేటాయించాలని ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన1 నెల 15 రోజులలో 4 గ్యారెంటీ పథకాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ నెరవేర్చిందని సునీత రావు గారు అన్నారు. బిఆర్ఎస్ వాళ్లు అధికారం కోల్పోయి మతి భ్రమించి మాట్లాడుతున్నారని సునీతరావు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షురాలు నాగ శిరోమణి వనపర్తి జిల్లా అధ్యక్షురాలు శ్రీలత వైస్ ప్రెసిడెంట్ దుర్గారాణి. అధిత స్వప్నతోపాటు పార్లమెంటు పరిధిలోని ఆయా జిల్లాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, జిల్లా కమిటీల సభ్యురాళ్లు, మండల అధ్యక్షురాల్లు, పట్టణ అధ్యక్షురాల్లు, వార్డు అధ్యక్షురాళ్లతోపాటు తదితరులు పెద్ద ఎత్తును మహిళలు పాల్గొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో జలమార్గాల అభివృద్ధికి ప్రాజెక్టులు

● ప్రారంభించిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) : జలమా ర్గల అభివృద్ధికి ఈశాన్య రాష్ట్రాలు డిబ్రూఘర్‌లోని బోగీబీల్, కరీంగంజ్‌లోని బదర్‌పూర్, ధుబ్రిలోని ఐడబ్ల్యూఏఐ పోర్ట్, త్రిపురలోని సోనామురాలో చే సిన రూ.308 కోట్ల విలువైన పలు ప్రధాన ప్రాజెక్టు లను కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రారంభిం చి అభివృద్ధికి పెద్దపీట వేశారు. దిబ్రూగఢ్ సమీపం లోని బోగీబీల్ వద్ద ప్యాసింజర్-కమ్-కార్గో టెర్మినల్, త్రిపురలోని సోనామురాలో ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్, అస్సాంలోని కరీంగంజ్, బదర్ పూర్‌లో అప్‌గ్రేడ్ టెర్మినల్‌లను ప్రారంభించారు. ఈ టెర్మినల్ ప్రాంతంలో కార్గో, ప్రయాణీకుల కోసం ఐడబ్ల్యూని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషి స్తుందన్నారు. వాణిజ్యం వృద్ధికి మార్గం సుగమం చేస్తుందన్నారు. ధుబ్రీలో కస్టమ్ ఇమ్మిగ్రేషన్ కార్యా లయం నిర్మాణానికి అలాగే జోగిఘోపా టెర్మినల్ కోసం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తగా ప్రారంభించబడిన బోగీబీల్ టెర్మిన ల్ దాదాపు రూ.50 కోట్ల పెట్టుబడితో నిర్మించ బడుతోందన్నారు.

అవిశ్వాస తీర్మానంలో నెగ్గిన తూంకుంట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

శామీర్ పేట్ (జనం సాక్షి) : తూంకుంట మున్సి పాలిటీ కౌన్సిలర్లు చైర్మన్ రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ వాణిలపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో కౌన్సిలర్లు హాజరు కాక పోవడంతో వీగిపోయింది. తూంకుంట మున్సిపాలిటీలో16 మంది కౌన్సిలర్లలో 11 మంది అవిశ్వాస పరీక్షలో విఫలం అవడంతో చైర్మన్ రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ వాణి లపై పెట్టిన అవిశ్వాసం వీగిందని ప్రైసైడింగ్ అధికారి శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. అవిశ్వస పరీక్షలో ఎలాంటి గొడవలు జరుగకుండా అడిషనల్ డిసిపి నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ ఎమ్మార్వో యాదగిరి రెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి ఎమ్మెల్యేకు ముస్లిం జేఏసీ పరామర్శ

గాయపడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ను ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఎమ్మెల్యే లక్ష్మణ్ తొందరగా కోలుకుని ప్రజా జీవితాన్ని గడపాని ఆకాక్షించారు.

- హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)

'అడ్లూరి'కి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ

మంథని, (జనంసాక్షి) : ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గురువారం యశోద హాస్పిటల్‌లో కలిసి పరామర్శించారు. అలాగే వైద్యులతో మాట్లాడి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అనుచరులు ధైర్యంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఎమ్మెల్యే లక్ష్మణ్ త్వరగా కోలుకోవాలని, ప్రజా జీవితం లోకి రావాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు.

పారమిత విద్యార్థినికి 5 లక్షల నగదు పురస్కారం

● ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) : స్థానిక నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శుభశ్రీ సాహు తన శాస్త్రీయ ఆవిష్కరణలకు గాను వివో ఇగ్నైట్ టెక్నాలజ ఇన్నోవేషన్ అవార్డ - 2023 అందుకుంది. ఎన్‌సిఇఆర్‌టి - సిఐఇటి, ఐహబ్ దివ్యసంపర్క్ ఇన్నోవేషన్ సెంటర్, ఐఐటి రూర్కీ, ఉత్తరాఖండ్‌ల సహకారంతో 10 ఫిబ్రవరి 2024న న్యూఢిల్లీలోని వసంత్ కుంజ్‌లో జరిగిన వివో ఇగ్నైట్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అవార్డ్స్ గ్రాండ్ ఫినాలే లో శుభశ్రీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.నమిత గుప్తా సీనియర్ సైంటిస్ట్ (సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, భారత ప్రభుత్వం) చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకుంది. ఈ అవార్డులో భాగంగా ట్రోఫీ, ప్రశంసాపత్రం రూ.5,00,000 నగదు బహుమతిని అందుకుందని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు తెలిపారు. మొదట ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 20,000 మంది విద్యార్థులు వారి ప్రాజెక్ట్ లతో పాల్గొనగా రెండవ దశకు 200 ఉత్తమ ప్రాజెక్ట్ లు ఎంపిక చేయబడ్డాయి. ఈ 200 ప్రాజెక్ట్ ల నుండి 25 ఉత్తమ ప్రాజెక్ట్ లు మూడో దశ కు ఎంపిక చేయబడ్డాయి. మూడవ దశ కు ఎంపికైన 25 ఉత్తమ ప్రాజెక్ట్ ల నుండి 10 ఉత్తమ ప్రాజెక్ట్ లు వివో ఇగ్నైట్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అవార్డు గ్రాండ్ ఫినాలే కు ఎంపిక చేసారు. గ్రాండ్ ఫినాలే లో ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, దేశంలోని గొప్ప సంస్థలు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు న్యాయనిర్ణేతలుగా పాల్గొని ప్రాజెక్ట్ లను నిశితంగా అంచనా వేసి ఉత్తమ 5 ప్రాజెక్టు లను జాతీయస్థాయి విజేతలు గా ప్రకటించి బహుమతులను ప్రధానం చేసారు. శుభశ్రీ తన గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూలమైన, మల్టిఫంక్షనల్, తక్కువ ధర, పోర్టబుల్ వ్యవసాయ యంత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసిందని శుభ శ్రీ రూపొందించిన యంత్రం నూర్పిడి , ధాన్యాన్ని వేరు చేయడం, గడ్డిని కత్తిరించడం, వినోయింగ్ , బ్యాగ్ కుట్టడం వంటి నాలుగు వేర్వేరు కార్యకలాపాలతో సమర్థవంతంగా పని చేస్తుందని ఒకే ప్రక్రియలో మేతగా ఉపయోగించబడుతుందని శుభ శ్రీ తయారు చేసిన మోడల్ సౌర శక్తితో పనిచేస్తుందని తద్వారా అధిక విద్యుత్ వినియోగం, భారీ వ్యయం, యూనిట్ పనితీరు వంటి అంశాలను తొలగిస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి, అదనపు పాలనాధికారి లక్ష్మీకిరణ్, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు శుభశ్రీ ని ప్రత్యేకంగా అభినందిం చారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ... ఈ పరికరం సన్నకారు రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని, ఇలాంటి పరికరాలను మరిన్ని తయారు చేసి తమకు విక్రయిస్తే మేము మహిళా రైతులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, వినోద్ రావు, రాకేష్, వియుయం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ , గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు లు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105